
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



20

అమరావతి

విజయవాడ

★★★★★

బుధవారం 30 ఆగస్టు 2017



గిడుగు రామ్మూర్తి జయంతి సభను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

తెలుగు వెలుగుల కృష్ణా

● గిడుగు రామమూర్తి జయంతి సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

20



ట్రాఫికర్‌కు త్రిముఖ పరిష్కారం

- నగరం చుట్టూ ట్రయాంగిల్ బైపాస్‌లు
- ఆర్అండ్‌బీ వ్యూహ రచన
- ప్రత్యామ్నాయ రోడ్లకు ప్రతిపాదనలు
- రూ.23 కోట్లు కేటాయించిన ప్రభుత్వం

2 లో

నగరంలో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టడానికి, రోడ్లు భవనాల శాఖ (ఆర్అండ్‌బీ) త్రిముఖ వ్యూహం పన్నింది. నగరంలోకి ట్రాఫిక్‌ను కొంత మేర తగ్గించటానికి, వెలుపల నుంచి లోపలకు వచ్చే ట్రాఫిక్‌ను మళ్లించేందుకు ట్రయాంగిల్ బైపాస్‌ల అభివృద్ధికి శ్రీకారం చుడుతోంది. ఎన్‌హెచ్ - 65ను ఎన్‌హెచ్ - 16తో అనుసంధానం చేసి, విజయవాడ నుంచి ఈ రెండు జాతీయ రహదారుల మీదుగా ట్రాఫిక్ డైవర్షన్ చేయటానికి ఈ బైపాస్‌లను ప్రతిపాదించారు. నగరం మూడు దిశలా ట్రయాంగిల్ బైపాస్‌లకు ఆర్అండ్‌బీ రూపొందించిన ప్రతిపాదనలకు ఎట్టకేలకు మోక్షం కలిగింది.

విలువైన ఘనత

రాష్ట్రపతి నుంచి అర్జున అవార్డు అందుకున్న జ్యోతి సురేఖ



6

40 మందితో ప్రయాణిస్తున్న ఆర్టీసీ సీఎన్‌జీ బస్సు క్షణాల్లో అగ్నికి ఆహుతైంది. డ్రైవర్ వెంకటేశ్వరరావు ప్రయాణికులను అప్రమత్తం చేయటంతో పెనుప్రమాదం తప్పింది. అందరూ దిగగానే బస్సు కింద భాగంలో చెలరేగిన మంటలు దావానలంలా వ్యాపించాయి. చూస్తుండగానే బస్సు మొత్తం అగ్నికీలల్లో చిక్కుకుంది. ఆటోనగర్ నుంచి బయలు దేరిన ఈ బస్సులో సాంకేతిక సమస్యను గుర్తించిన డ్రైవర్ ప్రభుత్వాసుపత్రి సమీపంలో బస్సును నిలిపి కండక్టర్ సహాయంతో అందరినీ దింపివేయడంతో పెద్ద ప్రమాదమే తప్పింది.

17 లో

హా.. ఆర్టీసీ



- క్షణాల్లో అగ్నికి ఆహుతి
- డ్రైవర్, కండక్టర్ల అప్రమత్తతతో తప్పిన పెను ముప్పు
- 40 మంది ప్రయాణికులు సురక్షితం

ట్రాఫికర్‌కు... త్రిముఖం

- ● ఆర్‌అండ్‌బీ వ్యూహ రచన ● నగరం చుట్టూ ట్రయాంగిల్ బైపాస్‌లు
- ● ప్రత్యామ్నాయ రోడ్లకు ప్రతిపాదనలు ● నెం.1 : గొల్లపూడి - కొత్తూరు తాడేపల్లి.. వయా షాబాద
- ● నెం.2 : నున్న పవర్ గ్రిడ్ - గుణదల ఇన్నర్ రింగ్ వరకు
- ● నెం.3 : రామవరప్పాడు - ఆటోనగర్.. వయా బల్లెం వారి వీధి (ఎన్‌హెచ్ 16 - 65)
- ● రూ. 23 కోట్ల నిధులు కేటాయించిన ప్రభుత్వం
- ● నగరంలో ట్రాఫిక్ డైవర్షన్స్ కోసం.. సరికొత్త వ్యూహం

ఆంధ్రజ్యోతి, విజయవాడ : నగరంలో మెగా నిర్మాణాలు జరుగుతున్నాయి. బెంజ్‌సర్కిల్ ఫ్లై ఓవర్, దుర్గా ఫ్లై ఓవర్ పనులు జరుగుతున్నాయి. త్వరలో లైట్ రైల్ పనులు కూడా జరుగుతాయి. ఇప్పటికే విజయవాడ ట్రాఫిక్‌తో అట్టుడికిపోతోంది. మూడేళ్ళుగా బెజవాడ వాసులు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ కష్టాలు తీర్చలేకుండా ఉన్నాయి. నగరంలో పూర్తిగా ట్రాఫిక్‌ను తగ్గించగలదనుకున్న విజయవాడ బైపాస్ (కాజ - పెద అవుటపల్లి) అసలు సాకారం అవుతుందో, లేదో అన్న అనుమానాలు నెలకొంటున్నాయి. విజయవాడ - గుండుగొలను రోడ్డు ప్రాజెక్టులో అంతర్భాగంగా చేపట్టాల్సిన విజయవాడ బైపాస్ వచ్చే రెండేళ్ళలో అయినా సాకారం అవుతుందా అంటే ప్రశ్నార్థకంగానే ఉంది. విజయవాడ ట్రాఫిక్ కష్టాలను తీర్చగలిగే అతి ముఖ్యమైన ప్రాజెక్టు కంటే కూడా కనకదుర్గ ఫ్లైఓవర్, బెంజ్‌సర్కిల్ ఫ్లై ఓవర్లపైనే ఎక్కువగా దృష్టి సారించాల్సి వచ్చింది. బైపాస్ పనులు మొదలు కాకపోవడం... ఫ్లై ఓవర్ల నిర్మాణ పనులు సాగుతుండటంతో మరింత ట్రాఫిక్ సమస్యలు నెలకొన్నాయి. వీటికి తోడు లైట్ రైల్ ప్రాజెక్టు ఉండనే ఉంది.

దుర్గా ఫ్లై ఓవర్ ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితులు కనపడటం లేదు. రానున్న రోజుల్లో లైట్ రైల్ పనులు కూడా మొదలు పెడితే ట్రాఫిక్ సమస్యలు మరింత పెరుగుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో విజయవాడ నగరంపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గించటానికి ఆర్‌అండ్‌బీ అధికారులు ట్రయాంగిల్ బైపాస్‌లకు శ్రీకారం చుట్టారు. నగరం మూడు వైపులా వెలుపల నుంచి లోపలికి, లోపలి నుంచి వెలుపలికి ట్రాఫిక్‌ను తేలిగ్గా డైవర్షన్ చేయటానికి వీలుగా ఈ బైపాస్‌లకు ప్రతిపాదించారు. వాస్తవంగా ఆర్‌అండ్‌బీ ఈ రోడ్లకు ప్రతిపాదన చేసి చాలా కాలం అయింది. విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టు పనులకు టెండర్లను ఖరారు చేయనున్న నేపథ్యంలో ఈ ప్రత్యామ్నాయ బైపాస్‌లకు ప్రతిపాదించటం జరిగింది. మెట్రో ప్రాజెక్టు టెండర్లు రద్దు అయి లైట్ రైల్ డీపీఆర్ టెండర్ల దిశగా వెళుతున్న సందర్భంలో ఆ ప్రతిపాదనలకు మోక్షం లభించటం విశేషం. మెట్రో ప్రాజెక్టు లేకపోయనా.. లైట్ రైల్ ప్రాజెక్టు సాకారం కావటానికి ఇంకా సమయం ఉన్నా.. ఆర్‌అండ్‌బీ శాఖ ప్రతిపాదించిన ట్రయాంగిల్ బైపాస్‌లు మాత్రం విజయవాడ ట్రాఫిక్ కష్టాలను తీర్చటానికి అత్యంత అవసరం. ట్రయాంగిల్ బైపాస్‌లు ఏమిటో చూద్దాం...



గొల్లపూడి - కొత్తూరు తాడేపల్లి.. వయా షాబాద

విజయవాడ పశ్చిమ, వాయువ్య దిశల నుంచి ఉత్తర దిశవైపుగా మొదటి బైపాస్‌ను ఆర్‌అండ్‌బీ శాఖ ప్రతిపాదించింది. విజయవాడ శివారున ఉన్న గొల్లపూడి వై జంక్షన్ నుంచి షాబాద మీదుగా కొత్తూరు తాడేపల్లి వరకు మొత్తం 6 కిలోమీటర్ల దూరాన ఉన్న డొంక రోడ్డును డబుల్ లేన్ రోడ్డుగా విస్తరించాలని ఆర్‌అండ్‌బీ నిర్ణయించింది.

ఈ రోడ్డును అభివృద్ధి చేయటానికి ప్రభుత్వం రూ. 9.75 కోట్ల నిధులను కేటాయించింది. కృష్ణా పుష్కరాల ముందు ఈ రోడ్డు మరీ కుచించుకుని ఉండేది. అప్పట్లో పంచాయితీరాజ్ ఈ రోడ్డును 3.66 మీటర్ల మేర వెడల్పు చేసింది. ప్రస్తుతం ఈ రోడ్డును డబుల్ లేన్ రోడ్డుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. కొత్తూరు తాడేపల్లి వరకు ప్రతిపాదించటానికి రెండు కారణాలు ఉన్నాయి. ఆ ప్రాంతంలో విజయవాడ - గుండుగొలను ప్రాజెక్టులో భాగంగా విజయవాడ బైపాస్ రోడ్డు కలుస్తుంది. ఈ రోడ్డును బైపాస్‌కు అనుసంధానించటానికి అవకాశం ఉంది. దీంతో పాటు వెలగలేరు నుంచి, గణపవరం, రెడ్డిగూడెంల మీదుగా విస్సన్నపేట రోడ్డుకు అనుసంధానించటానికి కూడా మార్గం ఏర్పడుతుంది. ఎన్‌హెచ్-65 నుంచి ఎన్‌హెచ్-16కు అనుసంధానం చేయటానికి వీలుగా ఈ బైపాస్‌ను ఆర్‌అండ్‌బీ ప్రతిపాదించింది. ఈ రోడ్డు విస్తరణకు ఇప్పటికే రూ.3 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో కొంతమేర పనులు మొదలు పెట్టారు. తాజాగా చేసిన నిధుల కేటాయింపుతో బ్యాలెన్స్ పనులు ప్రారంభించనున్నారు. ఈ బైపాస్‌లో అంతర్భాగంగా బుడమేరు దగ్గర నూతన వంతెనను, పలు చోట్ల శ్లాబ్ కల్వర్టులు, కిలోమీటర్ మేర కాలువ వెంబడి రిటెయినింగ్ వాల్ పనులు చేపడతారు.

నున్న పవర్ గ్రిడ్ - ఇన్నర్ రింగ్..



నగర ఉత్తర దిశన ఇన్నర్ రింగ్ రోడ్డు కేంద్రంగా.. నగరం లోపల నుంచి అటు ఎన్‌హెచ్ - 16, ఇటు ఎన్‌హెచ్ 65లకు ట్రాఫిక్ డైవర్షన్ చేయటానికి వీలుగా ప్రతిపాదించిన బైపాస్ ఇది. నున్న పవర్ గ్రిడ్ నుంచి గుణదల వరకు రెండు వరసల బైపాస్‌ను ప్రతిపాదించారు. ఇప్పటికే పవర్ గ్రిడ్ నుంచి గుణదల వరకు బైపాస్‌ను అభివృద్ధి చేశారు. తాజాగా గుణదల నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డుకు అనుసంధానం చేయటానికి రెండు కిలోమీటర్ల స్ట్రెచ్ మిగిలి ఉంది. ఈ స్ట్రెచ్‌ను పూర్తి చేయటానికి ప్రభుత్వం రూ. 2 కోట్లను కేటాయించింది. ప్రస్తుతం ఈ స్ట్రెచ్ 3.66 మీటర్ల వెడల్పు ఉంది. దీనిని ఏడు మీటర్ల వెడల్పుతో అంటే డబుల్ లేన్ రోడ్డును అభివృద్ధి చేస్తారు.

రామవరప్పాడు - ఆటోనగర్... వయా బల్లెం వారి వీధి..



నగర ఈశాన్య దిశగా తూర్పు, దక్షిణ దిక్కుగా జాతీయ రహదారి - 16ను, జాతీయరహదారి - 65 తో అనుసంధానం చేయటానికి మూడవ బైపాస్‌గా రామవరప్పాడు - ఆటోనగర్.. వయా బల్లెం వారి వీధి బైపాస్ రోడ్డును నాలుగు వరసలుగా విస్తరించాలని ప్రతిపాదించారు. ఎగువ నుంచి వచ్చే ట్రాఫిక్‌ను రామవరప్పాడు జంక్షన్‌కు రాకుండానే.. బల్లెం వారి వీధి మీదుగా ఆటోనగర్‌కు అనుసంధానం చేయటానికి ఈ రోడ్డును ప్రతిపాదించారు. నాలుగు కిలోమీటర్ల మేర ఈ రోడ్డును విస్తరించి అభివృద్ధి చేయటానికి రూ. 12 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించింది. రామవరప్పాడు నుంచి 900 మీటర్ల వరకు 10 మీటర్ల వెడల్పు మాత్రమే రోడ్డు ఉంది. అక్కడి నుంచి 4.05 కిలోమీటర్ వరకు 7 మీటర్ల వెడల్పుగానే ఈ రోడ్డు ఉంది. ఇప్పుడీ రోడ్డును నాలుగు వరసలుగా అభివృద్ధి చేయాలంటే.. సెంట్రల్ డివైడర్‌తో కలిపి 15.50 మీటర్ల మేర విస్తరించాల్సి ఉంది. ఈ క్రమంలో భూ సేకరణ కూడా జరపాల్సి వస్తోంది. భూ సేకరణ కోసం ప్రభుత్వం రూ. 4 కోట్లను కూడా కేటాయించడం జరిగింది.

ట్రాఫిక్ సమస్యకు ప్రత్యామ్నాయం

ఈ మూడు బైపాస్‌లు కూడా నగర ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని గతంలో ప్రతిపాదించినవే. మెట్రో ప్రాజెక్టు పనుల నేపథ్యంలో, వీటిని ప్రతిపాదించటం జరిగింది. మెట్రోతో సంబంధం లేకుండా నగర వాస్తవ ఇబ్బందులకు ఈ ప్రత్యామ్నాయ బైపాస్‌లు దోహదపడతాయి. ఇప్పుడున్న నగర పరిస్థితుల రీత్యా ఈ మూడు రోడ్లు కూడా తేలిగ్గా నగరం లోపలి నుంచి వెలుపలికి, వెలుపలి నుంచి వచ్చే వాహనాలను లోపలికి రాకుండా బయట నుంచి డైవర్షన్ చేయటానికి అవకాశం ఏర్పడుతుంది.

- కే.శేషుకుమార్, ఎస్ఈ, ఆర్‌అండ్‌బీ

శ్రీవారి సమాచారం



తిరుమల తిరుపతి శ్రీవారి ఆర్జిత సేవలు వివరాలు టీటీడీ కళ్యాణ మండపంలోని ఈ దర్శనం కౌంటర్‌లో...

ప్రత్యేక దర్శనం : సెప్టెంబర్ 6 నుంచి నవంబరు 30 వరకు అందుబాటులో ఉన్నాయి.


కాటేజీలు : అక్టోబరు 25 నుంచి నవంబరు 30వ తేదీ వరకు అందుబాటులో ఉన్న ప్రకారం జారీ చేస్తారు.

ఆర్జితం : అక్టోబర్ 30, 31 తేదీలకు కల్యాణోత్సవం, దీపాలంకరణ, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్‌సేవ విశేష పూజా టిక్కెట్లను బుధవారం జారీ చేస్తారు.సెప్టెంబరు 23 నుంచి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో గరుడోత్సవం రోజు మినహా మిగిలిన రోజుల్లో అందుబాటులో ఉన్న ప్రకారం 300 టికెట్లను జారీ చేస్తారు.

గమనిక : ఇప్పటి వరకు 60 రోజులు ముందుగా జారీ చేస్తున్న నిజపాదం, సుప్రబాతం, అష్టాదళ పాదపద్మారాధన సేవలు ఈ కౌంటర్‌లలో జారీ చేయటం నిలిపివేశారు.

● రూ.300 టికెట్లు ఒక్కరు ఎంత మందికైనా పొందవచ్చు. సేవా టికెట్లు ఇద్దరికే జారీ చేస్తారు. టికెట్ల కోసం వెళ్ళే భక్తులు తమ గుర్తింపు కార్డును, టికెట్లు ఎవరికి తీసుకుంటు న్నారో వారి గుర్తింపు కార్డులు కూడా తీసుకువెళ్ళాలి. సేవా టికెట్లు 60 రోజులు ముందుగా, ప్రత్యేక దర్శనం టికెట్లు, కాటేజీలు 120 రోజులు ముందు ఖాళీగా ఉన్న ప్రకారం జారీ చేస్తారు.

దుర్గగుడిలో ఆర్జిత సేవలు



- ● తెల్లవారు జాము 3.00గంటలకు కవాట ఉద్ఘాటన. అనంతరం సుప్రభాత సేవ, ప్రాతఃకాలర్చాన, బాలభోగనివేదన, హారతి
- ● ఉదయం 6-7, 10.45-11.45, 4.45 నుంచి 5.45 గంటల వరకు త్రికాలార్చన
- ● 4 గంటలకు సర్వదర్శనం, 5 గంటల వరకు ఖడ్గమాల పూజ
- ● 6.30గం. అమ్మవారికి నివేదన
- ● ఉదయం 7 నుంచి తొమ్మిది గంటల మధ్య రుద్రహోమం
- ● ఉదయం 9 - 12.00 మధ్య లక్ష కుంకుమార్చన, శ్రీచక్రార్చన, చండీహోమం, శాంతి కల్యాణం
- ● 11 - 12 మధ్య సౌభాగ్య ప్రదాయనీ పూజ
- ● మధ్యాహ్నం 12 గంటలకు మహానివేదన
- ● సాయంత్రం 3.30 - 4.30 గంటల మధ్య స్వర్ణపుష్పార్చన
- ● సాయంత్రం 6- 6.30 పంచహారతులు
- ● రాత్రి 10 గంటలకు ఆలయం మూసివేత

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

సెల్‌ఫోన్‌కు చార్జింగ్ పెడుతుండగా సంఘటన

చిట్టినగర్: సెల్‌ఫోన్ చార్జింగ్ పెడుతూ ప్రమాద వశాత్తు విద్యుదాఘాతానికి గురై బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ఆంజనేయవాగు వడ్డెర కాలనీలో నివసిస్తున్న వరికుప్పుల దుర్గారావు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇతనికి కుమారుడు శ్రీను (14) ఉన్నాడు. కొన్నేళ్ల క్రితం భార్యాభర్తల మధ్య గొడవ జరిగి విడివిడిగా ఉంటున్నారు. కుమారుడు శ్రీను తల్లి విజయ వద్దే ఉంటూ అప్పడప్పుడు తండ్రి వద్దకు వచ్చి వెళ్తుంటాడు. సోమవారం తండ్రి వద్దకు వచ్చిన శ్రీను రాత్రి ఏడు గంటల సమయంలో పాడైన స్విచ్ బోర్డులో సెల్‌ఫోన్‌కు చార్జింగ్ పెట్టాడు. స్విచ్ వేయకుండా చార్జర్ వైర్ ఒకటి తెగటంతో బోర్డులో చార్జర్ పెట్టి నోటితో వైర్ తెంచి కలిపేందుకు ప్రయత్నించడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. 10 గంటల సమయంలో నిద్రలేచిన తండ్రి దుర్గారావు కుమారుడిని పిలిచాడు. పలకకపోవడంతో లైటు వేసి చూడగా అప్పటికే శ్రీను మంచంపై చనిపోయి ఉన్నాడు.

సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమితం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.


మృతి చెందిన శ్రీను

ఏడుగురిపై బైండోవర్ కేసులు

అజిత్‌సింగ్‌నగర్: వ్యభిచార కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న ఫిర్యాదుల మేరకు న్యూ రాజరాజేశ్వరిపేట ప్రాంతానికి చెందిన ఐదుగురు మహిళలు, ఇద్దరు పురుషులపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు మంగళవారం బైండోవర్ కేసులు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం గతంలో వ్యభిచారం నిర్వహిస్తూ పట్టుబడిన వారు తిరిగి బయట ప్రాంతాల నుంచి యువతులను తీసు కొచ్చి వ్యభిచారం చేయిస్తునారన్న సమాచారం మేరకు ఇన్‌చార్జి సీఐ ఎం.సత్యనారాయణ, ఎస్సై నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేశారు. సంబంధిత గృహాల్లో ఎవరూ పట్టుబడనప్పటికీ నిర్వాహకులకు హెచ్చరికలు జారీ చేస్తూ బైండోవర్ కేసులు పెట్టి, అర్బన్ తహసీల్దార్ ఎదుట హాజరుపర్చినట్లు పోలీసులు తెలిపారు.

గండిగుంటలో పట్టపగలు చోరీ

గండిగుంట (ఉయ్యూరు): గండిగుంటలో మంగళవారం పట్టపగలు చోరీ జరిగింది. దుండగులు ఓ ఇంటి తలుపు తాళాలు పగులగొట్టి బంగారు ఆభరణాలు, నగదు చోరీ చేశారు. బైపాస్ రోడ్డులోని అయ్యప్ప స్వామి ఆలయం ఎదురు రోడ్డులో నివసించే మట్టా సుందరయ్య ఇంటికి తాళం వేసి భార్యతో కలిసి విజయవాడ వెళ్లాడు. సాయంత్రం తిరిగి వచ్చేసరికి తలుపు గడియ పగులకొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా బెడ్‌రూంలోని రెండు బీరువాలు తెరిచి ఉన్నాయి. వాటిలోని రెండు కాసుల బంగారు గాజులు, చెవిపోగు, రెండు చిన్న పిల్లల ఉంగరాలు, రూ.2,500 చోరీ అయినట్లు గుర్తించి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ జి.వి.వి.సత్యనారాయణ, సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రలు సేకరించారు.


దొంగలు పగులగొట్టిన బీరువాలు, మంచంపై చిందరవందరగా సామగ్రి


ఏలూరు కాలువలో నుంచి మృతదేహాన్ని బయటకు తీస్తున్న సిబ్బంది

ఏలూరు కాలువలో గుర్తు తెలియని మృతదేహం

పెజ్జోనిపేట (పాతరాజరాజేశ్వరి పేట): ఏలూరు కాల్వలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని సత్యనారాయణపురం పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. పెజ్జోనిపేట మీసాల రాజారావు వంతెన వద్ద ఏలూరు కాలువలో మృతదేహం ఉండటాన్ని స్థానికులు గుర్తించి సత్యనారాయణపురం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని..

ఇంటి నుంచి వెళ్లిపోయిన యువతి

కంకిపాడు: ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారన్న ఓ యువతి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. పోలీసుల కథనం ప్రకారం కోమటిగుంటలాకులకు చెందిన ఓ యువతి (25) ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఇం ట్లో ఖాళీగా ఉంటుంది. ఇటీవల యువతికి వివాహం చేయాలని పెద్దలు నిశ్చయించారు. వివాహం చేసుకోవడం ఇష్టం లేని యువతి పచారీ షాపునకు వెళ్తున్నానని మంగళవారం ఉదయం ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


తనిఖీ చేస్తున్న డీఎస్పీ విజయపాల్

ఆటోనగర్‌లో విజిలెన్స్ దాడులు

ఆటోనగర్: జవహర్ ఆటోనగర్‌లోని పలు దుకాణాలపై మంగళవారం విజిలెన్స్ దాడులు జరిగాయి. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ ఆర్.విజయపాల్ ఆధ్వర్యంలో దాడి చేశారు. లైసెన్సు లేకుండా శ్రీ సిద్ధి వినాయక ట్రేడర్స్ వారు పచారీ సరకులు, పప్పులు, రెడీమెడ్ దుస్తులు, ఫ్యాన్సీ సరకులు, కాలం చెల్లిన కాస్మొటిక్స్ విక్రయిస్తుండటంలో దుకాణంపై కేసు నమోదు చేశారు. బియ్యం, పప్పులు, రవ్వలు సాంపిల్స్ సేకరించి లేబొరేటరికి పంపా రు. నివేదిక రాగానే యజమాని శివశంకరప్రసాద్‌పై చర్యలు తీసుకుంటామని విజయ్‌పాల్ తెలిపారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కళ్యాణి, ఆహార తనిఖీ అధికారి శేఖరరెడ్డి, విజిలెన్స్ సిబ్బంది ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


పట్టుకున్న కల్తీ నెయ్యిని చూపిస్తున్న జిల్లా ఫుడ్ కంట్రోలర్ పూర్ణచంద్రరావు

కల్తీ నెయ్యి తయారీ ఇంటిపై దాడి

పూర్ణానందంపేట (పాతరాజ రాజేశ్వరిపేట): అక్రమంగా కల్తీ నెయ్యి తయారు చేస్తున్న ఇంటిపై టాస్క్‌ఫోర్స్, ఆహార భద్రత శాఖాధికారులు, సత్యనారాయణపురం పోలీసులతో కలిసి సంయుక్తంగా దాడి చేశారు. పూర్ణానందంపేటలోని సంజీవరావు వీధిలో గత కొన్ని నెలలుగా ఇంటిని అద్దెకు తీసుకొని కల్తీ నెయ్యి తయారు చేస్తున్న జె.రవిని అదుపులోకి తీసుకున్నారు. పది కిలోల కల్తీనెయ్యి, 75 లీటర్ల పామోలిన్, 20 కిలోల వనస్పతి, వివిధ పేర్లతో ముద్రించిన సుమారు 2000 కవర్లు, నిషేధిత రంగులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు రవి గతంలో కూడా ఇలాగే పట్టుబడినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మురళీధర్, సీఐ ఆర్.సురేష్, జిల్లా ఆహార భద్రత శాఖ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ పూర్ణచంద్రరావు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సుందరరామిరెడ్డి, ఎస్ఎన్ పురం సీఐ సత్యనారాయణ పాల్గొన్నారు.


వివిధ పేర్లతో ముద్రించిన కవర్లు

కల్తీ చేస్తూ పట్టుబడితే కఠిన చర్యలు

కల్తీ ఆహార పదార్థాలను తయారు చేస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తీసు కుంటామని జిల్లా ఆహార భద్రత శాఖ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ పూర్ణచంద్రరావు హెచ్చరించారు. అలాగే నిషేధించిన గుట్కా, ఖైనీ వంటి వాటిని అక్ర మంగా నిల్వచేసి పదేపదే పట్టుబడితే నగర బహిష్కరణ విధించే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ నుంచి తమకు ఆదేశాలు అందాయన్నారు.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

జి.కొండూరు: మీ ఇంటికి-మీ భూమి గ్రామ సభల్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కె.సుధారాణి రైతులకు సూచించారు. మండలంలోని హెచ్.ముత్యాలంపాడు గ్రామంలో మంగళవారం మీ ఇంటికి-మీ భూమి గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 30 మంది రైతులు పలు భూ సమస్యల పరిష్కారం కోసం అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సరపల్లి చిన్నమ్మాయి, ఆర్ఐ షీమా, వీఆర్వో శివాజీ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

(మైలవరం)
సంఘమిత్ర: అర్జున్‌రెడ్డి
నారాయణ : వివేకం

రైతులకు బోరాన్ అందజేత



రైతులకు బోరాన్ అందిస్తున్న టీడీపీ నేతలు

జి.కొండూరు: స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం రైతులకు బోరాన్ ప్యాకెట్లను టీడీపీ నేత ఆలూరి రాజబాబు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ఉచితంగా సూక్ష్మ పోషకాలను అందిచడం అభినందనీయమన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏవో రాంకుమార్ మాట్లాడుతూ మండలానికి మరో 15 టన్నుల జింకు మంజూరైందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పంటాపంచల నరసింహారావు, కందుల విశ్వకుమార్, పజ్జూరు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కలుపు నివారణ ముఖ్యం: ఏవో పద్మజ

వరిలో కలుపు నివారణ ముఖ్యమని విజయవాడ రైతు శిక్షణా కేంద్రం వ్యవసాయాధికారిని బి.పద్మజ తెలిపారు. మండల పరిధిలోని వెల్లటూరు గ్రామంలో కలుపు మందుల వాడకంపై రైతులకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి నాటిన 20 రోజుల తర్వాత గడ్డి జాతి మొక్కల నివారణ చేసుకోవాలన్నారు. వాడిల్సిన మందులను వివరించారు. కార్యక్రమంలో మైలవరం ఏడీఏ కెనడీ, ఏవో రాంకుమార్ పాల్గొన్నారు.

సెల్ టవర్లను రెన్యువల్ చేయించుకోవాలి



కార్యదర్శులతో మాట్లాడుతున్న డీఎల్‌పీవో చంద్రశేఖర్

జి.కొండూరు: సెల్ టవర్లు ఉన్న భవన, భూ యజమానులు ప్రతి ఏటా విధిగా గ్రామ పంచాయతీలకు రూ.2 వేలు చెల్లించి రెన్యువల్ చేయించుకోవాలని డీఎల్‌పీవో చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఆయన కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో 75-2015 ప్రకారం సెల్ టవర్ భూమిపై నిర్మిస్తే రూ.25 వేలు, భవనంపై ఏర్పాటు చేస్తే రూ.20 వేలు పంచాయతీకి చెల్లించాలన్నారు. అలాగే ప్రతి ఏడాది రెన్యువల్ ఫీజు చెల్లించాలన్నారు. గ్రామానికి రెండు నుంచి మూడు టవర్స్ ఉన్నాయని వెంటనే వారు పంచాయతీలకు ఫీజులు చెల్లించాలని, అలా చేయని వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను ఆదేశించారు. గ్రామాల్లో వెంటనే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయించాలని డీపీఆర్‌సీ నుంచి వచ్చిన దుర్గా ప్రసాద్ సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శులు కుసుమ, బసవలింగేశ్వరరావు, విజయ్‌కుమార్, సీహెచ్ ప్రసాద్ పాల్గొన్నారు

రైతు సదస్సుల్లో 975 అర్జీలు

మైలవరం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన మీ ఇంటికి-మీ భూమి కార్యక్రమంలో భాగంగా మైలవరం మండల రైతులు 975 అర్జీలు సమర్పించినట్లు తహసీల్దార్ కేవీ శివయ్య తెలిపారు. మండల పరిధిలోని గ్రామాల్లో మొత్తం 19 రైతు సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా సదస్సుల్లో రైతులు పలు భూ సమస్యలపై అర్జీలు ఇచ్చారన్నారు. వీటిలో కౌలురైతులు రుణాలు కోరుతూ 110 అర్జీలు, అడంగల్ కాపీల్లో తప్పొప్పులు సరిచేసేందుకు 316, ఆధార్ అనుసంధానం కోసం 65, ఆధార్‌లో తప్పుల సవరణకు 113, భూముల సర్వేకై 21, కొత్త పాస్ పుస్తకాల కోసం 350 దరఖాస్తులు అందా యన్నారు. వాటిని పరిశీలించి తప్పుల్ని సరిచేసి సెప్టెంబర్ 1 నుంచి 10 వరకూ ఆయా గ్రామాల్లోని రైతులకు ఇంటింటికి వెళ్లి రెవెన్యూ సిబ్బంది అందిస్తారని తెలిపారు. భూ సమస్యలు నూరు శాతం పరిష్కారం కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నటు తెలిపారు.

గొల్లపూడి-జక్కంపూడి రహదారికి మహర్దశ

● రూ.9.75 కోట్లతో అభివృద్ధి ● మంత్రి ఉమాకు గ్రామస్థుల కృతజ్ఞతలు



అభివృద్ధి చేయనున్న గొల్లపూడి-జక్కంపూడి-షాబాద రోడ్డు

గొల్లపూడి: రూ.9.75 కోట్ల నిధులతో గొల్లపూడి నుంచి జక్కంపూడి వరకు మూడు మీటర్ల వెడల్పుతో ఉన్న బీటీ రోడ్డును అభివృద్ధి చేయనున్నారు. ఈ రహదారిని ఆరు మీటర్ల వరకు వెడల్పు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించడంతో ఆయా గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మొత్తం ఆరు కిలోమీటర్లు ఉన్న గొల్లపూడి-జక్కంపూడి-షాబాద రోడ్డుకు అతి త్వరలో రూపురేఖలు మారిపోనున్నాయి. నిధుల మంజూరనకు కృషి చేసిన మంత్రి దేవినేని ఉమాకు గొల్లపూడి ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి ఉమా గ్రామాన్ని దత్తత తీసుకున్న దగ్గర నుంచి గ్రామంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని స్థానిక టీడీపీ నేతలు పేర్కొన్నారు.

మీ ఇంటికి-మీ భూమితో రైతులకు మేలు

గొల్లపూడి: రైతు సేవలో రెవెన్యూ శాఖ కార్యక్రమం ద్వారా రైతులుకు మేలు జరుగుతుందని రూరల్ తహసీల్దార్ మదన్‌మోహన్ తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం మీ ఇంటికి-మీ భూమి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో చాలా రైతు సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. మండలంలో చివరిరోజు కార్యక్రమం నిర్వహించినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు చందు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



రైతుల వద్ద నుంచి వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దార్ మదన్‌మోహన్

రెండు బైకులు ఢీ.. ఇరువురికి తీవ్ర గాయాలు

మైలవరం: మైలవరం మండలం పుల్లూరు వద్ద మంగళవారం రాత్రి రెండు మోటారు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పుల్లూరుకు చెందిన సుంకర కృష్ణామాచారి(50), కొత్తగూడెంకు చెందిన కాలంగి సుబ్బారావు(50) వేరు వేరు బైక్‌లపై ఒకరి వెనుక ఒకరు వెళుతూ ఢీ కొట్టుకున్నారు. దీంతో బైక్‌లపై నుంచి కింద పడి ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. 108లో మైలవరం ప్రభుత్వాసుపత్రికి వీరిని చికిత్స నిమిత్తం తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



విద్యార్థులతో కంపెనీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

జి.కొండూరు: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రతినిధి ఆనీల్‌కుమార్ సూచించారు. ఇండియన్ ఆయిల్ డే సందర్భంగా జి.కొండూరు జడ్పీ పాఠశాలలో మంగళవారం స్వచ్ఛభారత్ మిషన్‌పై అవగహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. తడి, పొడి చెత్త వేసేందుకు డబ్బాలను అందించారు. హెచ్ఎం రాజశేఖర్, కంపెనీ ప్రతినిధులు శ్రీకృష్ణ, రెడ్డినాయుడు పాల్గొన్నారు.

పొదుపు ఖాతాలను వేతన అకౌంట్లుగా మార్చాలి

రెడ్డిగూడెం: మండల పరిధిలో పనిచేస్తూ స్థానిక ఎస్‌బీఐ బ్రాంచిలో పొదుపు ఖాతాలు ఉన్న ఉపాధ్యాయుల అకౌంట్లను వేతన అకౌంట్లుగా మార్చాలని బ్రాంచి మేనేజర్ అనిల్‌సాగర్‌కు ఎస్టీయూ మండల శాఖ మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు ప్రసాద్, అనుగ్రహప్రసాద్, ఎస్‌కే హబీబుల్లా, బొంబోతు శ్రీనివాసరావు, గాంధీ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీహార్ బాధితులకు ముస్లిం మత గురువుల చేయూత



బీహార్ వరద బాధితులకు సాయం వివరాలు తెలియజేస్తున్న ముస్లిం మతగురువులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): బీహార్ వరద బాధితులకు ముస్లిం మతగురువులు చేయూత అందించనున్నట్లు ఏపీ ఉల్ మాయే అహ్లేసున్నత్ మతగురువుల బృందం అధ్యక్షుడు ఎం.ఎ. అల్తాఫ్ రజా తెలిపారు. కొండపల్లి షాబుఖారీ మసీద్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్తాఫ్ రజా మాట్లాడుతూ బీహార్ రాష్ట్రంలో వరద బీభత్సంనకు గురై ఎంతో మంది పేదలు నిరాశ్రయులు అవటంతో వారిని ఆదుకునేందుకు తమ వంతు సాయం అందించేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు. మతగురువులు మసీదులకు మాత్రమే పరిమితం కారని ఇస్లాంలో పేద వారి ఆకలి తీర్చటమే నిజమైన పండుగ వస్తుందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ముస్లిం సోదరులు తమ జీతాల్లో నుంచి బీహార్ బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అల్తాఫ్ రజా తన వంతుగా రూ.31 వేలు ప్రకటించారు. మరి కొంత మంది ప్రకటించి అందజేయగా తొలిరోజు రూ.70 వేలు సమకూరినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలు మసీద్‌లకు చెందిన మతగురువులు పాల్గొన్నారు.

మునిగిన వరి పొలాలు

జి.కొండూరు: గత రాత్రి కురిసిన భారీ వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండలంలో ఆది, సోమవారాల్లో రెండు రోజుల్లో సుమారు 53.8 మి.మీటర్ల వర్షపాతం నమోదయ్యింది. దీంతో వాగులు, వంకలు కదిలాయి. మండలంలోని హెచ్.ముత్యాలంపాడులో పల్లంలో ఉన్న సుమారు 50 ఎకరాలు, కవులూరు గ్రామంలో తొమ్మండ్రు వాగు, గుర్రాల వాగులు పొంగడంతో సుమారు 100 ఎకరాలకు పైగా ముంపుబారిన పడ్డాయి. సరైన వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతులకు నిన్నటి వాన ఊపిరి పోసింది. ఇంకా వర్షాలు పడే అవకాశం ఉందని తెలియడంతో మాగాణి రైతులు హర్షం వ్యక్తం చేసున్నారు. మెట్టకు మాత్రం వర్షం చేటు చేసే అవకాశాలు ఉన్నాయి.



కవులూరులో మునిగిన వరి పొలాలు

వేంకటేశ్వరస్వామి కల్యాణం రేపు

మైలవరం: ద్వారకా తిరుమల దేవస్థానం వేంకటేశ్వరస్వామి కల్యాణం మైలవరంలో గురువారం నిర్వహించనున్నట్లు దేవస్థానం చైర్మన్ ఎస్వీ సుధాకరరావు తెలిపారు. ఈ మేరకు ద్వారకా తిరుమల దేవస్థానం(చిన్నతిరుపతి) నుంచి ప్రత్యేక ప్రచార రథంలో స్వామి గురువారం ఉదయం విచ్చేస్తున్నారన్నారు.

ఉదయం 9 గంటలకు స్థానిక ఎస్వీఎస్ కల్యాణ మండపంలో ద్వారకా తిరుమల ఉత్సవ మూర్తులకు అత్యంత వైభవంగా కల్యాణ మహోత్సవం జరగనుందని ఆయన తెలిపారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

మైలవరం టౌన్: తెలుగు భాష కోసం దివంగత గిడుగు వెంకటరామ్మూర్తి అందించిన సేవలు ప్రశంసనీయమని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బండి రామారావు పేర్కొన్నారు. స్థానిక వివేకానంద హైస్కూల్లో మంగళవారం తెలుగు భాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎంవీ శ్రీనివాసరావు, కరస్పాండెంట్ పి.రాజారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

మాతృభాష దినోత్సవాన్ని ఎల్బీఆర్‌సీఈ కళాశాల, డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులకు వకృత్వం, వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమాల్లో ప్రెసిడెంట్ జి.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు, డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు, అధ్యాపకులు బి.ప్రకాశం, ఎం.సుందరరావు పాల్గొన్నారు.

గొల్లపూడిలో స్థానిక ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్‌లో ధ్యాన్‌చంద్‌ను స్మరిస్తూ జాతీయ క్రీడాదినోత్సవం, గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగుబాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. అష్టదిగ్గజ కవులతో పాటు ఆదికవి నన్నయ్య, తిక్కన, ఎర్రన, పోతన వేషధారణలో వచ్చిన చిన్నారులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ కొమ్మారెడ్డి చైతన్య, ఇన్‌చార్జులు వాణి, పద్మజ, పీఈటీ సోమయ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కొండపల్లిలో.. గిడుగు రామ్మూర్తి వేషధారణలో చిన్నారులు



మైలవరంలో.. ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

ఎన్టీటీపీఎస్(ఇబ్రహీంపట్నం)లో వ్యవహారిక భాషా పితామహుడు తెలుగు భాష దినోత్సవం ఎన్టీటీపీఎస్ పరిపాలనా భవన సముదాయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్టీటీపీఎస్ జనరల్ మేనేజర్ డి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొండపల్లి డీఏవీ పాఠశాలలో గిడుగు రామమూర్తి 154 జయంతి సందర్భంగా ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు ఉపాధ్యాయులు గంగాభావాని పాల్గొన్నారు.

జి.కొండూరులో ప్రతి ఒక్కరూ మాతృ భాషను మరువకూడదని కొల్లి నాగేశ్వరరావు పేర్కొన్నారు. గిడుగు రామూర్తి పంతులు జయంతి సందర్భంగా స్థానిక ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్లో మంగళవారం తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాష గొప్పతనాన్ని తెలిపేలా విద్యార్థులతో పలు కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంగ్లీష్ మీడియంలో చదువుతున్నప్పటికీ తెలుగులో అనర్గళంగా మాట్లాడటం, చదవడం విద్యార్థులు నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.అశోక్, హెచ్ఎం కట్టా రామారావు పాల్గొన్నారు.

పచ్చపెసలు మద్దతు ధర రూ.5575

మైలవరం: పచ్చపెసలకు ప్రభుత్వం మద్దతు ధర క్వింటాకు రూ.5575 ప్రకటించినట్లు మైలవరం మార్కెట్ కమిటీ కార్యదర్శి మాధవరావు తెలిపారు. అంతేకాకుండా 2017-18లో వివిధ వ్యవసాయ ఉత్పత్తుల కనీస మద్దతు ధరలను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ధాన్యం కామన్ రకం రూ.1550, ఏగ్రేడ్ రకం రూ.1590, జొన్నలు హైబ్రీడ్ రూ.1700, జొన్నలు మాల్‌దండి రూ.1725, సజ్జలు రూ.1425, మొక్కజొన్నలు రూ.1425, రాగి రూ.1900, కందులు రూ.5450, పెసలు రూ.5575, మినుములు రూ.5400, వేరుశనగ రూ.4450, సోయబీన్ రూ.3050, పొద్దు తిరుగుడు రూ.4100, గడ్డినువ్వులు రూ.4050, నువ్వులు రూ.5300, పత్తి మీడియం రూ.4020, ప్రత్తిపొడవు రకం రూ.4320 మద్దతు ధరగా ఉన్నట్లు తెలిపారు.

నంద్యాల తీర్పు వైసీపీకి చెంపపెట్టు

● మాజీ ఎమ్మెల్యే జ్యేష్ఠ

జి.కొండూరు: నీతికి-అవినీతికి అధర్మానికి-ధర్మానికి మధ్య నంద్యాలలో జరిగిన ఉప ఎన్నికలో టీడీపీని గెలిపించి ప్రజలు వైసీపీ నేతలకు చెంప పెట్టులాంటి తీర్పునిచ్చారని మాజీ ఎమ్మెల్యే జ్యేష్ఠ రమేష్‌బాబు అన్నారు. మంగళవారం ఆయన కుంటముక్కల్లో విలేకర్లతో మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్ నంద్యాల ఉప ఎన్నిక ప్రచారంలో చంద్రబాబుపై చేసిన అనుచిత వ్యాఖ్యలు, చక్రపాణి, రోజా తదితరులు చేసిన వ్యాఖ్యలు నంద్యాల ఓటర్లు గమనించి మంచి తీర్పును ఇచ్చారన్నారు. 2019లోను టీడీపీని గెలిపించడం ఖాయమన్నారు.

చంద్రబాబుపై విమర్శలు చేస్తే ఊరుకోం

గొల్లపూడి: రెఫరెండం అని కారు కూతలు కూసిన వైసీపీ నేతలు ఇప్పుడు మాటమార్చారని రూరల్ మండలం గొల్లపూడి గ్రామ టీడీపీ అధ్యక్షుడు నర్రా వాసు పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుపై విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు. గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. సెప్టెంబర్ 7వ తేదీన చింతలపూడి ఎత్తిపోతల పథకానికి భూమిపూజ, పైలాన్ ఆవిష్కరణ ముఖ్యమంత్రి బహిరంగ సభ, సెప్టెంబర్ 11వ తేదీ నుంచి చేపట్టిన ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వేర్వేరు కేసుల్లో ఐదుగురు అరెస్టు



వివరాలు తెలియజేస్తున్న సీఐ రామచంద్రరావు, ఎస్సై రామకృష్ణ

మైలవరం: మైలవరంలో ఈ నెల 21 రాత్రి మడ్డి ఆయిల్ వ్యాపారి ఎం.రామకృష్ణను కొట్టి గాయపర్చిన ముగ్గురు వ్యక్తుల్ని మైలవరం పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. రామకృష్ణ ద్విచక్ర వాహనంపై వస్తుండగా మద్యంషాపు నుంచి బయటకు వచ్చిన కొమ్మనబోయిన నాగరాజు, మిర్యాల ఆసిన్, గుమ్మళ్లపరుపు సాయికుమార్‌లు తాగిన మైకంలో రామకృష్ణపై మూకుమ్మడిగా దాడిచేసి గాయపరిచారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇద్దరు వ్యక్తులు స్పెషలాఫీసర్లమంటూ ఈ నెల 25 ఉదయం స్థానిక బస్టాండ్ సమీపంలో ఆటోలు ఆపి వారి నుంచి డబ్బులు వసూలు చేశారు. దీనిపై ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఖమ్మం జిల్లాకు చెందిన యనమదల హరీష్, మైలవరానికి చెందిన తమ్మిశెట్టి వెంకయ్యలను మంగళవారం అరెస్టు చేశారు. వీరిని సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాల ఆధారంగా అరెస్టు చేసినట్లు సీఐ పి. రామచంద్రరావు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పొలం తగాదాలో.. జరిమానా

జి.కొండూరు: మండల కేంద్రమైన జి.కొండూరు పీఏసీఎస్ వద్ద 2013లో పొలం విషయంలో జరిగిన ఘర్షణలో ఒక వ్యక్తిని గాయపర్చిన కేసులో ముగ్గురు ముద్దాయిలకు మైలవరం జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి ఎస్.వరలక్ష్మి అపరాధ రుసుం విధించినట్లు ఏఎస్సై రామారావు తెలిపారు. వెలగలేరు గ్రామానికి చెందిన చల్లా బాబురావు అనే వ్యక్తికి గడ్డమణుగు గ్రామానికి చెందిన నెప్పల్లి మధుసూదనరావు, నెప్పల్లి అంజయ్య, నెప్పల్లి సతీష్ అనే వారికి గడ్డమణుగులో ఉన్న 3.76 ఎకరాల పొలం విషయంలో గొడవలు ఉన్నాయి. ఈ మేరకు బాబురావును ఆ ముగ్గురు గొడ్డలి కర్తలో కొట్టి గాయపర్చారు. ఈ కేసులో ఆ ముగ్గురు వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ.3,500 చొప్పున అపరాధ రుసుం విధిస్తూ తీర్పునిచ్చారని పోలీసులు తెలిపారు.

జక్కంపూడి రహదారి అభివృద్ధికి రూ.9.75 కోట్లు

జక్కంపూడి (విజయవాడ రూరల్): జక్కంపూడి-గొల్లపూడి రహదారిని రూ.9.75 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయనున్నట్లు విజయవాడ ఏఎంసీ మాజీ చైర్మన్ జాలిపర్తి గోపాలకృష్ణ తెలిపారు. మంత్రి దేవినేని ఉమా కృషితో రహదారి అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. జక్కంపూడి గ్రామ పంచాయితీ పరిధిలో షాబాద కాలనీలో రూ.46 లక్షల వ్యయంతో జరుగుతున్న రహదారి అభివృద్ధి పనుల్ని ఆయన మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ము రవి, నాయకులు గంధం సుబ్బారావు, రాయుడు శ్రీనివాసరావు, తిమ్మన కొండలరావు, నాగరాజు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జాలిపర్తి గోపాలకృష్ణ

టీడీపీతోనే పేదలకు ఆరోగ్య భద్రత

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): టీడీపీ హయాంలోనే పేదలకు ఆరోగ్య భద్రత ఉంటుందని ఎంపీపీ చీదిరాల ప్రసూన పేర్కొన్నారు. కొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డీఏవీ పాఠశాల్లో మంగళవారం విద్యార్థులకు ఎమ్మార్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలో 58 పాఠశాలల్లో ఇప్పటి వరకు 12వేల మంది విద్యార్థులకు ఎమ్మార్ వ్యాక్సిన్ వేసిన వైద్య సిబ్బందికి అభినందనలు తెలిపారు. సెప్టెంబర్ నెలాఖరు నాటికి డ్రాపవుట్ పిల్లలకు, ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారిని గుర్తించి వ్యాక్సిన్ వేసేలా వైద్యధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. 15 ఏళ్ల లోపు పిల్లలందరికి వ్యాక్సిన్ వేయించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మార్ వ్యాక్సిన్ కార్యక్రమంలో ఎంపీపీ ప్రసూన

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకురావాలి

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి విలాస్‌రావ్ అవుతే పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి జిల్లా ఎన్నికల అధికారిగా నియమితులై తొలిసారిగా జిల్లా కు వచ్చిన సందర్భంగా, మైలవరం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బొర్రా కిరణ్ నియోజకవర్గ బూత్ కమిటీ సభ్యుల జాబితాను జిల్లా అధ్యక్షుడు ధనేకుల మురళీ, మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీల సమక్షంలో విజయవాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం అవుతేకు అందజేశారు. ప్రతి నియోజకవర్గంలో సభ్యత్వాలు పూర్తి చేసి కార్యకర్తల అభ్యున్నతికి నాయకులు కృషి చేయాలన్నాన్నారు. డీసీసీ ఉపాధ్యక్షుడు పోతురాజు ఏసుదాసు, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు శీలం రాజా, జమిల్ బేగ్, ఎస్టీ సెల్ చైర్మెన్ కాండ్రకొండ అప్పారావు, ఎం.ఎ.కె.జిలాని, కరుకుమల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



విలాస్‌రావ్‌కు బూత్‌కమిటీల జాబితా అందజేస్తున్న డీసీసీ అధ్యక్షుడు మురళీమోహన్, ఉపాధ్యక్షుడు పోతురాజు ఏసుదాసు

చంద్రన్న బీమా అందజేత

జి.కొండూరు: మండలంలోని కుంటముక్కల గ్రామంలోఅనారోగ్యంతో మృతి చెందిన షేక్ జిలానీ(43) తల్లి జాహేదాకు మంగళవారం చంద్రన్న బీమా తక్షణ సాయం కింద మంజూరైన రూ.5 వేలను టీడీపీ నేతలు అందజేశారు. కార్యక్రమంలో లంక రామకృష్ణ, గోళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు ఎన్.రామారావు, మౌనికా, నిరోషా తదితరులు పాల్గొన్నారు.

• న్యూ ఢిల్లీలో రాష్ట్రపతిచే అర్జున అవార్డు అందుకున్న జ్యోతి సురేఖ
• ఆనందోత్సాహాల్లో కుటుంబ సభ్యులు, అభిమానులు
• నేడు విజయవాడలో ఘన స్వాగతం

విలువైన ఘనత



విజయవాడ/చెరుకుపల్లి: రాజధాని అమరావతి ఆర్చరీ జెండా ఢిల్లీలో రెపరెపలాడింది. అర్జున అవార్డును అందుకుని క్రీడా మణిరత్నంగా మెరిసింది. వెన్నం జ్యోతి సురేఖ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నుంచి అర్జున అవార్డును అందుకుంది. క్రీడా దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా ఎంపికయిన క్రీడాకారులకు పలు అవార్డులను అందజేశారు. అందులో భాగంగా ఆర్చరీ తరఫున ఎంపికయిన జ్యోతి సురేఖకు అవార్డును అందజేశారు. పిన్న వయసులోనే ఉన్నత స్థానానికి చేరిన జ్యోతి సురేఖ, ఆమె తల్లిదండ్రులు 'ఆంధ్రజ్యోతి'తో తన అనుభూతులను పంచుకున్నారు. తమ కుమార్తె ఈ స్థాయికి చేరుకునేందుకు సమయంతో పోటీపడుతూ కృషి చేసిందని, కష్టానికి తగ్గ ఫలితం దక్కిందని జ్యోతి సురేఖ తల్లిదండ్రులు వెన్నం సురేంద్రకుమార్, శ్రీదుర్గ ఆనందం వ్యక్తం చేశారు. తన క్రీడా తపన గురించి మొదట్నుంచి తమకు తెలుసునని రాబోయే రోజుల్లో తను వరల్డ్ చాంపియన్‌షిప్‌లో మెడల్ సాధించడంతోపాటు ర్యాంకింగ్‌లో కూడా అత్యుత్తమ స్థానాన్ని చేరాలని కోరుకుంటున్నామన్నారు. క్రీడలతో పాటు చదువులోనూ తను ఎంతో పట్టుదలగా ఉంటుందని చెప్పారు.

అంచెలంచెలుగా ఎదిగి..

జ్యోతి సురేఖ ఆర్చరీలో గ్రామీణ స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగారు. చెరుకుపల్లి మండలం నడింపల్లి గ్రామానికి చెందిన వెన్నం సురేంద్రకుమార్, శ్రీదుర్గ దంపతులకు జూలై 3, 1996లో సురేఖ జన్మించారు. ఒకటి నుంచి ఇంటర్ వరకు విజయవాడ నలంద విద్యాసంస్థల్లో విద్య పూర్తి చేశారు. కేఎల్ యూనివర్శిటీలో ఇంజనీరింగ్ పూర్తి చేసి అదే యూనివర్శిటీలో ప్రస్తుతం ఎంబీఏ చదువుతున్నారు. సురేఖ నాలుగు సంవత్సరాల పది మాసాల వయస్సులో కృష్ణానదిని మూడుసార్లు ఈది లిమ్కా బుక్ ఆఫ్ రికార్డుల్లో ఎక్కారు. స్విమింగ్‌లో సుమారు 40కు పైగా పతకాలు సాధించారు. స్విమింగ్ కోచ్‌లు అందుబాటులో లేకపోవడం, ఆర్థికపరమైన ఇబ్బందులు కారణంగా ఆమె ఆర్చరీపై దృష్టిసారించి అంచెలంచెలుగా ఎదిగి 2011లో ఇరాన్‌లో జరిగిన ప్రపంచ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో బ్రాంజ్‌మెడల్ సాధించింది. 2013 చైనాలో జరిగిన ప్రపంచ యూత్ ఛాంపియన్‌షిప్‌లో జ్యోతి సురేఖ బంగారు పతకాన్ని సాధించి భారతదేశ కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచానికి చాటి చెప్పింది. ప్రస్తుతం ఆర్చరీ ఉమెన్స్ కాంపౌండ్ విభాగంలో జాతీయ స్థాయిలో ప్రథమ, అంతర్జాతీయ స్థాయిలో 12వ స్థానం కైవసం చేసుకుంది. జ్యోతి సురేఖ అర్జున్ అవార్డు అందుకోవడంతో నడింపల్లి గ్రామంలో సంబరాలు అంబరాన్ని అంటాయి. అవార్డు అందుకోవడం పట్ల ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, ఎంపీపీ పార్వతి, జడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లరావు, నడింపల్లి ఎంపీటీసీ ఉప్పల శ్వేత, తహసీల్దార్ శేషకుమార్, ఎంపీడీవో సుభాని హర్షం వ్యక్తం చేశారు.


తల్లితో అవార్డు తీసుకున్న సురేఖ

నేడు విజయవాడలో స్వాగత సత్కారం

తాడేపల్లి : అంతర్జాతీయ విలు విద్య క్రీడా కారిణి, కేఎల్ యూనివర్సిటీ విద్యార్థిని, అర్జున అవార్డు గ్రహీత వెన్నం జ్యోతిసురేఖకు బుధవారం విజయవాడలో స్వాగత సత్కారాలు అందించనున్నట్లు కేఎల్‌యూ క్రీడా విభాగం అసోసియేట్ డీన్ కాకర్ల హరికిషోర్ తెలిపారు. బుధవారం ఉదయం న్యూఢిల్లీ నుంచి 8.30 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటుందని, అక్కడి నుంచి భారీ ప్రదర్శనతో కేఎల్ యూనివర్సిటీకి విచ్చేస్తుందని వెల్లడించారు. కేఎల్‌యూ తరఫున విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ హబీబుల్లాఖాన్, క్రీడా విభాగం అధికారులు, విద్యార్థులు ఆహ్వానం పలికేందుకు గన్నవరం వెళుతున్నట్లు హరికిషోర్ చెప్పారు.

అవకాశాలను సృష్టించుకోవాలి

అవకాశాల కోసం ఎదురు చూడటం కాదు, జీవితాన్ని నలుగురికి స్ఫూర్తిగా మలుచుకునేలా అవకాశాలను సృష్టించుకోవాలి. రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డు అందుకుంటానని ఏనాడు అనుకోలేదు. కానీ దేశం గర్వించేలా నిలబడాలని మాత్రం నిత్యం అనుకునేదాన్ని. భవిష్యత్తులో సీనియర్ చాంపియన్ షిప్‌లో ఎంపికయి, పతకం సాధించే దిశగా అడుగులు వేస్తున్నాను. ప్రస్తుతం నామీద కొంత ఒత్తిడి పెరిగింది. కానీ దాన్ని బాధ్యతగా భావిస్తూ లక్ష్యాన్ని చేరుకుంటాను.

- జ్యోతి సురేఖ, అర్జున అవార్డు గ్రహీత

నంద్యాలను అభివృద్ధి చేస్తా..

భూమా బ్రహ్మానందరెడ్డి

తాడేపల్లి: దాదాపు 13 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని నంద్యాలను సీఎం చంద్రబాబునాయుడు ప్రోత్సాహంతో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యేగా ఎన్నికైన భూమా బ్రహ్మానందరెడ్డి చెప్పారు. మంగళవారం రాత్రి ఉండవల్లి సీఎం నివాస గృహం వద్దకు వెళ్లి సీఎం చంద్రబాబును కలిసిన అనంతరం తిరిగి వెళుతూ ఉండవల్లి కరకట్ట వద్ద మంత్రులతో కలిసి కొద్దిసేపు ఆయన విలేకర్లతో మాట్లాడారు. భూమా మాట్లాడుతూ హామీ ప్రకారం నంద్యాలను ప్రగతిపథంలో నడిపిస్తానన్నారు. బాబాయ్ మీద ప్రేమతో ప్రజలు ఓటుతో చూపించిన అభిమానం జీవితంలో మర్చిపోలేనని ఆయన వ్యాఖ్యానించారు. మంత్రి కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ ఏ నేత మాట్లాడని విధంగా జగన్ రాక్షసుడిలాగా మాట్లాడడని, ఎన్నికల కమిషన్‌కు ఆవేదనలో మాట్లాడాను అని చెప్పిన తరువాత కూడా జగన్ సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. నంద్యాలను పులివెందుల లాగా జగన్ చేస్తానంటే సీఎం చంద్రబాబు పులివెందులను కూడా నంద్యాలలాగా మారుస్తామని చెప్పారన్నారు. నంద్యాల ప్రజలు జగన్ మాటలకు బుద్ధి చెబుతూ చంద్రబాబు మూడళ్ల పాలనకు నంద్యాల ప్రజలు కానుక అందించారన్నారు. మంత్రి అఖిలప్రియ మాట్లాడుతూ నంద్యాల ఉప ఎన్నిక ద్వారా మా నాన్నను బతికించుకున్నామని అఖిలప్రియ చెప్పారు. పార్టీలో ఒక వ్యక్తి చనిపోతే అధిష్ఠానం ఎలా కష్టపడుతుందో టీడీపీలో నాయకులు, కార్యకర్తలు చూపించారన్నారు. సెప్టెంబర్ ఒకటి నుంచి మేమందరం ప్రజల వద్దకు వెళ్లబోతున్నామని భూమా చెప్పారు. నంద్యాల ప్రజలకు ఇచ్చిన అభివృద్ధి హామీలను నెరవేర్చాలని సీఎం ఆదేశించారని అఖిలప్రియ చెప్పారు. శిల్పా బ్రదర్స్ ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటామని సవాల్ చేశారని, నైతికంగా ఆ సవాల్‌ను శిల్పా బ్రదర్స్ నిలబెట్టుకోవాలని అఖిలప్రియ అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి, టీడీపీ మంగళగిరి ఇన్‌చార్జి గంజి చిరంజీవి, వేములపల్లి మంజుషా, హరిబాబు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న బ్రహ్మానందరెడ్డి, అఖిలప్రియ

విశ్రాంత పోలీస్ అధికారుల సమస్యల పరిష్కారానికి కృషి

డీజీపీ నండూరి సాంబశివరావు


డీజీపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న పోలీస్ అధికారుల సంఘం నాయకులు

గుంటూరు : రాష్ట్రంలో విశ్రాంత పోలీస్ అధికారుల సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటామని డీజీపీ నండూరి సాంబశివరావు హామీ ఇచ్చారు. ఈ మేరకు గుంటూరులో జరిగిన విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం అనంతరం మంగళగిరిలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో డీజీపీ నండూరి సాంబశివరావును కలిసి విశ్రాంత పోలీస్ అధికారుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అతి తక్కువ సమయంలో అధునాతన వసతులతో పోలీస్ హెడ్ క్వార్టర్స్ నిర్మించడంపై డీజీపీకి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డీజీపీ ఆయా సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు.

తొలుత చుట్టుగుంట సెంటర్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ వైద్య సేవ భవన్‌లో జరిగిన కార్యవర్గ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఐపీఎస్ అధికారి డాక్టర్ సీఆర్ నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా స్థాయి పోలీస్ అధికారులతో సమన్వయంతో సమస్యల పరిష్కారానికి కాళహస్తి సత్యనారాయణ సమర్థంగా పనిచేస్తున్నారన్నారు. ఆయనకు సహకరిస్తూ క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న కార్యవర్గ సభ్యులను అభినందించారు. రానున్న రోజుల్లో విశ్రాంత ఉద్యోగులు మరింత సంఘటితమై సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయిలో రాష్ట్ర కమిటీ సభ్యులు కృషి చేయాలన్నారు. కాగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ సీఈవో రవిశంకర్ అయ్యన్నార్ మాట్లాడుతూ రాష్ట్రంలో విశ్రాంత ఉద్యోగులందరికీ ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. విశ్రాంత ఉద్యోగులకు రాష్ట్రంలోనూ, హైదరాబాదులోనూ, వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విశ్రాంత పోలీస్ అధికారుల రాష్ట్ర అధ్యక్షుడు, ఐపీఎస్ అధికారి డాక్టర్ సీఆర్ నాయుడు, ప్రధాన కార్యదర్శి కాళహస్తి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఉపాధ్యక్షులు కె.లక్ష్మణ మోహన్, ఎం.రంగప్రసాదరావు, సంయుక్త కార్యదర్శులు డీవీఎస్‌వి సమూర్తి, ఎస్.శేషగిరిరావు, కార్యనిర్వాహక కార్యదర్శి ఎం రవి, కోశాధికారి యు మాణిక్యాలరావు, అన్ని జిల్లాల నుంచి సంఘ నాయకులు, సభ్యులు హాజరయ్యారు.

పైసా.. వసూల్!

- లబ్దిదారుల నుంచి ఉద్యాన శాఖ డీడీ జయచంద్రారెడ్డి లంచం డిమాండ్
- డబ్బు ఇవ్వాల్సిందేనంటూ ఫోన్‌లో హుకుం!
- వాయిస్ రికార్డు చేసి ఉన్నతాధికారులకు వినిపించిన రైతులు
- కమిషనర్‌తో పాటు విజిలెన్స్ దర్యాప్తు
- సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారుల ఉత్తర్వులు

ఆంధ్రజ్యోతి, గుంటూరు: జిల్లా ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) జయచంద్రారెడ్డిని సస్పెండ్ చేస్తూ మంగళవారం ఆ శాఖ రాష్ట్ర కమిషనర్ చిరంజీవి చౌదరి ఆదేశాలిచ్చారు. జిల్లాలో ఉద్యాన పంటలు, కూరగాయల సాగును పెంచడం కోసం ప్రభుత్వం గుంటూరు జిల్లాకు ఉద్యాన శాఖ డీడీ పోస్టును కేటాయించింది. ఈ పోస్టుకు మొదట పి.రవికుమార్ డీడీగా పని చేశారు. ఆయన బదిలీ అయిన తరువాత సుమారు మూడేళ్ల నుంచి జయచంద్రారెడ్డి డీడీగా కొనసాగుతున్నారు. ఉద్యాన శాఖ నుంచి ప్రభుత్వ సబ్సిడీ అందకపోవడంతో లబ్దిదారులు అనేకసార్లు కార్యాలయాల చుట్టూ తిరిగారు. పట్టించుకోకపోవడంతో లబ్దిదారులు నేరుగా ముట్టుగుంట సెంటర్‌లోని ఉద్యానవన శాఖ రాష్ట్ర కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో జయచంద్రారెడ్డి పనితీరుపై తీవ్రమైన అవినీతి ఆరోపణలు రావడంతో కొన్ని నెలలుగా ఆ శాఖ కమిషనర్ చిరంజీవి చౌదరి అంతర్గత దర్యాప్తు నిర్వహించారు. మరో వైపు విజిలెన్స్ అధికారులు కూడా రంగంలోకి దిగారు.





సెల్‌ఫోన్‌లో వాయిస్ రికార్డు..

ఉద్యానవన శాఖ డీడీ జయచంద్రారెడ్డి లబ్దిదారులను డబ్బు డిమాండ్ చేస్తూ మాట్లాడిన మాటలను సెల్‌ఫోన్‌లో రికార్డ్ చేశారు. సెల్ ఫోన్ వాయిస్ రికార్డులను కమిషనర్ చిరంజీవి చౌదరి, దర్యాప్తు అధికారులకు వినిపించారు. ఉద్యానవన శాఖ డీడీ జయచంద్రారెడ్డికి ఇచ్చిన సిమ్ కార్డు నెంబర్ ఫోన్‌లోనే ఈ వాయిస్‌లు రికార్డు అయినట్లు తేలింది. మాచర్ల, వినుకొండ, మంగళగిరి, తాడికొండ, నారాకోడూరు, తెనాలి, తదితర ప్రాంతాల నుంచి ఉద్యానవన శాఖ రైతులు సబ్సిడీ పథకాలు అందడం లేదని, లబ్దిదారుల ఎంపిక, పథకాల పంపిణీలో అవకతవకలకు పాల్పడుతున్నట్లు లిఖిత పూర్వకంగా తెలిపారు.

పైసలిస్తేనే సబ్సిడీ..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కెవివై), జాతీయ ఆహార భద్రతా పథకం (ఎన్ఎఫ్ఎస్ఎం) వంటి పథకాలలో కూరగాయలు, ఉద్యాన పంటల రైతులకు 40-50 శాతం సబ్సిడీపై వివిధ పథకాలను అమలు చేస్తున్నారు. తైవాన్ స్ప్రేయర్లు, షేడ్ నెట్, పామ్ హౌస్, టార్పాలియన్ పట్టలు, మినీ ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, సుందరీకరణ పథకాలు, ఆధునిక యంత్ర పరికరాలకు సబ్సిడీలు ఇస్తున్నారు. ఈ పథకాల్లో లబ్దిదారుల ఎంపిక, సబ్సిడీ కేటాయింపు ఇతర అంశాల్లో క్షేత్రస్థాయిలోని ఉద్యానవన శాఖ సిబ్బంది ద్వారా డీడీ జయచంద్రారెడ్డి డబ్బు వసూలు చేసినట్లు ఫిర్యాదులు అందాయి. లబ్దిదారుల నుంచి ముడుపులు వసూలు చేయడానికి అంగీకరించని ఏడీలను పక్కకు పెట్టి నేరుగా డీడీ జయ చంద్రారెడ్డే అవినీతికి పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. తాడికొండ, మంగళగిరి, వినుకొండ, మాచర్ల, నారాకోడూరు, తెనాలి, తదితర ప్రాంతాల్లోని ఉద్యానవన రైతులు డీడీ జయ చంద్రారెడ్డిపై నేరుగా విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. బిందు, తుంపర సేద్యం, వ్యవసాయ, పశు సంవర్ధక, ఇతర అనుబంధ శాఖల సమన్వయంతో చేసే పథకాల్లో కూడా తన వాటా ఇవ్వాల్సిందేనంటూ కొన్ని కంపెనీల ప్రతినిధులతో డీడీ బేరసారాలు చేసినట్లు ఫిర్యాదులు అందాయి.

నర్సరీల యజమానులతో లాలూచీ..

జిల్లాలో మిరప, వివిధ కూరగాయల తోటల నర్సరీల యజమానులతో డీడీ జయ చంద్రారెడ్డి లాలూచీ పడినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. మిరప, కూరగాయల విత్తనాల్లో నకిలీల వలన నష్టపోయిన రైతులు అనేకసార్లు కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు చేశారు. అనుమతులు లేకుండా కూరగాయలు, మిరప నారు అమ్ముతున్న నర్సరీల యజమానులతో జయచంద్రారెడ్డి చేతులు కలిపినట్లు కమిషనర్ చిరంజీవిచౌదరి దర్యాప్తులో తేలింది.

సస్పెండైన మొదటి డీడీ

గుంటూరు ఉద్యానవన శాఖలో డీడీ పోస్టు మంజూరైన తరువాత సస్పెండైన మొదటి అధికారి జయచంద్రారెడ్డి. ఆయన గతంలో గుంటూరులో ఏడీగా పనిచేశారు. అప్పట్లో ఆయనపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. ఏడీగా ఉన్న సమయంలోనే గుంటూరులో సస్పెండ్ అయ్యారు. డీడీ జయ చంద్రారెడ్డిని సస్పెండ్ చేయడంతో ఇన్‌చార్జి డీడీగా ఏపీఎంఐపీ పీడీ పద్మావతిని నియమిస్తూ ఆ శాఖ కమిషనర్ చిరంజీవి చౌదరి మంగళవారం ఆదేశాలు ఇచ్చారు.

ముగిసిన ఎడ్ల బండలాగుడు పోటీలు

సీనియర్ విభాగంలో సత్తా చాటిన కృష్ణా జిల్లా ఎడ్లు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులోని కాకాని వెంకట్రామయ్య క్రీడా ప్రాంగణంలో ఎన్టీఆర్ మెమోరియల్ ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు పోటీలు మంగళవారం ముగిశాయి. నాలుగు రోజులు జరిగిన ఈ పోటీలకు వివిధ జిల్లాల నుంచి ఎడ్ల జతలు పాల్గొన్నాయి. చివరి రోజున సీనియర్ విభాగంలో రసవత్తరంగా సాగిన ఈ పోటీల్లో కృష్ణా జిల్లా ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. విజేతల వివరాలను కమిటీ సభ్యులు ప్రకటించారు. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం యనమలకుదురు గ్రామానికి చెందిన అనంతనేని శ్రీకావ్య, శ్రీమధులకు చెందిన ఎడ్ల 2711.4 అడుగులు లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా రాజుపాలెం మండలం గణపవరం గ్రామానికి చెందిన మర్రి సుందరరామిరెడ్డి ఎడ్లు 2700 అడుగులు లాగి ద్వితీయ స్థానంలో, కృష్ణా జిల్లా పెనమలూరు మండలం, యనమదలకుదురు గ్రామానికి చెందిన అంతనేని శ్రీకావ్య, శ్రీమధు ల ఎడ్లు 2,416 అడుగులు లాగి తృతీయ స్థానాన్ని, కృష్ణా జిల్లా ఘంటసాలకు చెందిన గొర్రెపాటి నవనీత్ కృష్ణ చౌదరి గిత్తలు 2,403.7 అడుగులు లాగి నాల్గవ స్థానాన్ని, గుంటూరు జిల్లా రాజుపాలెం మండలం గణపవరం గ్రామానికి చెందిన శామనపూడి శివారెడ్డి ఎడ్లు 2,400 అడుగులు లాగి ఐదవ స్థానాన్ని, కృష్ణా జిల్లా మోపిదేవి మండలం బొబ్బర్లంక గ్రామానికి చెందిన కోనేరు నిరూప్‌బాబు ఎడ్ల జత 2,270 అడుగులు లాగి ఆరవ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. విజేతలకు ఎమ్మెల్యే రావెల కిషోర్ బాబు బహుమతులు అందజేశారు.

కౌలు రైతులకు సకాలంలో రుణాలు మంజూరు చేయాలి

- బ్యాంకర్లకు సూచించిన కలెక్టర్ లక్ష్మీకాంతం



బ్యాంకర్లతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ బి.లక్ష్మీకాంతం

విజయవాడ : రుణాల మంజూరు ప్రక్రియలో భాగంగా జిల్లాలోని కౌలు రైతులకు సకాలంలో రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ లక్ష్మీకాంతం బ్యాంకర్లకు సూచించారు. క్యాంపు కార్యాలయంలో మంగళవారం వివిధ బ్యాంకుల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పంట రుణాలు 4 వేల 600 కోట్ల మేర మంజూరు లక్ష్యం ఉండగా, అందులో 3వేల 624 కోట్లు మంజూరు అయినట్లు తెలిపారు. మిగిలిన రుణాలను వచ్చే నెల 15వ తేదీ లోపు మంజూరు చేయాలన్నారు. కౌలు రైతులకు అందించాల్సిన 320 కోట్ల రుణాలను కూడా సకాలంలో మంజూరు చేయాలని సూచించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఐదు వేల ఎకరాలు అధికంగా వరి నాట్లు వేసిన నేపథ్యంలో రైతులకు సక్రమంగా రుణాలు మంజూరు చేసి ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో భాగంగా ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కూలీలకు చెల్లించాల్సిన 16 కోట్ల వేతనాలు విడుదల చేయడం జరిగిందని, వాటిని జాప్యం లేకుండా కూలీలకు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎల్‌డీఎం వెంకటేశ్వరరెడ్డి, నాబార్డు ఏజీఎం విజయ్, ఆంధ్రాబ్యాంకు డీజీఎం చంద్రమోహన్ రెడ్డి, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్‌పై పరిశోధన

- ప్రభుత్వాస్పత్రిలో నెదర్లాండ్స్ ఉన్నత స్థాయి బృందం పర్యటన



జీజీహెచ్‌లో పర్యటిస్తున్న డచ్, కేంద్ర బృందాల సభ్యులు

గుంటూరు (మెడికల్): యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్‌పై పరిశోధన చేపట్టేందుకు న్యూఢిల్లీకి చెందిన నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీడీసీ) ప్రతినిధులతో కలసి నెదర్లాండ్స్ ఉన్నతాధికారుల బృందం మంగళవారం గుంటూరు ప్రభుత్వాస్పత్రిని సందర్శించింది.ప్రభుత్వాస్పత్రిలో యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ ఏ స్థాయిలో ఉందో అంచనా వేసేందుకు నెదర్లాండ్స్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రతినిధి రోసా మరియా పెర్సన్‌సాల, ఆర్థిక శాఖ ప్రతినిధి జోహన్నెస్ క్రిస్టినాన్ వాండెన్, ఎరాస్మస్ యూనివర్సిటీ మెడికల్ సెంటర్‌కు చెందిన జులిటీ సెవిరన్‌లతో పాటు నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ లతాకపూర్, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అంకుర్ గార్గ్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ గీతా ప్రసాదిని, ఏపీ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ డైరెక్టర్ వినయ్ కుమార్ తదితరులు జీజీహెచ్‌ను సందర్శించారు. ఈ బృందం బుధవారం విజయవాడ ప్రభుత్వాస్పత్రి, సిద్దార్థ వైద్య కళాశాలను సందర్శిస్తారు. గుంటూరుకు వచ్చిన డచ్, కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు రెండు బృందాలుగా విడిపోయారు. ఒక బృందం జీజీహెచ్/జీఎంసీలో పర్యటించగా, మరో బృందం జిల్లాలోని పశు సంవర్ధక శాఖను సందర్శించింది. నెదర్లాండ్స్ ప్రతినిధులను సూపరింటెండెంట్ డాక్టర్ డీఎస్ రాజునాయుడు సాదరంగా ఆహ్వానించారు.

వైద్యులతో సమీక్ష

సూపరింటెండెంట్ చాంబర్‌లో వీరు సమావేశమయ్యారు. జీఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ జీ సుబ్బారావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం పర్నీకుమార్, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్లు మార్కాండేయులు, వరప్రసాద్, యశోధర తదితరులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. నిర్దేశిత సమయంలో ఆయా వార్డుల్లో స్వాబ్స్ నమూనాలు సేకరించి మైక్రోబయాలజీ విభాగంలో పరీక్షలకు పంపుతున్నారా? అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్, పారిశుధ్య నిర్వహణ వివరాలను తెలుసుకున్నారు. యాంటీ బయోగ్రామ్ నిర్వహిస్తున్నారా? అని ప్రశ్నించారు. మైక్రోబయాలజీ అసోసియేట్ ప్రొఫెసర్, హాస్పిటల్ ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ కమిటీ ఇన్‌చార్జ్ డాక్టర్ ప్రశాంతి, పలు వివరాలను అందించారు. అనంతరం ఈ బృందం పలు వార్డుల్లో అక్కడ రోగులను పరిశీలించారు. ఐసీయూ వార్డులను కూడా సందర్శించారు. అనంతరం వైద్య కళాశాలకు వెళ్లి మైక్రోబయాలజీ విభాగం పరిశీలించారు. ఫార్మకాలజీ, మైక్రోబయాలజీ వైద్యులతో కొద్దిసేపు సమావేశమయ్యారు. చివరగా తమ పర్యటనపై బృందం సభ్యులు మీడియాతో మాట్లాడారు. జీజీహెచ్‌లో పలు వార్డుల చికిత్సలు పొందే రోగుల ఉంచి నుంచి తమ బృందం రక్త నమూనాలుసేకరించి పరీక్షించి యాంటీ బయోటిక్ రెసిస్టెన్స్ ఏ స్థాయిలో ఉందో నిర్ధారిస్తామని తెలిపారు. యాంటీ బయోటిక్ మందుల వినియోగంపై కఠిన చర్యలు సారించకపోతే సమీప భవిష్యత్తులో ప్రస్తుతం ఉన్న మందులు కూడా పనిచేయని దుస్థితి నెలకొంటుందని వారు తెలిపారు.


ధ్యాన్‌చంద్ చిత్ర పటం ముందు జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమ


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న నగర కమిషనర్ జె.నివాస్


క్రీడాకారులు లేక వెలవెలబోతున్న క్రీడా దినోత్సవ కార్యక్రమం

తూతూ మంత్రం.. క్రీడా దినోత్సవం

● ఏర్పాట్లలో నిర్లక్ష్యం వహించిన అధికారులు ● పాల్గొనేందుకు ఆసక్తి చూపని అసోసియేషన్లు
● ర్యాలీలో పాల్గొన్న అరకొర అసోసియేషన్లు ● బహుమతుల ప్రదానం సాయంత్రానికి వాయిదా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/లబ్బీపేట స్పోర్ట్స్)

అంతర్గత వివాదాలు, అధికారుల నిర్లక్ష్యంతో క్రీడా దినోత్సవం వెలవెలబోయింది. వేల మంది క్రీడాకారులతో ర్యాలీ, పోటీల్లో గెలిచిన వారికి బహుమతుల ప్రదానం, జిల్లాలోని పలువురు అవార్డు గ్రహీతలకు సన్మానం, అంటూ డాంబికాలు పలికిన జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చివరకు జాతీయ క్రీడా దినోత్సవాన్ని తూతూ మంత్రంగా నిర్వహించింది. కార్యక్రమంలో పాల్గొనేందుకు అధిక శాతం అసోసియేషన్లు డుమ్మా కొట్టాయి. శాప్ అధికారుల్లో ఒక్క డీఎస్‌డీఓ శ్రీనివాస్ మినహా మరే ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్న దాఖలాల్లేవు. ర్యాలీ అనంతరం జరగాల్సిన బహుమతుల ప్రదానోత్సవాన్ని సాయంత్రానికి వాయిదా వేసిన అధికారులు ఎవరికీ కనీస సమాచారం కూడా లేకుండానే కార్యక్రమాన్ని ముగించేశారు. దీనిపై పలు క్రీడా సంఘాలు, క్రీడాకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ర్యాలీని ముఖ్య అతిథిగా పాల్గొన్న మునిసిపల్ కమిషనర్ జె.నివాస్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో ద్రోణాచార్య అవార్డు గ్రహీత కోనేరు అశోక్, చెస్ ప్లేయర్ ఎం.ఆర్.లలిత్‌బాబు, టి.జ్యోతికతోపాటు అథ్లెటిక్స్, నేషనల్ ప్లేయర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ క్రీడాకారులు ఎంచుకున్న క్రీడల్లో ఉన్నతస్థానాలను అధిరోహించాలని, అందు కోసం ప్రతిరోజూ నియమ నిబంధనలతో కూడిన సాధన చేయాలని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న టోర్నమెంట్లు క్రీడాకారులకు శుభసూచకమన్నారు.

● బహుమతుల ప్రదానం

కబడ్డీ, వాలీబాల్, హాకీ క్రీడా పోటీ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు సోమవారం సాయంత్రం 4 గంటలకు స్టేడియంలో బహుమతులను అందించారు. మధ్య నియోజకవర్గ శాసనసభ్యుడు బొండా ఉమామహేశ్వర్రావు ముఖ్య అతిథిగా హాజరవ్వగా జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులకు సన్మానం నిర్వహించారు. అనంతరం క్రీడల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందించారు. కార్యక్రమంలో శాప్ డిప్యూటీ డైరెక్టర్స్, పలు క్రీడా సంఘాల కార్యదర్శులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

● డుమ్మా కొట్టిన అసోసియేషన్లు

నగర వ్యాప్తంగా సుమారు 50కి పైగా అసోసియేషన్లు కొనసాగుతుండగా, ర్యాలీలో పట్టుమని పది కూడా పాల్గొనలేదు. శాప్ నుంచి సమాచారం లేదని కొందరు అసోసియేషన్ పెద్దలు చెబుతున్నారు. జాతీయ దినోత్సవంగా క్రీడలకు పెద్దపీట వేస్తూ నిర్వహించిన కార్యక్రమానికి సమాచారం అందితేనే అన్న నిబంధనలను పాటించకుండా స్వచ్ఛందంగా పాల్గొనాల్సిన బాధ్యత ఆ అసోసియేషన్లపై ఉందనే చెప్పాలి. స్టేడియానికి కూత వేటు దూరంలో ఉన్న ఇండోర్ స్టేడియంలో సోమవారం నుంచి సెపక్‌తక్రా చాంపియన్‌షిప్ పోటీలు జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నారు. ఆ పోటీల్లో సుమారు 7 రాష్ట్రాల నుంచి సుమారు 180 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పక్కనే జాతీయ క్రీడా దినోత్సవం జరుగుతుండగా, కనీసం ఆ క్రీడాకారులు కూడా కార్యక్రమంలో పాల్గొనకపోవడం క్రీడాదినోత్సవానికి అవమానమే.

బకాయిలు చెల్లిస్తారా? ఫీజులు పీకేయమంటారా?

మేజర్ పంచాయతీలకు ఏపీఎస్‌పీడీసీఎల్ నోటీసులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

విజయవాడ అర్బన్ మెట్రో పరిధిలోని మేజర్ గ్రామ పంచాయతీలనుంచి రావలసిన ఐదున్నర కోట్ల విద్యుత్ బకాయిలను రాబట్టేందుకు రికవరీ చట్టాన్ని ప్రయోగించేందుకు ఏపీఎస్‌పీడీసీఎల్ సంసిద్ధమైంది. మొత్తం 33 మేజర్ పంచాయతీల నుంచి భారీ మొత్తం బకాయి రావాల్సి ఉండడంతో బకాయిలు చెల్లిస్తారా? ఫీజులు పీకేయమంటారా అంటూ సంస్థ హెచ్చరికలు జారీ చేసింది. రెవెన్యూ రికవరీ యాక్ట్ పరిధిలో బకాయిలు రాబట్టేందుకు బకాయి పడ్డ మేజర్‌గ్రామ పంచాయతీల వివరాలు, ఎంతెంత బకాయి రావాల్సి ఉందన్న సమాచారాన్ని ఏపీఎస్‌పీడీసీఎల్ అధికారులు రెవెన్యూ అధికారులకు పంపించారు.

● నోటీసులు పంపించిన పంచాయతీలు

యనమలకుదురు పరిధిలోని పెదపులిపాక, తాడిగడప, యనమలకుదురు మేజర్ పంచాయతీలకు, పెనమలూరు పరిధిలోని వణుకూరు, పోరంకి, గోశాల, గంగూరు, చోడవరం పెనమలూరు మేజర్ పంచాయతీలకు, కానూరు మేజర్ పంచాయతీకి, కంకిపాడు పరిధిలోని కంకిపాడు, సిహెచ్‌విపాలెం, దావులూరు, ఈడుపుగల్లు, గొడవర్రు, గొల్లగూడెం, జ.గన్నాధపురం, కోమటిగుంటలాకు, కెఎస్‌ఎన్‌పాలెం, కందలంపాడు, కోలవెన్ను, కొణతనపాడు, కుందేరు, మాదాసువారి పాలెం, మద్దూరు మంతెన, మారేడుమాక, నెప్పల్లి, ప్రొద్దుటూరు, పునాదిపాడు, తెన్నేరు, ఉప్పలూరు, వేల్పూరు పంచాయతీలకు నోటీసులు అందాయి.



సమావేశంలో ప్రసంగిస్తున్న అశోక్‌కుమార్. హాజరైన ఆడిటర్లు, బిల్డర్లు, అకౌంటెంట్లు

జీఎస్‌టీ సులభతరం, అపోహలొద్దు

అవగాహనా కార్యక్రమంలో అమరావతి డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఐ.అశోక్‌కుమార్

విజయవాడ సెంట్రల్: జీఎస్‌టీపై ప్రజలకు, వ్యాపారులకు ఎటువంటి అపోహలు వద్దని ఇది ఎంతో సులభతర పద్ధతని, టాక్స్ కడితే ఎటువంటి ఇబ్బంది ఉండదని జీఎస్‌టి అమరావతి డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఐ.అశోక్‌కుమార్ అన్నారు. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అమరావతి సెంటర్ జనరల్ బాడీ సమావేశంలో భాగంగా మహాత్మాగాంధీ రోడ్డులోని ఓ హోటల్‌లో మంగళవారం బిల్డర్లు, కాంట్రాకర్లు, ఆడిటర్స్, అకౌంటెంట్స్‌కు జీఎస్‌టిపై అవగాహనా కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న అశోక్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో నేటికి 36 లక్షలకు పైగా 3బి రిటన్స్ దాఖలు చేశారని ఇది ఎంతో శుభపరిణామమని అన్నారు. జీఎస్‌టి అంటే అందరూ భయపడుతున్నారని, మనం ఏదైనా కొత్తది సాధించాలంటే మొదట కొంత కష్టంగా ఉంటుందని, పోనుపోను ఇష్టంగా మారుతుందని, అలాంటిదే జీఎస్‌టి అన్నారు. చెల్లించే పన్నును ఇన్‌పుట్ ద్వారా పొందవచ్చని, అడ్డంకులన్నీ రెండు మూడు నెలల్లో సర్దుకుంటాయని అన్నారు. రిటర్న్‌లో ఇన్‌పుట్ ట్యాక్స్ పొందుపరిచేప్పుడు కొంత జాగ్రత్త వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వ్యాపారస్తుల్లో ఉన్న సందేహాలను తొలగించేందుకు జీఎస్‌టి సెల్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అమరావతి పరిధిలో 7 రేంజ్‌లు ఏర్పాటు చేస్తామని, పనిదినాలలో వారికి ఎటువంటి సందేహాలు ఉన్నా నేరుగా ఆఫీసుకు వచ్చి క్లియర్ చేసుకోవాలన్నారు. అనంతరం రేట్ ఆఫ్ ట్యాక్స్ డిఫరెన్స్, బిల్డర్స్ జీఎస్‌టికి ముందు ఉన్న బిల్లులు జీఎస్‌టి అమలులోకి వచ్చిన తరువాత ఎలా పొందుపరచాలి, వాటి ఇన్‌పుట్‌ను ఎలాపొందాలి, జీఎస్‌టిలో ఉన్న సదుపాయాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేశారు. అనంతరం వివిధ వర్గాలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. కార్యక్రమంలో జీఎస్‌టి అమరావతి రేంజ్ సూపరింటెండెంట్ తుమ్మల విజయలక్ష్మి, బీఏఐ అమరావతి సెంటర్ ఛైర్మన్ అత్తలూరి నాగ మల్లేశ్వరరావు, అధ్యక్షులు ఎంబి ఫణికుమార్, కార్యదర్శి తుమ్మల వంశీకృష్ణ, కోశాధికారి రజా, బిల్డర్లు, కాంట్రాక్టర్లు, ఆడిటర్లు, అకౌంటెంట్లు పాల్గొన్నారు.

డీఈవోల బదిలీలు పారదర్శకంగా జరగాలి

● ప్రభుత్వానికి పీడీఎఫ్ ఎమ్మెల్సీల విజ్ఞప్తి

విజయవాడ సెంట్రల్: రాష్ట్రంలో అన్ని డీఈవో స్థాయి పోస్టులు ఒకేసారి భర్తీచేయాలని, ప్రమోషన్లు, బదిలీలలో పారదర్శకత పాటించాలని, ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల విధానాన్నే డీఈవోలకు పాటించాలని ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫోరం (పీడీఎఫ్) ఎమ్మెల్సీలు వి.బాలసుబ్రమణ్యం, బొడ్డు నాగేశ్వరరావు, వై.శ్రీనివాసులురెడ్డి, రాము సూర్యారావులు మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో రెండు జిల్లాల్లో మినహా అన్ని జిల్లాలలోను జిల్లా విద్యాశాఖాధికారుల (డీఈవో) పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటి భర్తీ విషయంలో అనేక అక్రమాలు జరుగుతున్నట్లు వార్తలు రావడం దురదృష్టకరమన్నారు. డీఈవో పోస్టుల భర్తీ విషయంలో కార్పొరేట్ విద్యాసంస్థలు కూడా జోక్యం చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. రెగ్యులర్ డీఈవో పోస్టుల్ని ప్రస్తుతం నింపి సర్వశిక్షాభియాన్ పోస్టుల్ని తర్వాత భర్తీచేయాలనుకోవడం కూడా అనుమానాలకు తావిస్తోందని అన్నారు. అన్ని డీఈవో స్థాయి పోస్టులు ఒకేసారి భర్తీచేయాలని, ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల విధానాన్ని డీఈవోలకు పాటించాలని వారు డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి నీకులేదు

వైసీపీ ఎమ్మెల్యే కొడాలి నానిపై జూపూడి ఫైర్


సమావేశంలో మాట్లాడుతున్న జూపూడి ప్రభాకర్‌రావు

విజయవాడ: అవకాశవాద రాజకీయాలు చేసే నీకు ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి లేదంటూ వైసీపీ ఎమ్మెల్యే కొడాలి నానిపై టీడీపీ అధికార ప్రతినిధి, ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మెన్ జూపూడి ప్రభాకర్‌రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ నంద్యాల ఉపఎన్నికలో పరాజయాన్ని జీర్ణించు కోలేక వైసీపీ నేతలు ప్రభుత్వంపై అర్ధరహిత విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిపై వ్యక్తిగత విమర్శలకు దిగితే ప్రచారంలో నోరు పారేసుకున్న రోజాకు పట్టిన గతే నీకు పడుతుందని నానీని హెచ్చరించారు. భవిష్యత్‌లో వైసీపీ రాష్ట్రంలో కనుమరుగవడం ఖాయమన్నారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్లు ఆకేపోగు ప్రభాకర్, గుడిసే దేవానంద్ పాల్గొన్నారు.


మహా మండపంలో కానుకలు లెక్కిస్తున్న ఆలయ ఉద్యోగులు

దుర్గగుడి హుండీ ఆదాయం రూ. 1.90 కోట్లు

వన్‌టౌన్ : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో కనకదుర్గమ్మను దర్శించుకున్న భక్తులు ఆలయ ప్రాంగణంలో ఉన్న హుండీలలో సమర్పించిన కానుకలను ఆలయ ఈవో ఎ.సూర్యకుమారి ఆధ్వర్యంలో మహామండపంలో మంగళవారం లెక్కించారు. 21 రోజుల పాటు అమ్మవారిని దర్శించుకున్న భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను లెక్కించగా రూ. 1,90,16,127ల ఆదాయం లభించినట్లు ఈవో తెలిపారు. 685 గ్రాముల బంగారు ఆభరణాలు, ఆరు కేజీల 430 గ్రాముల వెండి ఆభరణాలను భక్తులు సమర్పించినట్లు ఈవో తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటి, ఉద్యోగులు, రెవెన్యూ, ఎస్‌పిఎఫ్, వన్‌టౌన్ పోలీస్ సిబ్బంది, జిల్లా దేవాదాయ శాఖ కార్యాలయ ప్రతినిధి తదితరులు పాల్గొన్నారు.

2, 3 తేదీల్లో హైదరాబాద్‌లో పౌరహక్కుల సదస్సు

గాంధీనగర్: ప్రజా ఉద్యమాలను ప్రభుత్వాలు అణిచివేయటాన్ని నిరసిస్తూ సెప్టెంబర్ 2, 3 తేదీలలో హైదరాబాద్‌లో అఖిల భారత సదస్సును నిర్వహించనున్నట్టు కృష్ణాజిల్లా పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు టి.ఆంజనేయులు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన మందిరంలో జరిగే ఈ సదస్సుకు ఛత్తీస్‌ఘడ్ పౌరహక్కుల ఉద్యమ నాయకురాలు సోలీసోరి, పౌరహక్కుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్రాంతిచైతన్య, పౌరహక్కుల నాయకుడు హరగోపాల్, బేలా భాటియా పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో పౌరహక్కుల నాయకులు శ్రీధర్, గంగాధర్ పాల్గొన్నారు.

సాంకేతికతతో గ్రామాల సమగ్రాభివృద్ధి

● యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా ఆచార్యుడు డార్విన్ ● కేఎల్‌యూలో ప్రారంభమైన ఓపెన్ ఇన్నోవేషన్ ఫోరం

తాడేపల్లి : సాంకేతిక పరిజ్ఞానాన్ని గ్రామాల సమగ్రాభివృద్ధికి వినియోగించాలని ఓపెన్ ఇన్నోవేషన్ ఫోరమ్ ప్రోగామ్ డైరెక్టర్, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా బర్కెలే ఆచార్యుడు సాల్మన్ డార్విన్ పిలుపునిచ్చారు. కేఎల్ యూనివర్సిటీలో యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా కేఎల్ యూనివర్సిటీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా మూడురోజుల పాటు నిర్వహించనున్న సదస్సును మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డార్విన్ మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన 100 గ్రామాలను ఎంపిక చేసి అందరి సహకారంతో అభివృద్ధి చేస్తామన్నారు. సహజ వనరులను సద్వినియోగం చేయడంతో పాటు భవిష్యత్తు తరాలకు అభివృద్ధి చెందిన ఆరోగ్యకరమైన స్మార్ట్ విలేజ్‌స్‌ను అందించాలనే లక్ష్యంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కేఎల్ యూ వీసీ డాక్టర్ ఎల్ఎస్ఎస్ రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానం గ్రామీణ ప్రాంతాలకు విస్తరించినప్పుడే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ ఆచార్యులు టెర్రీ, కేఎల్ యూ అధ్యాపకులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రొఫెసర్ డార్విన్

31న సదస్సుకు సీఎం చంద్రబాబు

సాంకేతిక పరిజ్ఞానంతో గ్రామీణ ఆర్థికాభివృద్ధే లక్ష్యంతో జరుగుతున్న ఈ సదస్సులో 31వ తేదీ గురువారం సీఎం చంద్రబాబునాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని సదస్సు కమిటీ చైర్మన్ డాక్టర్ కిషోర్‌బాబు వెల్లడించారు. వివిధ కార్పొరేట్ కంపెనీలకు చెందిన ప్రతినిధులు, విదేశీ విద్యాలయాలకు చెందిన ఆచార్యులు, ఈ సదస్సులో పాల్గొంటారని కిషోర్‌బాబు చెప్పారు.

ఘాట్ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

విజయవాడ (వన్‌టౌన్) : దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం ఘాట్ రోడ్డులో నిర్మాణ పనులను మంగళవారం ఆలయ కమిటీ ధర్మకర్తలు వెలగపూడి శంకరబాబు, పద్మశేఖర్, ధర్మారావు, కె.సూర్యలత, ఆలయ ఈఈ భాస్కరరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఘాట్ రోడ్డులో జరుగుతున్న నిర్మాణ పనుల వివరాలు ఈఈని అడిగి తెలుసుకున్నారు. పది రోజుల్లో నిర్మాణ పనులు పూర్తయి, దసరా మహోత్సవాలకు ఘాట్ రోడ్డు అందుబాటులోకి వస్తుందని ఈఈ ధర్మకర్తలకు తెలియజేశారు. దసరా మహోత్సవాలకు ఘాట్ రోడ్డులో ఏర్పాటు చేయనున్న క్యూల వివరాలను సభ్యులు అడిగి తెలుసుకున్నారు.



పనుల వివరాలను ఈఈని అడిగి తెలుసుకుంటున్న ఆలయ కమిటీ సభ్యులు

దుర్గ గుడిలో కొన్ని నిర్మాణాలతో ముప్పే

శృంగేరీ శివగంగ శారదా పీఠాధిపతి పురుషోత్తమ భారతీ స్వామి

ఆంధ్రజ్యోతి, విజయవాడ: దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం తలపెట్టిన కొన్ని నిర్మాణాలు ముప్పు తెస్తాయని, వాస్తు విరుద్ధంగా, ఆగమ శాస్త్రానికి వ్యతిరేకంగా ఆలయాల్లో ఎలాంటి పనులు చేయకూడదని శృంగేరి శివగంగ శారదా పీఠాధిపతి పురుషోత్తమ భారతీస్వామి చెప్పారు. ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను మంగళవారం ఆయన దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగత సత్కారాలు చేశారు. తిరిగి వెళుతుండగా ట్రస్ట్ బోర్డు సభ్యుడు పద్మశేఖర్ ఆలయంలో, మహా మండపం వద్ద జరుగుతున్న నిర్మాణాల అంశాన్ని ప్రస్తావించారు. దీంతో ఆయన నిర్మాణాలు తలపెట్టిన ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయం ప్రజలను అన్ని విధాలా కాపాడుతుందని, ఆలయంలో ఎలాంటి శాస్త్ర విరుద్ధ కార్యక్రమాలు చేయకూడదన్నారు. ఆగ్నేయంలో వాటర్‌ఫాల్, ఈశాన్యంలో వంటశాల నిర్మాణాలు పూర్తిగా శాస్త్ర విరుద్ధమన్నారు. భక్తుల వసతుల కోసం నిర్మాణాలు చేయడం మం చిదే కాని, వాటిని పండితులు, ఆగమ శాస్త్రవేత్తల సలహాలు తీసుకుని నిర్మిస్తే బాగుంటుందని తెలిపారు. ఆలయాల్లో విరుద్ధ నిర్మాణాలు సాగితే మనశ్శాంతి ఉండదని ఆయన స్పష్టం చేశారు. భారతీ స్వామికి సీనియర్ అర్చకుడు శంకరశాండిల్య, ఇతర అర్చకులు సత్కారాలు చేశారు



సభ్యులతో మాట్లాడుతున్న భారతీస్వామి

మిశ్రమ చేపల పెంపకమే లాభదాయకం

● మత్స్యశాఖ అభివృద్ధి అధికారి బాలకృష్ణ

తాడేపల్లి: బొచ్చె, రాగండి, మోసు చేపలను ఒకే చెరువులో పెంచడం వలన మిశ్రమ సాగు జరిగి రైతులకు మంచి లాభాలు చేకూరతాయని మత్స్య శాఖ అభివృద్ధి అధికారి బాలకృష్ణ మత్స్యకారులకు సూచించారు. మూడు రోజులుగా సాగుతున్న మత్స్యకారులకు శిక్షణా తరగతులు మంగళవారంతో ముగిశాయి. పోలకంపాడులో జరిగిన ముగింపు తరగతులకు హాజరైన బాలకృష్ణ మాట్లాడుతూ కార్డు లివర్, షార్క్ లివర్ ఆయిల్ నుంచి టాబ్లెట్‌లను తయారు చేస్తారని, అవి కంటి చూపుకు ఉపయోగపడతాయని చెప్పారు. కేన్ కల్చర్, పెన్ కల్చర్‌పై ఆయన మాట్లాడుతూ నాలుగు రోజుల చేప పిల్లలను పెంపకానికి తెచ్చినప్పుడు అవి ఆరు మిల్లీమీటర్ల సైజులో వుంటాయని, 9 నెలలకు ఒక కేజీ సైజుకు ఈ చేప పిల్లలు పెరుగుతాయని చెప్పారు. చేపల పరిమాణం పెరిగిన తరువాత నీటిలో వృక్ష ప్లవకాలు తిని అవి జీవిస్తాయన్నారు. భవానీ ఐలాండ్‌లో క్షేత్రస్థాయి శిక్షణ కూడా ఇచ్చారు. టూరిజం శాఖ, మత్స్యశాఖ సంయుక్తంగా నిర్వహించిన ఈ శిక్షణా తరగతులు ద్వారా మత్స్యకారులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా డీడీ మోహనరావు, జేడీ శివసామ్రాజ్యం, సహాయ సంచాలకులు గాలి దేవుడు, ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీఅధ్యక్షుడు వెంకటనారాయణ, జిల్లా అధ్యక్షుడు నడికుదిటి శివయ్య, మత్స్యశాఖ అధికారి నరసింహారావు పాల్గొన్నారు.

గెజిటెడ్ ఆఫీసర్ల ఫ్లాట్లకు టెండర్లు

రూ.675 కోట్ల అంచనాతో బిడ్లు కోరిన సీఆర్డీయే

అమరావతి,ఆంధ్రజ్యోతి : ప్రజాప్రతినిధులు, ప్రభుత్వాధికారులు, ఉద్యోగులకు ఫ్లాట్ల నిర్మాణ ప్రక్రియను ఏపీ సీఆర్డీయే వేగవంతం చేసింది. టైప్-1, టైప్-2 గెజిటెడ్ అధికారులతోపాటు నాలుగో తరగతి ఉద్యోగుల కోసం 27,24,080 చదరపు అడుగుల బిల్టప్ ఏరియాతో 1440 ఫ్లాట్లను నిర్మించేందుకు మంగళవారం టెండర్‌ను ఆహ్వానించింది. జీ+12 అంతస్థులతో 21 టవర్లలో ఈ ఫ్లాట్లు రానున్నాయి. వీటి నిర్మాణానికి రూ.675 కోట్ల ఖర్చవుతుందని అంచనా వేసిన సీఆర్డీయే... ఆసక్తిగల కంపెనీల నుంచి వచ్చే నెల ఐదో తేదీ వరకూ టెండర్లు స్వీకరిస్తుంది. తాజా టెండర్‌తో కలిపి ఇప్పటి వరకూ మొత్తం 3840 ఫ్లాట్లకు రూ.2103 కోట్ల అంచనాలతో సీఆర్డీయే టెండర్లు పిలిచినట్లయింది. చట్టసభల సభ్యులు, అఖిల భారత సర్వీసు(ఏఐఎస్) అధికారులతోపాటు ఉన్నతాధికారులు, ఎన్జీవోలు, నాలుగో తరగతి ఉద్యోగులకు కలిపి మొత్తం 4106 ఫ్లాట్లను వచ్చే ఏడాది చివరి నాటికి నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి విదితమే. ప్రజా ప్రతినిధులు, ఏఐఎస్, ఎన్జీవోల కోసం ఇప్పటికే సీఆర్డీయే టెండర్లను పిలిచింది. ఆయా వర్గాల హోదాను బట్టి ఫ్లాట్ల విస్తీర్ణంలో తేడా ఉంటుంది.

జాయింట్ సీపీతో వైదిక కమిటీ చర్చలు

వన్‌టౌన్ : దుర్గగుడి వైదిక కమిటీ సభ్యులు మంగళవారం రాత్రి నగర పోలీసు జయింట్ కమిషనర్ రమణకుమార్‌ను దేస్థానంలో జరుగుతున్న పలు వ్యవహారాలపై చర్చించినట్లు సమాచారం. దేవస్థానంలో ఇటీవల జరిగిన పలు ఘటనల్లో దేవస్థానం అధికారులు, వన్‌టౌన్ పోలీసు అధికారులకు మధ్య కొంత దూరం ఏర్పడినట్లు తెలుస్తుంది. ఇటీవల దేవస్థానంలో ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురు ఉద్యోగులు డబ్బులు తీసుకొని మోసం చేసిన కేసులో బాధితులు ఆలయ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికి పట్టించుకోకపోవడంతో బాధితులు నేరుగా వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి ఈ కేసులో ఇప్పటికే నలుగురిని అరెస్టు చేశారు. మరికొందరిని అరెస్టు చేయవచ్చని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో దేవస్థానం ఉన్నతాధికారి సూచన మేరకు వైదిక కమిటీ సభ్యులు జాయింట్ సీపీని కలిసి దుర్గగుడి అధికారులు, వన్‌టౌన్ పోలీసులకు మధ్య రాజీ చేయటానికి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

మా స్థలాలు మాకు ఇప్పించండి

● నవులూరు గ్రామస్థుల విన్నపం

ఆంధ్రజ్యోతి, విజయవాడ: మంగళగిరిలోని నవులూరు గ్రామంలోని 12 ఫ్లాట్ల స్థల వ్యవహారంపై తమకు న్యాయం చేయాలని ఆ గ్రామస్తులు ముఖ్యమంత్రిని వేడుకున్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో నవులూరు గ్రామానికి 12 ఫ్లాట్ల యజమానులు విలేకరుల సమావేశాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014 నుంచి 2016, సెప్టెంబరు వరకు పలు పర్యాయాలు తమకు న్యాయం చేయాలని అర్థించామని, సీఎం కూడా సమస్యలపై సుముఖంగా స్పందించారని, అధికారులు మాత్రం సహకరించడంలేదని పేర్కొన్నారు. అప్పట్లో చంద్రబాబు తమకు హామీ ఇస్తూ విజీటీఎంమ్ ఉడా, సీఆర్‌డీఏ అధికారులకు ఆదేశించినా నేటికీ అధికారులు స్పందించకపోవడం పట్ల తాము ఇబ్బందులకు గురవుతున్నట్లు చెప్పారు. లోక్‌అదాలత్‌లో ఈ విషయం ఇప్పటికే ఎనిమిదిసార్లు వాయిదా పడిందని, ఒక్క వాయిదాకు కూడా అధికారులు హాజరు కాలేదని విమర్శించారు. 60 ఏళ్ల వయసులో కూడా తాము వాయిదాలకు హాజరవుతుండగా, అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. తామందరం 1979లో ఆ 12 ఫ్లాట్లను మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిష్టర్ చేయించుకున్నామని, నవులూరు గ్రామపంచాయితీ అదే సంవత్సరం సెప్టెం బర్ 19న ఆ ఫ్లాట్లకు లేఅవుట్ మంజూ రయిందని ఫ్లాట్ల యజమానులు తెలియ జేశారు. అధికారులకు వివరించేందుకు ఎన్నిసార్లు ప్రయత్నించినా.. ఆ వ్యవహారం తమ పరిధిలోది కాదని, ముఖ్యమంత్రి నిర్ణ యం తీసుకోవాల్సి ఉందని సమాధానమిస్తున్నట్లుగా వివరిస్తున్నారు. దీనిపై సీఆర్‌డీఏ అధికారులు వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాల్సిందిగా ఫ్లాట్ల యజమానులు వేడుకుంటున్నారు.

నవంబర్ 9-11 తేదీల్లో ఢిల్లీలో కార్మిక మహాప్రదర్శన

విజయవాడ సెంట్రల్: కార్మికుల న్యాయమైన కోర్కెల సాధన కోసం నవంబర్ 9 నుంచి మూడురోజుల పాటు ఢిల్లీ పార్లమెంటు ముందు జరిగే కార్మిక మహా ప్రదర్శనకు దేశవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులను సమీకరించాలని సీఐటీయూ అఖిల భారత కార్యదర్శి యం.ఏ.గఫూర్ పిలుపునిచ్చారు. విజయవాడ గవర్నర్‌పేటలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞానకేంద్రంలో మంగళవారం కనస్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సీడబ్ల్యుఎఫ్ఐ) అఖిల భారత కౌన్సిల్ సమావేశాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్పొరేట్లు, విదేశీ కంపెనీలకు బీజేపీ ప్రభుత్వ హయాంలో మంచిరోజులు వచ్చాయన్నారు. కార్మికులకు నష్టం చేసేట్లు చట్టాలు మారుస్తున్నారని చెప్పారు. మతం పేరిట ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారని ఆరోపించారు. మత సామరస్యం, కార్మిక ఐక్యత, కార్మిక అనుకూల విధానాల కోసం పోరాటాలు చెయ్యాలని చెప్పారు. రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం పార్లమెంటు చట్టం చేసిన భవన నిర్మాణ సంక్షేమ నిధికి తూట్లు పొడుస్తోందన్నారు. చంద్రన్న బీమా అంటూ నిధులు మళ్లించిందన్నారు.



సీడబ్ల్యుఎఫ్ఐ సమావేశాల్లో ప్రసంగిస్తున్న యం.ఏ. గఫూర్

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం తగు కార్యాచరణ రూపొం దించాలని కోరారు. సీడబ్ల్యుఎఫ్ఐ అధ్యక్షుడు ఆర్. సింగారవేలు, ప్రధాన కార్యదర్శి దేబంజన్ చక్రవర్తి, వి. ఉమమహేశ్వరరావు తదితరులు సమావేశంలో ప్రసంగించారు. ప్రధాన కార్యదర్శి నివేదికపై రాష్ట్రాల ప్రతినిధులు చర్చించారు. రెండు రోజుల పాటు జరిగే సమావేశాలు బుధవారం ముగుస్తాయి.

సర్వేజనా.. సంక్షేమం



ఒకప్పుడు పార్టీలు తమ నాయకుల పని తీరుపై సర్వేలు చేసుకునేవి. జనం నుంచి వివరాలు రాబట్టేవి. వాటి ప్రకారం పనితీరు నిర్ధారించుకునేవి. ఇప్పుడు పరిస్థితి మారింది. ప్రభుత్వమే తన పనితీరుపై సర్వే చేయించుకుంటోంది. ప్రజల నాడి, బాధలు తెలుసుకుంటోంది. ఇది ఒక విధంగా ప్రజలకు వరమే! క్షేత్రస్థాయిలో జరుగుతున్న తప్పులు మొహమాటం లేకుండా చెబితే ప్రభుత్వం దృష్టికి వెళ్తుంది. లబ్ధిదారులకు, సమాజానికి న్యాయం జరుగుతుంది. అయితే కొంతమంది వాస్తవాలు చెప్పడం లేదు. తమ బాధ్యత కాదన్నట్లు తప్పించుకుంటున్నారు. వాస్తవాలు చెబితేనే ప్రయోజనం ఉంటుంది. క్షేత్రస్థాయిలో తప్పులు సరిదిద్దడంతో పాటు న్యాయం జరుగుతుంది.

- అభివృద్ధి, సంక్షేమం అమలుపై ప్రభుత్వ సర్వే
- ప్రజలు నిర్భయంగా నిజం చెబితే ప్రయోజనాలు
- తప్పులు సరిదిద్దేందుకు సర్కారుకు వెసులుబాటు
- సెల్‌ఫోన్ ద్వారా విస్తృతంగా వాయిస్ సర్వే


సమాజ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోంది. ఇవన్నీ బాగానే అమలవుతున్నట్లు అధికార యంత్రాంగం చెబుతోంది. కానీ.. క్షేత్రస్థాయిలో అవి ప్రజలకు చేరువవుతున్నాయా? లేదా? అనే దానిపై పక్కా సమాచారం మాత్రం నేరుగా ప్రజల నుంచి ప్రభుత్వానికి చేరితేనే ప్రయోజనం ఉంటుంది. అందుకే ప్రభుత్వ విభాగాలు సెల్‌ఫోన్ వాయిస్ మెసేజ్‌ల ద్వారా సర్వే నిర్వహిస్తున్నాయి. వీటికి ప్రజలు నిర్భయంగా సమాధానం చెబితేనే క్షేత్రస్థాయిలో తప్పులు సరిదిద్దడంతో పాటు లబ్ధిదారులకు న్యాయం జరుగుతుంది.



'చెత్త'శుద్ధి అవసరం..

● జిల్లాలోని అన్ని పంచాయతీల్లో చెత్త సంపద ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుసాగుతోంది. ఇప్పటికే ఎంపిక చేసిన పలు పంచాయతీల్లో శిక్షణను ఇచ్చారు.

? జిల్లాలో ఏర్పాటు చేసిన పంచాయతీల్లో చెత్త సంపద ఉత్పత్తి కేంద్రాలు ఏ దిశగా పయనిస్తున్నాయి, చెత్త సేకరణ, తరలింపు ఎలా ఉందో అప్పుడప్పుడు వివరాలు సేకరిస్తున్నారు. ఇందులో నిజమేంతో చెప్పండి.



మీ రహదారి, కాలువలు మెరుగ్గా...

● పల్లెల్లో తాగునీటి సమస్య, రహదారులు, కాలువల పరిస్థితిపై పంచాయతీరాజ్‌శాఖ ప్రజల అభిప్రాయాలు కోరుతోంది. ఉపాధి హామీ కింద సీసీ రహదారులకు 90 శాతం నిధులు కేటాయించి పనులు చేపట్టారు.

? ఆ పనులు ఎలా ఉన్నాయి. మీ ఇంటి పక్కనున్న కాలువ పరిస్థితి ఎలా ఉందో నిర్భయంగా తెలపండి.

దీపం వెలుగులివ్వాలి...



● పొగరహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరికి గ్యాస్ పొయ్యిలు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం.

? వాస్తవ పరిస్థితి ఇలా ఉంది.. గ్యాస్ పొయ్యిలు అందరికీ అదింది నిజమేనా.. నిర్భయంగా తెలపండి.

పింఛన్లు అందుతున్నాయా?

● జిల్లాలో 3.75 లక్షల మందికి ఆగస్టు నెలకు పింఛన్లు మంజురయ్యాయి. ప్రతి నెల ఐదో తేదీ నాటికి ఫించన్లు పంపిణీ చేయాలి. ప్రతి నెలా ఇబ్బందులు దృష్ట్యా దీని 10వ తేదీ వరకు పెంచారు. దీనికి తోడు కొత్త పింఛన్లు మంజూరుకు జన్మభూమి కమిటీల సభ్యులు చేతివాటం చూపుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పింఛన్లు పంపిణీలోనూ కొంతమంది సిబ్బందిపై ఆరోపణలున్నాయి. మృతులు, వలసదారుల పింఛన్లు పక్కతోవ పడుతున్నట్లు అనుమానాలున్నాయి.

? పింఛన్లు అర్హులకు అందుతున్నాయా.. ఆరోపణలు ఉన్నాయా.. కొత్త పింఛన్లు అవసరమా? సిబ్బంది సరిగా పనిచేస్తున్నారా? నిర్ణీత గడువులోగా సక్రమంగా పంపిణీ చేస్తున్నారా? జన్మభూమి కమిటీ సభ్యులు సరైన వారినే సిఫార్సు చేశారా? వంటి ప్రశ్నలు అడుగుతున్నారు. మీరు వివరాలు తెలపండి.





వైద్యసేవలు.. అంతంతేనా?

● జిల్లాలో సర్కారు వైద్యంపై చాలా విమర్శలు తలెత్తుతున్నాయి. జిల్లా కేంద్రంలో జీజీహెచ్‌తోపాటు అన్ని పట్టణాలు, గ్రామాలలో పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ప్రాంతీయ ఆసుపత్రులు ఉన్నా వైద్య సేవలపై విమర్శలు వినిపిస్తూనే ఉన్నాయి.

? ఆసుపత్రుల్లో వైద్య నిపుణులు, వైద్యులు అందుబాటులో ఉంటున్నారా? మందుల కొరత వెంటాడుతోందా? ఆధునిక వైద్యం అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితం ఇస్తున్నాయా? 69 శాతం మంది సొంత ఖర్చులతోనే వైద్యం చేయించుకుంటున్నట్లు కేంద్ర ఆర్థికశాఖ నిర్వహించిన సర్వేలో తేలిన విషయం నిజమేనా? దీనిపై నిర్భయంగా సమాధానం ఇవ్వండి.

చంద్రన్న బీమా.. పేదలకు ధీమా?

● కేవలం రూ.12 ప్రీమియంతో రూ.5 లక్షల వరకు పరిహారం పొందేలా ప్రభుత్వం ప్రవేశపెట్టిన చంద్రన్న బీమా పేదలకు మేలు చేస్తోంది. జిల్లాలో ఇప్పటికే ఈ పథకం 13 లక్షల మంది చేరారు. ఇంతవరకు 10 వేలమంది మృతి చెందినట్లు గుర్తించి 6వేల మంది వరకు సుమారు రూ.32 కోట్లు క్లెయిమ్‌లు అందించారు.

? నిర్ణీత గడువులోగా బీమా పరిహారం అందుతోందా లేదా? సకాలంలో పరిహారం బీమా సంస్థల చెల్లిస్తోందా? ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా? ధైర్యంగా తెలపండి.



పక్కా ఇళ్లు..బాగున్నాయా...

● జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్‌యోజన, ఎన్టీఆర్ పట్టణ గృహ నిర్మాణ పథకాల కింద గత ఏడాది 12,500 ఇళ్లు మంజూరయ్యాయి. ఈ ఏడాది మరో 12,500 ఇస్తున్నారు.

? ఇవి అర్హులకు అందాయా.. వీటి నిర్మాణాలు, బిల్లులు చెల్లింపులు అయ్యాయా? చెల్లింపులు సరిగా లేవా? ఇంకా నిధులు అవసరమా? మొహమాటపడకుండా నిజాలు తెలపండి.



రుణం.. భారమా?



● స్వయం ఉపాధి కల్పనకు మార్గం సుగమం చేసేందుకు. ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ, కాపు కార్పొరేషన్ల ద్వారా పెద్ద ఎత్తున రుణాలు మంజూరు చేయిస్తున్నారు.

? రికవరీలు సరిగా చెల్లిస్తారన్న వారికే బ్యాంకర్లు రుణాలు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారా... బ్యాంకర్లు అంగీకరించిన లబ్ధిదారులకు జన్మభూమి కమిటీలు ఆమోద ముద్ర వేయకపోవడంతో సమస్యలు తలెత్తాయా.. లక్ష్యం చేరుకోకపోవడానికి కారణమేమిటి? యూనిట్లు గ్రౌండ్ ఎందుకు కాలేదు. అక్రమాలు చోటుచేసుకుంటున్నాయా? అర్హులకు అందుతున్నాయా? సమాచారమివ్వండి.



సంగీతం చెవులకే కాదు.. కనులకీ ఇంపుగా ఉండాలనుకునే రోజులు వచ్చేశాయి. ఒకప్పుడు స్పీకర్లు అంటే మ్యూజిక్ సిస్టమ్‌కు అనుసంధానించేవి మాత్రమే. ఇప్పుడు కంప్యూటర్‌కు, టీవీలకీ తగిలించేస్తున్నాం. తాజాగా మార్కెట్‌లోకి వస్తున్న స్పీకర్లకు సెల్‌ఫోన్‌ను సైతం అనుసంధానించి, సంగీతం వినే సౌకర్యమూ ఉంటోంది. స్పీకర్లు ఎంత బాగా పనిచేస్తున్నాయో చూసే రోజులు పోయాయి. నాణ్యమైన సౌండ్ ఇస్తున్నాయో లేదో చూసి సరిపెట్టుకోవడం లేదు. పనితీరు ఎంత బాగున్నా చూపులకీ ఇంపుగా ఉండాలంటోంది నవతరం. స్పీకర్లు టేబుల్ మీద పెట్టుకునే దీర్ఘచతురస్రాకార బాక్స్‌ల మాదరి ఉంటే ఏం అందం... ఇదీ వారి ఆలోచన. అందుకే స్పీకర్లు రూపు మార్చుకున్నాయి. యువత ఆలోచనలకు అనుగుణంగా రకరకాల రూపాల్లో వింటేజ్ డిజైనర్ స్పీకర్లు ప్రస్తుతం నగర మార్కెట్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. వాటి రూపాలకు కుర్రకారు ఫిదా అవుతున్నారు. నాణ్యత తీసిపోకుండా చుట్టూ ఉన్న వాతావరణాన్ని ఆహ్లాదభరితం చేసే స్పీకర్లను తమ వెంట ఉంచుకోవడానికి ఆరాటపడుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ ఫీచర్స్

పాటకు అందం

- సంగీతహోరు.. వీనుల విందు.. కంటికి ఇంపు..
- పాటల్ని కొత్తగా ఆస్వాదిస్తున్న నవతరం
- సౌండ్ బాక్స్ వైవిధ్య భరితం
- కుర్రకారు మనసు కొల్లగొట్టేస్తున్న డిజైనర్ స్పీకర్లు









కెపాసిటీ ఒకటే సరిపోదు

సాధారణంగా ఇంట్లో ఉండే స్థలాన్ని అనుసరించి స్పీకర్లను ఎంపిక చేసుకుంటాం. కాస్త విశాలమైన గది ఉంటే ఫ్లోర్ స్టాండింగ్ స్పీకర్లు... చిన్న గదే అయితే టేబుల్ మీదకు బుక్ షెల్ఫ్ స్పీకర్లు... గోడలకు తగిలించేద్దాం అంటే ఇన్‌వాల్ స్పీకర్లు ఇలా చాలా రకాలు ఉన్నాయి. ఒకప్పుడు స్పీకర్ల కెపాసిటీ ఎంత ఉంటే అంత గొప్ప. కానీ ప్రస్తుతం తయారీ దారుల దృష్టి డిజైనింగ్‌పై పడింది. స్పీకర్‌ను ఎంత అందంగా ఎంత కొత్తగా తయారు చేస్తే అంత సులువుగా మార్కెట్ చేసుకోవచ్చన్న ఫిలాసఫీ వారిది. దానికి తగ్గట్లే కుర్రకారు సైతం వాటి డిజైన్లకు ఫిదా అయిపోతున్నారు.

విభిన్న రూపాల్లో..

ప్రస్తుతం స్పీకర్లు ఫలానా రూపంలోనే ఉంటాయని చెప్పడం కష్టం. పెద్దపెద్ద భవనాలు, చిన్నచిన్న నివాసాలు, జంతువులు, వాహనాలు, క్రికెట్ బ్యాట్‌లు, రూబిక్ క్యూబ్‌లు, పుస్తకాలు, చెప్పులు... ఇలా ఏరకంగానైనా ఉండొచ్చు. అయితే వాటిలో రూబిక్ క్యూబ్ రూపంలో ఉన్న స్పీకర్లను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. దానిపై వివిధ రంగుల క్యూబ్‌లు ఉండటమే ప్రధాన ఆకర్షణ. ఇల్లు ఆకారంలో ఉండేవి... చెప్పుల రూపంలో ఉండేవి, పాత తరం టెలీఫోన్, రేడియో రూపంలో ఉండేవి... హాట్‌కేకుల్లా అమ్ముడవుతున్నాయి. పువ్వులు, జంతువులు, పక్షులు, మంచాలు, దిండ్లు వంటి మోడల్స్‌లోనూ స్పీకర్లు దొరుకుతున్నాయి.

నృత్యాలూ చేస్తాయి..

స్పీకర్లు వివిధ రూపాల్లో ఉండటమే అందం అనుకుంటే వాటికి మరికొన్ని అదనపు హంగులు సమకూర్చుతున్నారు. డాన్సింగ్ స్పీకర్లు, ఇప్పుడిప్పుడే మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నాయి. అలాంటిదే డాన్సింగ్ క్యాట్. పిల్లి బొమ్మలో స్పీకర్ ఉంటుంది. దానికి వైరు ద్వారా సెల్‌ఫోన్ అనుసంధానించి ఫోన్లో మ్యూజిక్ ప్లే చేస్తే పిల్లి పాడుతూ ఆడటం మొదలుపెడుతుంది. అదే తరహాలో డాన్సింగ్ డాగ్, డాన్సింగ్ పిగ్, డాన్సింగ్ టెడ్డీ, డాన్సింగ్ ర్యాబిట్ వంటివి చాలానే ఉన్నాయి. ఇంకా కొన్ని పక్షులు, పాములు కూడా డాన్స్ చేస్తున్నాయి. ఇదే విభాగంలో పాటలు పాడుతుంటే డాన్స్ చేసే లైట్లు వస్తున్నాయి. స్పీకర్లకే కొన్ని విద్యుద్దీపాలు ఉంటాయి. పాటలకి అనుగుణంగా ఇవి నాట్యాలు చేస్తాయి. మొత్తమ్మీద ప్రస్తుతం స్పీకర్ అన్న కాన్సెప్టే పూర్తిగా మారిపోయింది. పాడే పరికరం ఎంత అందంగా ఉంది అన్నది ముఖ్యం. ఇప్పటి స్పీకర్లు చెవులకి జలపాతహోరును వినిపించడమే కాదు కనువిందు చేస్తున్నాయి.



ఈస్టర్న్ రీజియన్ ఫైర్ ఆఫీసర్‌గా శ్రీనివాసులు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఈస్టరన్ రీజియన్ ఫైర్ ఆఫీసర్‌గా జి.శ్రీనివాసులు మంగళవారం విజయ వాడలోని స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇటీవలే పదోన్నతి పొందారు. కృష్ణా, పశ్చిమ, తూర్పు, విశాఖ పట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు ఈస్టర్న్ రీజియన్ పరిధిలోకి వస్తాయి.

పాఠకులకు సూచన:
క్లాసిఫైడ్ ప్రకటనలకు స్పందించే ముందు పూర్తిగా విచారించి తగిన నిర్ణయం తీసుకోగలరు. ప్రకటనదారు ప్రకటిస్తున్న లేదా చేసుకుంటున్న క్లయిమ్‌లతో మా పత్రికకు ఎటువంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
- మేనేజర్



దుర్గగుడిలో భారతీయ మహాస్వామికి అమ్మవారి చిత్రపటం అందచేస్తున్న ఆలయ ఈవో సూర్యకుమారి, కన్యాకుమారికి అమ్మవారి చిత్రపటం అందచేస్తున్న ఆలయ కమిటి ధర్మకర్తలు

దుర్గమ్మ సన్నిధిలో భారతీమహాస్వామి, కన్యాకుమారి

వన్‌టౌన్: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో కనక దుర్గమ్మను మంగళవారం శృంగేరి శివగంగా శారదా పీఠాధిపతి పతులు పురుషోత్తమ భారతీమహాస్వామి, ప్రముఖ వయోలిన్ విద్వాంసురాలు అవసరాల కన్యా కుమారి వేరువేరుగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో ఎ.సూర్యకుమారి, ఆలయ కమిటి చైర్మన్ యలమంచిలి గౌరంగబాబు, ధర్మకర్తలు, వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, అమ్మవారి సన్నిధికి తోడ్కొని వెళ్లారు. అర్చకులు వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశీర్వచన మండపంలో ఆలయ వేద పండితులు వారికి అమ్మవారి ఆశీస్సులు అందజేశారు. అనంతరం అమ్మవారి శేషవస్త్రం, చిత్రపటం, లడ్డూ ప్రసాదం బహూకరించారు.



ప్రసంగిస్తున్న డీసీపీ గజరావ్ భూపాల్, పాల్గొన్న దేవినేని అవినాష్, బుచ్చిబాబు, హాజరైన విద్యార్థులు

ర్యాగింగ్, డ్రగ్స్ బారిన పడొద్దు

విద్యార్థులకు డీసీపీ గజరావ్ భూపాల్ సూచన

పటమట: ర్యాగింగ్, డ్రగ్స్ వంటి చెడు ప్రవర్తన, వ్యసనాలకు లోనుకావద్దని డీసీపీ గజరావ్ భూపాల్ యువతకు సూచించారు. మంగళవారం వేదిక కళ్యాణ మండపంలో యాంటీ ర్యాగింగ్ కన్వీనర్ దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో నగరాన్ని ర్యాగింగ్, డ్రగ్స్ ఫ్రీ సిటీగా మార్చాలి అనే అంశంపై రాజకీయాలకు అతీతంగా అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఆయా కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా డీసీపీ భూపాల్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రాష్ట్ర రాజధాని అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దాలని యోచిస్తున్నారని ఆ స్థాయిలోనే నగరాన్ని ఉంచడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. డ్రగ్స్ వాడకంపై ప్రస్తుతానికి తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదన్నారు. ఇపుడిపుడే నగరానికి వ్యాప్తి అవుతున్నట్లు అనధికార సమాచారం ఉందన్నారు. అది విద్యార్థుల ద్వారా జరుగుతున్నట్లైతే కనుక్కోవడం అతి కష్టమని, అలాంటి సంఘటనలు ఎక్కడైన సంభవిస్తే తమకు సమాచారం అందజేసి సహకరించాలని కోరారు. దేవినేని అవినాష్ మాట్లాడుతూ ప్రజలు డ్రగ్, ర్యాగింగ్ వంటి మహమ్మారి చెరలో పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఆపద వచ్చినా, డ్రగ్స్, ర్యాగింగ్ వంటి సమాచారం తెలిసినా 100 నెంబరుకు ఫోన్ చేసి పోలీసులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీ ఛానల్ ఎండీ కడియాల బుచ్చిబాబు, ఏసీపీ సత్యానందం, ఆయా కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా నేతగా రోజా అనర్హురాలు :తాడి శకుంతల

విజయవాడ:బాధ్యతాయుతమైన పతిపక్ష హోదాలో కొనసాగుతున్న రోజా మహిళా నేతగా అనర్హురాలని టీడీపీ అర్బన్ పార్టీ మహిళా నేత తాడి శకుంతల విమర్శించారు. కేశినేని భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రోజా విజ్ఞత లేకుండా అసభ్యకరంగా సాటి మహిళ భూమా అఖిల ప్రియను విమర్శించి అబాసుపాలయ్యారన్నారు. నంద్యాల ఓటర్లు ఇచ్చిన తీర్పును గుణపాఠంగా తీసుకొని వైసీపీ నేతల బుద్ధి మార్చుకోవాలని హితవు పలికారు. సమావేశంలో అర్బన్ మహిళా నాయకురాలు ఈది పార్వతి, చెన్నుపాటి ఉషారాణి, ఆర్.పార్వతి, అడ్వొకేట్ జ్ఞానంబ, 16వ డివిజన్ మహిళా అధ్యక్షురాలు ఎ.దుర్గా, జయశీల, అధికార ప్రతినిధి రోజా, నిర్మలా, శ్యామల పాల్గొన్నారు.

గెలుపు తర్వాత రోజా జాడేదీ?: ఆచంట సునీత

నంద్యాల ఉప ఎన్నికలో టీడీపీ భారీ గెలుపు అనంతరం వైసీపీ మహిళా నేత రోజా జాడ లేదని జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆచంట సునీత అన్నారు. జిల్లా టీడీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో రోజా మాట్లాడిన తీరుపై రాష్ట్ర మహిళలు అసహ్యించుకుంటున్నారన్నారు. వైసీపీ నేతలు ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోక పోతే భవిష్యత్‌లో పతిపక్ష హోదా కూడా ఉండదని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి తలశిల స్వర్ణలత పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకున్న యజమానుల విచారణకు

నేడు బహిరంగ కోర్టు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

చదువుకునే బాలలను పనిలో పెట్టుకుని వారి భవిష్యత్తును కాలరాస్తున్న యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని సహాయ కార్మిక కమిషనర్ డి.ఆంజనేయరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19 నుంచి పది రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక దాడులలో 72 మంది బాలకార్మికులను గుర్తించినట్లు తెలిపారు.

వీరిని పనిలో పెట్టుకున్న యజమానులను విచారణ జరిపేందుకు బుధవారం విజయవాడ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు బహిరంగ విచారణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా యజమానులకు, బాల కార్మికుల తల్లిదండ్రులకు విద్యాహక్కు-చట్టం, కార్మిక చట్టాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

తాతయ్య కోసం.. ఓ యాప్



క్లిక్ అండ్ ఫైండ్

ఓ పదహారేళ్ల అమ్మాయి.. తన తాతయ్య కంటి సమస్యను చూడలేక .. దాని గురించి తెలుసుకోవడం మొదలుపెట్టింది. ఆ సమస్యను పరిష్కరించే పనిలో భాగంగా పరిశోధన మొదలుపెట్టింది. ఎంతోమంది పేదవాళ్లు, వృద్ధులు 'డయాబెటిక్ రెటినోపతి'తో బాధపడుతున్నారని తెలుసుకుని బాధపడింది.ఆ వ్యాధిని నిర్ధారించేందుకు 'ఐ అగ్నోసిస్' (eyeagnosis) అనే ఓ యాప్‌ను కనిపెట్టింది. మీట్ అవర్ తెలుగమ్మాయి కావ్య కొప్పరపు.



కావ్య కొప్పరపు తన ఇంటర్ మొదటి సంవత్సరం(2016) పూర్తి చేసుకుని, వేసవి సెలవుల్లో తాతయ్య ఇంటికి వచ్చింది. వాళ్ల తాతయ్యకు 2013లో 'డయాబెటిక్ రెటినోపతి' ఉన్నట్లు తెలిసింది. 'ఈ వ్యాధి కారణంగా రెటినాలోని రక్తనాళాలు దెబ్బతింటాయి. అంతేకాదు ఆ వ్యాధి ముదిరితే పూర్తిగా చూపు కోల్పోయే ప్రమాదం కూడా ఉంది. తన తాతయ్యకు వచ్చిన జబ్బు గురించి కావ్య తెలుసుకోవడం మొదలుపెట్టింది. ప్రపంచవ్యాప్తంగా 415 మిలియన్ ప్రజలు డయాబెటిస్‌తో బాధపడుతున్నారని, అందులో 25 శాతం మందికి 'రెటినోపతి' వచ్చే అవకాశం ఉందని తెలుసుకుంది. ఎక్కువమంది పేదలు, వృద్ధులే ఈ వ్యాధి బారినపడుతున్నారు. రెటినోపతి వచ్చిందో, రాలేదో తెలుసుకోవడానికి ఎంతో ఖర్చవుతుంది. ఆర్థిక సమస్యల కారణంగా చాలామంది ఈ వ్యాధి నిర్ధారించుకోలేక అంధులుగా మారుతున్నారనే విషయం కావ్యకు బోధపడింది. అందుకే 'ఐ అగ్నోసిస్' అనే యాప్‌ను రూపొందించింది. రెండు గంటల్లో నిర్ధారించే 'రెటినోపతి' వ్యాధిని ఈ యాప్ ఆధారంగా కేవలం కొన్ని నిమిషాల్లోనే చెప్పొచ్చు. త్రీడీ లెన్స్ కలిగిన 'ఐ అగ్నోసిస్' యాప్ కంటిని ఫొటో తీయడం ద్వారా 'రెటినోపతి' ఉందో, లేదో ఈజీగా తెలుసుకోవచ్చు. ఈ యాప్ తయారు చేయడంలో కావ్య తమ్ముడు నియంత్, క్లాస్‌మేట్ జాంగ్ సహకారం అందించారు. అమెరికాలోని న్యూయార్క్‌లో గత నెలలో జరిగిన 'ఓ రియాలిటీ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కాన్ఫరెన్స్'లో ఈ ప్రాజెక్టు గురించి కావ్య వివరించింది.

పదహారేళ్ల కావ్య చక్కగా చదువుకుంటోంది. ప్రశాంతత కోసం పాటలు వింటుంది, తన ఆనందం కోసం పియానో ప్లే చేస్తుంది. ఇతరులకు సాయం చేయాలనే తపనతో ఓ స్వచ్ఛంద సంస్థను నడిపిస్తోంది. బాలికలు, స్త్రీలకు కంప్యూటర్ స్కిల్స్ పెంపొందించాలనే ఉద్దేశంతో 'గర్ల్స్ కంప్యూటింగ్ లీగ్' పేరుతో ఓ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించింది. పేదపిల్లలకు 'కోడింగ్ వర్క్‌షాప్స్' కూడా నిర్వహిస్తోంది.



'నేను ఎంతో మంది కంటి డాక్టర్లు, నిపుణులతో పాటు పాథాలజిస్ట్స్, బయోకెమిస్ట్స్, ఎపిడెమియోలజిస్ట్స్, న్యూరో సైంటిస్ట్‌లను సంప్రదించాను. వారి సలహాలు, సూచనలు తీసుకున్నాను. గూగుల్‌లో కూడా ఎంతో శోధించాను. చివరగా అనుకున్నది సాధించాను. నాకెంతో సంతోషంగా ఉంది.'

- కావ్య

'కావ్య అద్భుతం చేసింది. తాను రూపొందించిన ఈ యాప్ ఎంతోమందికి ఉపయోగపడుతుంది. ఇప్పుడున్న నిర్ధారణ చికిత్సలన్నింటి కన్నా దీంతో వ్యయం చాలా తక్కువ అవుతుంది. ప్రాసెస్ కూడా చాలా తేలిక. ఎంతోమంది నిపుణులు చేయలేని పని ఈమె చేసి చూపించింది. కావ్యకు నా అభినందనలు.'

- హెజ్ మాన్సిక్ (అమెరికాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్‌లో విజువల్ డిసీజ్ ఎక్స్‌పర్ట్)

టంగ్ ట్విస్టర్స్

1. It's not the cough that carries you off, it's the coffin they carry you off in!
2. I wish you were a fish in my dish
3. Dust is a disk's worst enemy.
4. She said she should sit. , She said she should sit.

నవ్వుల్ నవ్వుల్

డిశ్చార్జ్ అయి వెళ్లిపోతున్న పేషెంట్‌తో
డాక్టర్: ఇప్పుడు తేలిగ్గానే అనిపిస్తోందా?
రోగి: (పర్సు తడుముకుంటూ): హా... చాలా తేలిగ్గా అనిపిస్తోంది.

సూక్తి

పని చేసేటప్పుడు.. ఆలోచన పని మీదే ఉండాలి. ఫలితం మీద కాదు.

రంగులు వేయండి




ఔనా!

నెమళ్లలో మగవాటిని 'పీకాక్', ఆడవాటిని 'పీహెన్', పిల్లను 'పీచిక్', గుంపును 'పార్టీ' అంటారు.



దారి కనుక్కోండి



చెప్పగలరా?


జారులో ఉన్నా కానీ
పోరులో లేను
తీపిలో ఉన్నా కానీ
తాపిలో లేను
ప్రాయంలో ఉన్నా కానీ
ప్రాణంలో లేను
అయితే ఇంతకీ
నేనెవర్నో చెప్పగలరా?

మీకు తెలుసా?



అరటిపండ్లు సూర్యుని దిశగా పెరగటం వల్ల వంకరగా ఉంటాయట!

చుక్కలు కలపండి



పదాలు గుర్తించండి

shoe, duck, doll, globe, block, green

x	k	c	o	l	b
l	n	e	e	r	g
l	g	l	o	b	e
o	q	n	c	w	c
d	n	s	h	o	e
u	w	k	c	u	d

జంబ్లింగ్ వర్డ్స్

1. BWLO ▶ ....
2. LDOR ▶ ....
3. ALPM ▶ ....
4. TLAL ▶ ....

జంతర్ మంతర్

1. రాయంజకీ ▶ ....
2. అన్నతంత్యు ▶ ....
3. నీఅతివి ▶ ....
4. నంవమార్త ▶ ....

జవాబులు

చెప్పగలరా? : జాతీయం
జంతర్‌మంతర్ : 1. రాజకీయం 2. అత్యున్నతం 3. అవినీతి 4. వర్తమానం
జంబ్లింగ్ వర్డ్స్ : 1. BLOW/ BOWL 2. LORD 3. LAMP/PALM 4. TALL

స్మార్ట్ పార్కింగ్...అడుగు వెనక్కు

స్మార్క్ పార్కింగ్ ప్రక్రియపై ముందుకొచ్చిన సంస్థలు వీఎంసీ నిబంధనల నుంచి సడలింపు ప్రక్రియకు తెరతీస్తున్నాయి. సడలించడం ఇష్టపడని వీఎంసీ ససేమిరా అంటోంది. దీంతో టెండరు ప్రక్రియకు బ్రేక్ పడింది. అద్దె భారం భరించలేమంటూ అద్దెదారులు వెనకుడుగు వేయడంతో 106 షాపుల ఎన్టీయార్ కాంప్లెక్సు కథ కూడా బ్రేకులు పడుతూ వస్తోంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

● ప్రశ్నార్థకంగా స్మార్ట్ పార్కింగ్, ఎన్టీయార్ కాంప్లెక్సుల టెండర్లు ● అరకొర స్పందన ● పునరాలోచనలో వీఎంసీ ● అద్దెలు తగ్గించాలని ఒకరు, పాత టెండరుదారులకే ఇవ్వాలని మరొకరు

ఆకట్టుకుంటాయనుకున్న ప్రాజెక్టులు వెనకడుగు వేస్తున్నాయి. నగరానికి తలమానికంగా మారాల్సినవి కాస్తా నత్తనడకన సాగుతున్నాయి. టెండర్ల ప్రక్రియకు వ్యతిరేక పవనాలు వీస్తుండటంతో అనుకూలంగా మార్చుకునే దిశగా కార్పొరేషన్ పునరాలోచనలో పడింది. దిద్దుబాటు చర్యలకు ఉపక్రమిస్తోంది. రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ప్రారంభించాలన్న నిర్ణయంతో మొదలైన స్మార్ట్ పార్కింగ్ టెండర్ల ప్రక్రియకు కామా పడింది. టెండర్ల ఆహ్వానానికి స్పందించిన మూడు సంస్థలు లాభాపేక్షవైపే మొగ్గుచూపు తున్నందు వల్ల ఖరారు నిర్ణయాన్ని పెండింగ్‌లో పెట్టారు. ఐటీ హబ్‌గా తీర్చిదిద్దాలన్న ఎన్టీయార్ కాంప్లెక్సు టెండర్ల ప్రక్రియ కూడా నత్తనడకన సాగుతుంది. అధిక అద్దెల ప్రభావం వ్యాపారంపై పడుతుందని భావిస్తున్న వ్యాపా రులంతా టెండర్ల ప్రక్రియలో పాల్గొనేందుకే భయపడుతున్నారు.

సాంకేతిక నైపుణ్యంతో ముడిపడి ఉన్న స్మార్క్ పార్కింగ్ ప్రక్రియపై ముందుకొచ్చిన సంస్థలు వీఎంసీ విధించిన నిబంధనలనుంచి కొద్ది కొద్దిగా సడలింపు ప్రక్రియకు తెరతీస్తున్నాయి. 'ఆ విధానం అవసరం లేదు. ఇది బాగుంటుంది'అంటూ పలు మార్పులకు ప్రయత్నిస్తున్నాయి.



ఐటీహబ్‌గా తీర్చిదిద్దాలన్న 106 షాపుల ఎన్టీయార్ కాంప్లెక్సు కథ కూడా బ్రేకులు పడుతూ వస్తోంది. చదరపు అడుగుల విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్ణయించిన అద్దె ధరలకు టెండరుదారులు వెనకడుగు వేస్తున్నారు. ధరలు తగ్గించాలని వినతులు సమర్పిస్తున్నారు.

స్మార్ట్ ఇన్ వెయిటింగ్

స్మార్ట్ పార్కింగ్‌కు స్పందించిన టెండరుదారు సంస్థలు అడుగులు వేయడం లేదు. మార్పులకు కార్పొరేషన్‌ను ఒప్పించే ప్రయత్నం చేస్తుండగా, నిర్దేశించిన నియమాలను సడలించడం ఇష్టపడని వీఎంసీ ససేమిరా అంటోంది. దీంతో టెండరు ప్రక్రియకు బ్రేక్ పడింది. ప్రస్తుతం స్మార్ట్ పార్కింగ్ నిర్వహిస్తున్న ప్రాంతాల్లో కూడా తాము ఇదే పద్ధతులను పాటిస్తున్నామని చెబుతున్నారని సమాచారం. దాంతో అక్కడ పాటిస్తున్న పద్ధతులను పూర్తి స్థాయి నివేదికను సమర్పించాల్సిందిగా కమిషనర్ కోరారు. ఆ నివేదిక సమర్పించిన అనంతరం కమిషనర్ తన తుది నిర్ణయాన్ని తెలియజేస్తారు. అప్పటి వరకు టెండర్లు ముగిసినా పాత కాంట్రాక్టర్లే కొనసాగేలా ఎస్టేట్ అధికారులు అనుమతులు ఇచ్చారు.

అద్దె భారం

ఎన్టీయార్ కాంప్లెక్సులోని 106 షాపుల్లో ఒక్కొక్క షాపునకు రూ.5లక్షల చొప్పున గుడ్‌విల్ ప్రకటించిన అధికారులు అద్దెలు మాత్రం భారీగా చూపారు. మూడు రకాల కొలతల్లో ఉన్న షాపులకు మూడు ధరలను నిర్ణయిస్తూ ప్రకటన ఇచ్చారు. 144 చదరపు అడుగులకు రూ.15వేలు, 216 చదరపు అడుగులకు రూ.17 వేలు, 266 చదరపు అడుగులకు రూ.23వేల అద్దెలను చూసి టెండరుదారులు స్పందించేందుకు కూడా భయపడు తున్నారు. దీంతో ఈ టెండరు కాలపరిమితిని పెంచుతూ కార్పొరేషన్ ఇటీవలే చర్యలు తీసుకుంది. ఈ దఫా కూడా అరకొర టెండర్లు నమోదయిన నేపథ్యంలో అద్దెలను తగ్గించే దిశగా చర్చలు తీసుకోవచ్చని సమాచారం.

రైతుబజార్ ధరలు



(నిన్నటివి)

టమాటో 29-00, వంకాయ (గులాబీ) 25-00,వంకాయ(గుండ్రం) 22-00, బెండ కాయలు12-00, పచ్చిమిర్చి-సన్నం 18-00, కాకరకాయలు 12-00, బీర నాటు 14-00, క్యాబేజీ 19-00, క్యారెట్ 45-00, దొండకాయలు 18-00, బంగాళా దుంపలు 13-00/10-00, ఉల్లిపాయలు 20-00, గోరుచిక్కుళ్ళు 18-00, దోస 12-00, సొరపెద్ద/చిన్న 12-00/10-00, పొట్ల 12-00 /10-00, అరటి1కి 8-00/7-00, చిక్కుళ్లు నాటు 44-00, చిక్కుళ్లు హైబ్రిడ్ 28-00, చామదుంప 25-00, మునగ పెద్దది/ చిన్నది 6-00/5-00, ఆకుకూరలు 2-00, కంద కేజీ 24-00, బీట్‌రూట్ 26-00, కాప్సికం 45-00, కీర దోస 20-00, ఫ్రెంచ్ బీన్స్ 52-00, ఆ కాకర-98, పెండలం- 20, నిమ్మకాయలు డజను 16-00/14-00, బొప్పాయి 22-00, కొత్తిమీర కట్ట 12-00/6-00, పొదీన 3-00/ 7-00, ముల్లంగిదుంప (ఒకటికి)8-00

గరుడ, ఇంద్ర బస్సు రిజర్వేషన్



విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ నుంచి దూర ప్రాంతాలకు వెళ్లు ఆర్టీసీ సర్వీసులు

సర్వీసు	సమయం	బస్సు	30	31	01	02
35105	ఉ.04.30	(మియాపూర్,గ)	42	42	46	43
3565	ఉ.05.30	(మియాపూర్,గ)	45	44	42	47
3567	ఉ.06.30	(మియాపూర్,గ+)	40	40	47	47
3581	ఉ.07.30	(బీహెచ్ఈఎల్,గ)	44	42	47	47
3657	ఉ.10.30	(మియాపూర్,గ)	41	39	47	47
3858	ఉ.11.30	(ఆర్‌జీఐఎ-గరుడ)	36	23	29	31
3559	మ.13.00	(ఏఎస్‌రావు,గ)	39	37	35	39
3571	మ.13.30	(బీహెచ్ఈఎల్)	42	45	46	47
35117	మ.14.15	(ఆర్‌జీఐఏ,గ)	39	39	39	39
3583	మ.14.30	(మియాపూర్,గ+)	42	45	46	47
3886	మ.15.00	(ఆర్‌జీఐఎపి,గ)	23	28	25	32
3573	మ.15.30	(మియాపూర్,గ+)	46	45	42	47
3585	సా.4.30	(మియాపూర్,గ)	43	42	42	47
35133	సా.5.00	(మియాపూర్,గ)	44	46	45	46
35135	సా.05.30	(మియాపూర్,గ)	47	43	38	47
35085	సా.06.30	(మియాపూర్,గ)	47	44	41	47
35189	రా.9.00	(ఆర్‌జీఐ,గ)	29	38	38	35
35155	రా.10.00	(మియాపూర్,గ)	22	22	22	22
35179	రా.10.00	(ఆర్‌జీఐ, ఏపీ,వె)	08	11	13	05
3938	రా.10.00	(మధురవాడ,గ)	37	38	38	39
9377	రా.11.15	(మియాపూర్,గ)	33	37	39	39
3575	రా.10.15	(మియాపూర్,ఏసీ)	46	44	43	45
3599	రా.10.45	(మియాపూర్,గ)	46	44	46	46
3633	రా.10.30	(మియాపూర్,గ+)	43	46	45	47
3579	రా.10.45	(ఏఎస్‌రావు, గ)	38	35	38	39
3838	రా.11.00	(మియాపూర్,గ+)	46	43	46	46
3569	రా.11.15	(మియాపూర్,గ)	37	38	38	39
3545	రా.11.30	(బీహెచ్ఈఎల్)	46	42	47	48
3872	సా.5.00	(బెంగళూర్, గ)	29	33	28	34
3874	సా.6.00	(బెంగళూర్, గ)	33	33	34	32
35115	రా.8.30	(వీజేఏ-సీఎన్ఐ,గ)	27	34	37	30
3918	రా.9.30	(వీజేఏ-సీఎన్ఐ, గ)	33	35	36	33
3876	రా.8.00	(కుప్పం, గ)	34	36	34	36
47140	రా.10.00	(తిరుపతి,ఏసీ)	42	45	39	45
47138	రా.10.30	(తిరుపతి,ఏసీ)	43	41	35	45
35103	రా.10.30	(విశాఖ, ఇంద్ర)	38	38	38	35
6058	రా.9.45	(కడప ఇంద్ర)	35	34	34	37
6727	రా.6.15	(విజయ-ఏటీపీ)	31	32	21	32

వివరాలకు ఫోన్ : 0866- 2523928లో సంప్రదించవచ్చు

తెలుగును మాతృభాషగా భావించాలి



విద్యార్థినికి బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

గుణదల: తెలుగు భాషను మాతృభాషగా భావించాలని అమరావతి సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. నిడమానూరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో మాతృభాషా దినోత్సవ వేడుక మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అమరావతి సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి హాజరై మాట్లాడుతూగిడుగు రామ్మూర్తి వ్యవహార భాషలో ఎంతో కృషి చేశారని చెప్పారు. అందుకే ఆయన పుట్టిన రోజున తెలుగు భాషాదినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. గిడుగు అంటే ఎండ నుంచి రక్షించేదని వివరించారు. పంచెకట్టు, ఓణీలవంటి సంప్రదాయ దుస్తులతో వచ్చిన బాలబాలికలను సత్కరించారు. వ్యాసరచన, వక్తృత పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏపీ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, జానపద గాయకులు దామోదర గణపతిరావు, పాఠశాల ప్రోవైస్ చైర్మన్ పి.నరేంద్రబాబు, డైరెక్టర్ పి.పవన్‌చంద్, డీన్.ఎస్.బి.రావు, ప్రిన్సిపాల్ జి.మాలా పాల్గొన్నారు.

చెస్ పోటీలకు సీఎంకు ఆహ్వానం



సీఎంకు ఆహ్వానపత్రాన్ని అందజేస్తున్న ఏపీ చెస్ అసోసియేషన్ సభ్యులు

విజయవాడ సెంట్రల్: ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసి యేషన్ సభ్యులు మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబును సచివాలయంలో కలిశారు.

సెప్టెంబర్ మూడవ తేదీ నుంచి 12 వరకు విజయవాడ అమ్మ కళ్యాణ మంటపంలో జరగనున్న 31వ జాతీయ ఓపెన్ అండర్-7 పోటీలను ప్రారంభించేందుకు రావాలని అసోసియేషన్ నేతలు ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఆంధ్రప్రదేశ్ చదరంగ సమాఖ్య ఉపాధ్యక్షులు వై. ప్రవీణ్, కార్యదర్శి డి. శ్రీహరి, చదరంగ శిక్షకులు ఖాసీం తదితరులు ఉన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

మంత్రి డాక్టర్ కామినేని

వన్‌టౌన్: ఆయా సీజనల్ వ్యాధుల పట్ల అవగాహనతో పాటుగా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాసరావు అన్నారు. కొత్తపేటలోని కేబీఎన్ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) విభాగాల ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన, వ్యాధులు రాకుండా ఉండేందుకు హోమియో మందుల పంపిణీ కార్యక్రమం ఆ కళాశాల ఆవరణలో మంగళవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కామినేని మాట్లాడుతూ వ్యాధులు రాకుండా ముందుగా జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యమన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలను అవగాహన పరిచేందుకు ప్రభుత్వ పరంగా పలు కార్యక్రమాలను చేపట్టినట్లు వివరించారు. ప్రభుత్వంతో పాటుగా కేబీఎన్ కళాశాల వంటి సంస్థలు ఈ విధమైన కార్యక్రమాలను నిర్వహించటం అభినందనీయమన్నారు. కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పల సాంబశివరావు, ఎస్.రజిత్‌కుమార్‌లు మాట్లాడుతూ ప్రతి ఏటా సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించే కార్యక్రమాన్ని కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. హోమియో మందులను విద్యార్థులతో పాటు వారి కుటుంబ సభ్యులకు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు, 39వ డివిజన్ కార్పొరేటర్ ఉత్తమ్ చంద్ భండారీ, బీజేపీ నాయకులు ఎ.శ్రీరామ్, షియాష్‌కుమార్, కళాశాల అధ్యాపకులు సిహెచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి హోమియో మందులు వేస్తున్న మంత్రి కామినేని శ్రీనివాసరావు

మల్టీప్లెక్స్‌లో మంచినీటి సీసాలు అనుమతించాలి

● ట్రెండ్‌సెట్‌లో ప్రజా ఫిర్యాదుల కమిటీ తనిఖీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

నగరంలోని మల్టీప్లెక్స్ థియేటర్లలో తాగునీటి సరఫరా విధానంపై కార్పొరేషన్ ప్రజా ఫిర్యాదుల ప్రత్యేక కమిటీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిశుభ్రమైన తాగునీటిని అందించడంతోపాటు హాల్లో వ్యక్తిగతంగా వాటర్ బాటిళ్లు బయటి నుంచి తెచ్చుకునేందుకు అవకాశం కల్పించాలని థియేటర్ల యాజమాన్యానికి సూచించారు. బెంజ్‌సర్కిల్ సమీపంలోని ట్రెండ్‌సెట్ థియేటర్లో ప్రజా ఫిర్యాదుల కమిటీ చైర్మన్ గుర్రం కనకదుర్గ సభ్యులతో కలిసి మంగళవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విక్రయశాలలో నాణ్యతలేని తినుబండారాలు, సామాన్యులకు అందుబాటులో లేని ధరలతో విక్రయాలు తదితర అంశాలను సభ్యులు పరిశీలించిన నేపథ్యంలో అసంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం నగరంలోని పలు థియేటర్లపై ప్రత్యేక తనిఖీ చేశారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ థియేటర్లలో తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. వెంట తెచ్చుకున్న బాటిల్స్‌కు అభ్యంతరాలు వ్యక్తం చేస్తే తక్షణమే ప్రజా ఫిర్యాదుల కమిటీకి ఫిర్యాదు చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సుకాశి సరిత, హెల్త్ ఆఫీసర్ డా.రామకోటేశ్వర్రావు పాల్గొన్నారు.



నిర్వాహకులతో మాట్లాడుతున్న కమిటీ సభ్యులు, వీఎంసీ అధికారులు

'భిన్న పరీక్ష' నుంచి కచ్చితంగా ప్రశ్నలు

భిన్న పరీక్ష

ప్రస్తుత పోటీ పరీక్షల్లో భిన్న పరీక్ష విభాగానికి సంబంధించిన ప్రశ్నలు రెండు లేదా మూడు తప్పనిసరిగా ఉంటున్నాయి. ఎస్‌ఐ తదితర పరీక్షల్లో ఈ విభాగం నుంచి 8 లేదా 10 ప్రశ్నలు కచ్చితంగా వస్తున్నాయి. కాబట్టి రీజనింగ్‌లో ఈ టాపిక్ చాలా ముఖ్యమైంది. ఈ టాపిక్‌కు సంబంధించిన ప్రశ్నల్లో నాలుగు లేదా ఐదు పదాలు/ పదాల జతలు / సంఖ్యలు/ వర్ణమాల అక్షరాల సమూహాలను ఇస్తారు. ప్రశ్న & సమాధానాలుగా ఇచ్చే ఎ, బి, సి, డిల్లో ఒకటి మినహా మిగిలినవన్నీ ఒకే లక్షణంతో ఉంటాయి. ఆ విధంగా భిన్నంగా ఉండే పదం/ పదాల జత/ సంఖ్య/ వర్ణమాల అక్షరాల సమూహాన్ని సమాధానంగా గుర్తించాలి. అంటే ఇచ్చిన ఎ, బి, సి, డిల్లో భిన్నంగా ఉన్న దానిని తొలగించాలి.

ఈ విభాగంలో మూడు మోడల్స్ ఉన్నాయి. అవి..

1. పదాలతో భిన్న పరీక్ష
2. భిన్నమైన సంఖ్యను కనుక్కోవడం
3. భిన్నమైన వర్ణమాల అక్షరాల సమూహాన్ని గుర్తించడం

మోడల్ - 1
పదాలతో భిన్న పరీక్ష

ఇందులో రెండు రకాలు ఉన్నాయి. అవి..

టైప్ 1: నాలుగు పదాలు ఇచ్చి భిన్నమైన దానిని సమాధానంగా గుర్తించమని అడుగుతారు.

టైప్ 2: నాలుగు పదాల జతలను ఇచ్చి భిన్నమైన జతను సమాధానంగా గుర్తించమని అడుగుతారు.

టైప్ 1

1. ఎ) భరతనాట్యం బి) కూచిపూడి సి) భాంగ్రా డి) యక్షగానం
సమాధానం: సి
వివరణ: భాంగ్రా మినహా మిగిలినవన్నీ శాస్త్రీయ నృత్యాలు. భాంగ్రా జానపద నృత్యం.

2. ఎ) అక్టోబరు బి) నవంబరు సి) డిసెంబరు డి) జనవరి
సమాధానం: బి
వివరణ: నవంబరు మినహా మిగిలిన నెలలకు నెలకు రోజులు 31. కానీ, నవంబరు నెలలో 30 రోజులు మాత్రమే ఉంటాయి.

3. ఎ) ముఖ్యమంత్రి బి) లోక్‌సభ సభ్యుడు సి) రాజ్యసభ సభ్యుడు డి) ప్రధానమంత్రి
సమాధానం: ఎ
వివరణ: ముఖ్యమంత్రి మినహా మిగిలిన వ్యక్తులు కేంద్ర ప్రభుత్వానికి చెందిన వారు.

4. ఎ) కోహిమా బి) ఇంఫాల్ సి) అగర్తల డి) పట్నా
సమాధానం: డి
వివరణ: పట్నా మినహా మిగిలినవన్నీ వివిధ ఈశాన్య రాష్ట్రాల రాజధానులు

5. ఎ) పెల్లాగ్రా బి) బెరిబెరి సి) ఎనీమియా డి) గాయిటర్
సమాధానం: డి
వివరణ: గాయిటర్ మినహా మిగిలినవన్నీ విటమిన్ లోపంతో వస్తాయి. కానీ, గాయిటర్ వ్యాధి మాత్రం అయోడిన్ లోపంతో వస్తుంది.

6. ఎ) బ్యాడ్మింటన్ బి) చెస్ సి) క్యారమ్స్ డి) బిలియర్డ్స్
సమాధానం: ఎ
వివరణ: బ్యాడ్మింటన్ తప్ప మిగిలినవి ఇండోర్ గేమ్స్

7. ఎ) మే బి) జూన్ సి) జూలై డి) ఆగస్టు
సమాధానం: బి
వివరణ: జూన్ మినహా మిగిలిన అన్ని నెలలకు నెలకు 31 రోజులు ఉంటాయి.

8. ఎ) నైల్ బి) ఓల్గా సి) నయాగరా డి) అమెజాన్
సమాధానం: సి
వివరణ: నయాగరా మినహా మిగిలినవన్నీ నదుల పేర్లు. నయాగరా అనేది జలపాతం.

9. ఎ) గుండె బి) నేత్రం సి) చెవి డి) కాలు
సమాధానం: ఎ
వివరణ: గుండె తప్ప మిగిలినవి జతగా ఉంటాయి.

10. ఎ) నియాసిన్ బి) ట్రిప్సిన్ సి) థయామిన్ డి) రైబోఫ్లేవిన్
సమాధానం: ఎ



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

వివరణ: ట్రిప్సిన్ మినహా మిగిలినవన్నీ విటమిన్ పేర్లు. ట్రిప్సిన్ అనేది ఎంజైమ్.

11. ఎ) బంతి బి) చేమంతి సి) తామర డి) గులాబి
సమాధానం: సి
వివరణ: తామర మినహా మిగిలిన పువ్వులన్నీ భూమి మీద పెరుగుతాయి. తామర నీటిలో పెరుగుతుంది.

12. ఎ) పోలెండ్ బి) గ్రీస్ సి) స్పెయిన్ డి) కొరియా
సమాధానం: డి
వివరణ: కొరియా మినహా మిగిలిన దేశాలు యూరప్ ఖండంలోనివి. కానీ, కొరియా ఆసియా ఖండానికి సంబంధించిన దేశం.

13. ఎ) చెన్నై బి) హైదరాబాద్ సి) బెంగళూరు డి) లక్నో
సమాధానం: డి
వివరణ: లక్నో మినహా మిగిలినవన్నీ వివిధ దక్షిణ భారత రాష్ట్రాల రాజధానులు. లక్నో మాత్రం ఉత్తర భారతంలోని రాష్ట్రానికి సంబంధించిన రాజధాని.

14. ఎ) కివి బి) గద్ద సి) పెంగ్విన్ డి) ఆస్ట్రిచ్
సమాధానం: బి
వివరణ: గద్ద మినహా మిగిలిన పక్షులు ఎగరలేనివి. గద్ద ఎగిరే పక్షి.

15. ఎ) గోధుమ బి) ఆవాలు సి) వేరుశనగ డి) వరి
సమాధానం: డి
వివరణ: వరి మినహా మిగిలినవన్నీ రబీ పంటలు. వరి ఖరీఫ్ పంట

16. ఎ) బైకాల్ బి) ధాల్ సి) చిలక డి) థార్
సమాధానం: డి
వివరణ: థార్ మినహా మిగిలినవన్నీ వివిధ సరస్సుల పేర్లు. థార్ అనేది ఎడారి.

17. ఎ) కోణార్క్ బి) మధురై సి) ఎల్లోరా డి) దిల్వారా
సమాధానం: సి
వివరణ: ఎల్లోరా మినహా మిగిలినవన్నీ ప్రసిద్ధ దేవాలయాలు ఉన్న ప్రదేశాలు. ఎల్లోరా ప్రసిద్ధ గుహలు ఉన్న ప్రదేశం

18. ఎ) ఋగ్వేదం బి) ఆయుర్వేదం సి) సామవేదం డి) యజుర్వేదం
సమాధానం: బి
వివరణ: ఆయుర్వేదం మినహా మిగిలినవి వేదాలు. ఆయుర్వేదం అనేది వైద్య శాస్త్రం.

19. ఎ) గ్రానైట్ బి) లిగ్నైట్ సి) ఆంత్రసైట్ డి) బిటూమినస్
సమాధానం: ఎ
వివరణ: గ్రానైట్ మినహా మిగిలినవి బొగ్గు రూపాంతరాలు. గ్రానైట్ అనేది విలువైన రాయి.

20. ఎ) సంతాల్స్ బి) ఖోండ్స్ సి) అబోర్స్ డి) డోగ్రి
సమాధానం: డి
వివరణ: డోగ్రి మినహా మిగిలినవన్నీ వివిధ గిరిజన జాతులు. డోగ్రి అనేది ఒక భాష.

21. ఎ) కాలువ బి) వంతెన సి) ప్రవాహం డి) సెలయేరు
సమాధానం: బి
వివరణ: వంతెన మినహా మిగిలినవి నీటితో ఉంటాయి.

22. ఎ) నేపాల్ బి) టోక్యో సి) కాబూల్ డి) బీజింగ్
సమాధానం: ఎ
వివరణ: నేపాల్ మినహా మిగిలినవి వివిధ దేశాల రాజధానులు. నేపాల్ అనేది ఒక దేశం.

23. ఎ) మహావీరుడు బి) గౌతమబుద్ధుడు సి) మహాత్మాగాంధీ డి) గురునానక్
సమాధానం: సి
వివరణ: మహాత్మాగాంధీ మినహా మిగిలిన వారు ప్రసిద్ధ మతాల స్థాపకులు.

24. ఎ) రాజీవ్‌గాంధీ బి) జవహర్‌లాల్ నెహ్రూ సి) చరణ్ సింగ్ డి) బాబూ రాజేంద్రప్రసాద్
సమాధానం: డి
వివరణ: బాబూ రాజేంద్రప్రసాద్ మినహా మిగిలినవారు ప్రధానమంత్రులు. బాబూ రాజేంద్రప్రసాద్ రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహించారు.

25. ఎ) పాదరసం బి) ఆక్సిజన్ సి) మెగ్నీషియం డి) సోడియం
సమాధానం: ఎ
వివరణ: నాలుగూ మూలకాలే. కానీ, పాదరసం ద్రవరూప మూలకం.

26. ఎ) కలం బి) నల్లబల్ల సి) కాగితం డి) పలక
సమాధానం: ఎ
వివరణ: కలం మినహా మిగిలిన వాటిపై వివిధ వస్తువులతో రాయవచ్చు. కలం మాత్రం రాయడానికి ఉపయోగించేది.

27. ఎ) గారో బి) ఖాశీ సి) కాంగ్రా డి) జైంతియా
సమాధానం: సి
వివరణ: కాంగ్రా మినహా మిగిలినవి కొండలు. కాని, కాంగ్రా లోయ.

28. ఎ) జూన్ బి) సెప్టెంబరు సి) నవంబరు డి) ఆగస్టు
సమాధానం: డి
వివరణ: ఆగస్టు మినహా మిగిలిన నెలలకు నెలకు 30 రోజులు ఉంటాయి. ఆగస్టు నెలకు మాత్రం 31 రోజులు ఉంటాయి.

29. ఎ) మార్చి బి) జూలై సి) ఆగస్టు డి) మే
సమాధానం: సి
వివరణ: అన్ని నెలలకు 31 రోజులు ఉన్నాయి. మార్చి 3వ నెల, జూలై 7వ నెల, మే 5వ నెల అంటే మార్చి, మే, జూలై బేసి నెలలు. ఆగస్టు అనేది 8వ నెల అంటే సరి సంఖ్యకు సంబంధించిన నెల.

30. ఎ) నారింజ బి) పసుపు సి) ఆకుపచ్చ డి) గులాబి
సమాధానం: డి
వివరణ: గులాబీ మినహా మిగిలినవి ఇంద్రధనస్సు రంగుల్లో ఉంటాయి.

31. ఎ) న్యూటన్ బి) మార్కోని సి) బీతొవన్ డి) ఫారడే
సమాధానం: సి
వివరణ: బీతొవన్ మినహా మిగిలిన వ్యక్తులు శాస్త్రవేత్తలు.

32. ఎ) క్యారట్ బి) అల్లం సి) బీట్‌రూట్ డి) ఆనపకాయ
సమాధానం: డి
వివరణ: ఆనపకాయ మినహా మిగిలిన కూరగాయలు భూమి నుంచి వస్తాయి.

33. ఎ) గుండె బి) చెవి సి) ముక్కు డి) నేత్రాలు
సమాధానం: ఎ
వివరణ: గుండె మినహా మిగిలినవి జ్ఞానేంద్రియాలు.

34. ఎ) బిందుసారుడు బి) బింబిసారుడు సి) అశోకుడు డి) సంప్రాప్తి
సమాధానం: బి
వివరణ: బింబిసారుడు మినహా మిగిలిన వ్యక్తులు మౌర్య వంశానికి చెందిన వారు. బింబిసారుడు హర్యంక వంశానికి చెందిన వ్యక్తి.

35. ఎ) దాద్రానగర్ హవేలీ బి) అండమాన్ నికోబార్ దీవులు సి) పాండిచ్చేరి డి) జార్ఖండ్
సమాధానం: డి
వివరణ: జార్ఖండ్ మినహా మిగిలినవి కేంద్ర పాలిత ప్రాంతాలు. జార్ఖండ్ అనేది రాష్ట్రం పేరు.

36. ఎ) బుల్లి బి) కార్నర్ సి) బంకర్ డి) డ్రిబుల్
సమాధానం: సి
వివరణ: బంకర్ మినహా మిగిలిన పదాలు హాకీ క్రీడకు సంబంధించినవి.

37. ఎ) బీర్బల్ బి) ఫైజ్ అహ్మద్ సి) అబుల్ ఫజల్ డి) తాన్‌సేన్
సమాధానం: బి
వివరణ: ఫైజ్ అహ్మద్ మినహా మిగిలిన వ్యక్తులు అక్బరు ఆస్థానానికి చెందిన వారు.

38. ఎ) ఆసియా బి) అర్జెంటీనా సి) ఆఫ్రికా డి) ఆస్ట్రేలియా
సమాధానం: బి
వివరణ: అర్జెంటీనా మినహా మిగిలినవి ఖండాల పేర్లు

39. ఎ) మెరీనా బి) జెర్సొప్పా సి) విక్టోరియా డి) ఏంజెల్
సమాధానం: ఎ
వివరణ: మెరీనా మినహా మిగిలినవి జలపాతాలు. మెరీనా అనేది ఒక బీచ్.

JOBS ఉద్యోగాలు

సిడాక్

నొయిడాలోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సిడాక్)- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

మొత్తం ఖాళీలు: 67

ప్రాజెక్ట్ మేనేజర్ ఖాళీలు: 2
అర్హత: బిఇ/ బిటెక్/ ఎంఇ/ ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్)/ ఎంసిఏ ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీతో పదకొండేళ్లు/ పీజీతో ఏడేళ్ల అనుభవం ఉండాలి
వయసు: 50 ఏళ్లు మించరాదు

ప్రాజెక్ట్ ఇంజనీర్ ఖాళీలు: 65
అర్హత: బిఇ/ బిటెక్/ ఎంఇ/ ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్)/ ఎంసిఏ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం మూడు నుంచి ఏడేళ్ల అనుభవం ఉండాలి
వయసు: 37 ఏళ్లు మించరాదు
ఎంపిక: ఆన్‌లైన్ టెస్ట్/ ఇంటర్వ్యూ ద్వారా
ఆన్‌లైన్ టెస్ట్: సెప్టెంబరు 23
దరఖాస్తు ఫీజు: రూ.500
ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొన్న తరవాత ఆ హార్డు కాపీని నిర్దేశిత చిరునామాకు పంపాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 18
చిరునామా: Section in Charge(HR - II), Ce ntre for Development of Advanced Comp uting(CDAC), Academic Block, B - 30, Institutional Area, Sector - 62, Noida - 201307
వెబ్‌సైట్: http://cdac.in/

ఎస్ఎస్‌సి ఎస్ఆర్

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ సదరన్ రీజియన్ (ఎస్ఎస్‌సి ఎస్ఆర్) - కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 66

టెక్నికల్ సూపరింటెండెంట్ ఖాళీలు: 3
అర్హత: డిప్లొమా (హ్యాండ్లూమ్ టెక్నాలజీ/ టెక్స్‌టైల్ టెక్నాలజీ) పూర్తిచేసి ఉండాలి.
వయసు: 30 ఏళ్లు మించరాదు.

వర్క్‌షాప్ సూపరింటెండెంట్ ఖాళీలు: 1
అర్హత: బిఇ/ బిటెక్ (మెకానికల్) ఉత్తీర్ణులై ఉండాలి
వయసు: 30 ఏళ్లు మించరాదు.

సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ (వీవింగ్) ఖాళీలు: 1
అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ (టెక్స్‌టైల్ టెక్నాలజీ/ టెక్స్‌టైల్ ఇంజ నీరింగ్)/ డిప్లొమా(హ్యాండ్లూమ్ టెక్నాలజీ/ టెక్స్ టైల్ టెక్నాలజీ/ హ్యాండ్లూమ్ & టెక్స్‌టైల్ టెక్నాలజీ) ఉత్తీర్ణతతోపాటు అనుభవం కూడా ఉండాలి
వయసు: 30 ఏళ్లు మించరాదు.

మెడికల్ అటెండెంట్ ఖాళీలు: 34
అర్హత: 10వ తరగతి
వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

లేడీ మెడికల్ అటెండెంట్ ఖాళీలు: 15
అర్హత: 10వ తరగతితోపాటు ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్ ఉండాలి.
వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

కన్జర్వేషన్ అసిస్టెంట్ ఖాళీలు: 2
అర్హత: 10వ తరగతితోపాటు డిప్లొమా(సివిల్) పూర్తిచేసి ఉండాలి.
వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

జూనియర్ కన్జర్వేషన్ అసిస్టెంట్ ఖాళీలు: 9
అర్హత: 10వ తరగతితోపాటు ఐటిఐ సర్టిఫికెట్ (సివిల్ ఇంజనీరింగ్) ఉండాలి
వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

ఎవల్యూషన్ అసిస్టెంట్ ఖాళీలు: 1
అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ (స్టాటిస్టిక్స్/ మేథమెటిక్స్/ ఎకనామిక్స్/ సోషియాలజీ/ సోషల్ వర్క్) ఉత్తీర్ణులై ఉండాలి
వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి
ఎంపిక: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 24
దరఖాస్తు హార్డు కాపీ పంపేందుకు చివరి తేదీ: అక్టోబరు 4
వెబ్‌సైట్: www.sscsr.gov.in

రాష్ట్రపతి తొలగింపు ప్రక్రియను ఏమంటారు?

భారత రాష్ట్రపతి

1. భారతదేశ రాజ్యాంగ అధినేత అయిన రాష్ట్రపతి గురించి రాజ్యాంగంలోని ఏ భాగంలో పొందుపరిచారు?
ఎ) మూడో భాగం 12 - 35 ఆర్టికల్
బి) నాలుగో భాగం 36 - 51 ఆర్టికల్
సి) ఐదో భాగం 52 - 62 ఆర్టికల్
డి) ఆరో భాగం 152 - 161 ఆర్టికల్

2. భారతదేశ ప్రథమ పౌరుడు అని ఎవర్ని అంటారు?
ఎ) రాష్ట్రపతి బి) అటార్నీ జనరల్ సి) గవర్నర్
డి) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి

3. భారతదేశానికి ఒక రాష్ట్రపతి ఉంటాడు అని తెలిపే ఆర్టికల్?
ఎ) 52వ బి) 53వ సి) 54వ డి) 55వ

4. భారత రాజ్యాంగాన్ని, చట్టాలను సంరక్షించే బాధ్యత ఎవరికి కల్పించారు?
ఎ) పార్లమెంట్ బి) సుప్రీం కోర్టు
సి) ప్రధానమంత్రి డి) రాష్ట్రపతి

5. భారతదేశ సర్వసైన్యాధ్యక్షుడు ఎవరు?
ఎ) రాష్ట్రపతి బి) ప్రధానమంత్రి
సి) సైనిక దళాధిపతి డి) పైవారందరూ

6. కేంద్ర ప్రభుత్వంలో అన్ని కార్యనిర్వాహక సంబంధ, ఒప్పందాలు ఎవరి పేరు మీద జరుగుతాయి?
ఎ) ప్రధానమంత్రి బి) కేంద్ర కేబినెట్
సి) రాష్ట్రపతి డి) కేంద్ర శాసనసభ

7. భారత రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వ అధినేత ఎవరు?
ఎ) రాష్ట్రపతి బి) ప్రధానమంత్రి
సి) కేంద్ర మంత్రిమండలి డి) పైవారందరూ

8. రాష్ట్రపతిని ఎవరు ఎన్నుకొంటారు?
ఎ) పార్లమెంట్‌కు ఎన్నికైన ఉభయసభ సభ్యులు
బి) ఎలక్ట్రోరల్ కాలేజ్ సభ్యులు
సి) రాష్ట్ర శాసనసభ సభ్యులు మాత్రమే
డి) పైవారందరూ

9. రాష్ట్రపతి ఎన్నిక, ఎన్నిక విధానాన్ని ఏ దేశ రాజ్యాంగం నుంచి స్వీకరించారు?
ఎ) బ్రిటన్ బి) అమెరికా
సి) ఐర్లాండ్ డి) రష్యా

10. రాష్ట్రపతి ఎన్నిక విధానాలను రాజ్యాంగ పరిషత్తులో ప్రతిపాదించిన వారు?
ఎ) డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్
బి) గోపాలస్వామి అయ్యంగార్
సి) బి.ఎన్.రావు డి) కె.ఎం.మున్షీ

11. భారత రాష్ట్రపతిని ఏ దేశ రాజు లేదా రాణితో పోలుస్తారు?
ఎ) బ్రిటన్ బి) నేపాల్ సి) భూటాన్ డి) ఫ్రాన్స్

12. రాష్ట్రపతి ఎన్నిక విధానం గురించి రాజ్యాంగంలోని ఏ అధికరణం తెలుపుతుంది?
ఎ) 52వ బి) 53వ సి) 54వ డి) 55వ

13. రాష్ట్రపతి ఎవరి ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేస్తారు?
ఎ) ఉపరాష్ట్రపతి బి) లోక్‌సభ స్పీకర్
సి) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
డి) ఎవరూ కాదు

14. రాష్ట్రపతి పదవికి పోటీ చేసే వ్యక్తి కనీస వయసు?
ఎ) 30 ఏళ్లు నిండి ఉండాలి
బి) 31 ఏళ్లు నిండి ఉండాలి
సి) 33 ఏళ్లు నిండి ఉండాలి
డి) 35 ఏళ్లు నిండి ఉండాలి

15. రాజ్యాంగంలో ఏ రాజ్యాంగ సవరణ ద్వారా ఢిల్లీ, పాండిచ్చేరి (కేంద్ర పాలిత ప్రాంతాలు) రాష్ట్రపతి ఎన్నికల్లో పాలుపంచుకొంటున్నాయి?
ఎ) 1992, 70వ రాజ్యాంగ సవరణ
బి) 1992, 73వ రాజ్యాంగ సవరణ
సి) 1992, 74వ రాజ్యాంగ సవరణ
డి) 1976, 42వ రాజ్యాంగ సవరణ

16. షెడ్యూల్డ్ కులాలను నిర్ణయించే అధికారం ఎవరికి ఉంటుంది?
ఎ) పార్లమెంట్ బి) రాష్ట్రపతి
సి) జాతీయ ఎస్సీ కమిషన్
డి) కేంద్రమంత్రి మండలి

17. పార్లమెంట్ సభ్యుల సభ్యత్వాన్ని రద్దు చేసే అధికారం ఎవరికి ఉంటుంది?
ఎ) కేంద్ర ఎన్నికల సంఘం
బి) సభాధ్యక్షుడు
సి) రాష్ట్రపతి డి) సుప్రీం కోర్టు

18. రాష్ట్రపతి పదవీకాలం?
ఎ) నాలుగు సంవత్సరాలు
బి) ఐదు సంవత్సరాలు
సి) ఆరు సంవత్సరాలు డి) ఏదీకాదు

19. రాష్ట్రపతి ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా ఎవరు వ్యవహరిస్తారు?
ఎ) ఎన్నికల అధికారి బి) కలెక్టర్
సి) లోక్‌సభ సెక్రటరీ జనరల్ డి) లోక్‌సభ స్పీకర్

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ





కొమ్ము సుందర్‌రాజు
పొలిటీ ఫ్యాకల్టీ

20. రాష్ట్రపతి ఎన్నికల్లో పాల్గొనని సభ్యులు?
ఎ) లోక్‌సభకు నామినేట్ అయ్యే ఇద్దరు ఆంగ్లో ఇండియన్లు
బి) రాజ్యసభలోని 12 మంది నామినేటెడ్ సభ్యులు
సి) రాష్ట్ర శాసనమండలి (విధానపరిషత్తు) సభ్యులందరూ
డి) పైవారందరూ

21. లోక్‌సభలో ఏ పార్టీకి, ఏ కూటమికి స్పష్టమైన మెజారిటీ లేనప్పుడు ప్రధాని నియామకంలో రాష్ట్రపతి ఏ అధికారాలు కలిగి ఉంటాడు?
ఎ) విచక్షణాధికారాలు బి) కార్యనిర్వహణాధికారాలు
సి) న్యాయాధికారాలు డి) అత్యవసరాధికారాలు

22. రాష్ట్రపతికి తన అధికార-విధుల నిర్వహణలో సహాయ, సలహాలు అందించడానికి ప్రధాని నేతృత్వంలో ఒక మంత్రి మండలి ఉంటుంది అని తెలిపే అధికరణం?
ఎ) 72వ బి) 73వ సి) 74వ డి) 75వ

23. 1979లో ప్రధాని మొరార్జీదేశాయ్ (జనతా పార్టీ) రాజీనామా చేశారు. అప్పటి లోక్‌సభలో ఏ పార్టీకి మెజారిటీ లేదు. అయితే నాటి రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి తన విచక్షణాధికారంతో ఎవర్ని ప్రధానిగా నియమించారు?
ఎ) చరణ్‌సింగ్ బి) వి.పి.సింగ్
సి) చంద్రశేఖర్ డి) పి.వి.నరసింహారావు

24. రాష్ట్రపతి నివాసమైన రాష్ట్రపతి భవన్ రూపశిల్పులు?
ఎ) హెర్బర్ట్ బెకర్, ఎడ్విన్ లుటియన్స్
బి) కర్జన్, వెవేల్ సి) క్రిప్స్ లుటియన్స్
డి) పైవారందరూ

25. రాష్ట్రపతి పదవి ఖాళీ ఏర్పడితే ఎన్ని నెలల్లో ఎన్నికలు నిర్వహించాలి?
ఎ) నెలలోపు బి) 15 రోజుల్లోపు
సి) ఆరు నెలల్లోపు డి) ఆరు నెలల తరవాత

26. రాష్ట్రపతి ఎన్నికల ఫిర్యాదులు విచారించే అధికారాన్ని పార్లమెంట్ నుంచి సుప్రీం కోర్టుకు ఏ రాజ్యాంగ సవరణ ద్వారా కల్పించారు?
ఎ) 1975, 39వ రాజ్యాంగ సవరణ
బి) 1978, 44వ రాజ్యాంగ సవరణ
సి) 1976, 42వ రాజ్యాంగ సవరణ
డి) 2002, 86వ రాజ్యాంగ సవరణ

27. రాష్ట్రపతి తొలగింపు ప్రక్రియను ఏమంటారు?
ఎ) మహాభియోగ తీర్మానం బి) అభిశంసన తీర్మానం
సి) విశ్వాస తీర్మానం డి) అవిశ్వాస తీర్మానం

28. మహాభియోగ తీర్మానాన్ని ఏ దేశ రాజ్యాంగం నుంచి స్వీకరించారు?
ఎ) ఐర్లాండ్ బి) బ్రిటన్
సి) ఆస్ట్రేలియా డి) అమెరికా

29. రాష్ట్రపతి తొలగింపు ప్రక్రియను తెలిపే అధికరణం?
ఎ) 58వ బి) 59వ సి) 60వ డి) 61వ

30. ఉపరాష్ట్రపతులుగా పనిచేసి రాష్ట్రపతులుగా ఎన్నికైన వారిని వరుస క్రమంలో గుర్తించండి?
1. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 2. జాకీర్ హుస్సేన్ 3. వి.వి.గిరి 4. ఆర్.వెంకట్రామన్ 5. శంకర్ దయాళ్‌శర్మ 6. కె.ఆర్.నారాయణన్
ఎ) 1, 2, 3, 4, 5, 6 బి) 1, 2, 3, 5, 4, 6
సి) 1, 2, 3, 4, 6, 5 డి) 1, 2, 5, 6, 3, 4

31. ఏ అధికరణం ప్రకారం రాష్ట్రపతి లోక్‌సభకు ఇద్దరు ఆంగ్లో ఇండియన్స్‌ను నామినేట్ చేస్తాడు?
ఎ) 155వ బి) 124వ సి) 331వ డి) 333వ

32. 80(3) అధికరణం ప్రకారం రాజ్యసభకు ఎంత మంది విశిష్ట సభ్యులను రాష్ట్రపతి నామినేట్ చేస్తాడు?
ఎ) ఇద్దరు బి) 12 మంది సి) ఒకరు డి) 15 మంది

33. ఉపరాష్ట్రపతిగా పని చేసి రాష్ట్రపతి ఎన్నికల్లో ఓడిపోయిన తొలి వ్యక్తి?
ఎ) నీలం సంజీవరెడ్డి బి) వి.వి.గిరి
సి) భైరాన్‌సింగ్ షెకావత్ డి) ఎవరూకాదు

34. భారతదేశంలో యుద్ధం, దురాక్రమణలు సంభవించినప్పుడు రాష్ట్రపతి జాతీయ అత్యవసర పరిస్థితిని ఏ అధికరణం ద్వారా అమలు చేస్తాడు?
ఎ) 352వ బి) 356వ సి) 366వ డి) 360వ

35. తొలిసారిగా ఏ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించారు?
ఎ) కర్ణాటక బి) ఆంధ్రప్రదేశ్
సి) ఉత్తరప్రదేశ్ డి) పంజాబ్

36. భారత పార్లమెంట్‌లో రాష్ట్రపతి అంతర్భాగం అని తెలిపే అధికరణం?
ఎ) 59వ బి) 69వ సి) 79వ డి) 89వ

37. భారతదేశంలో అతి ఎక్కువకాలం పనిచేసిన రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ ఏ రాష్ట్రానికి చెందినవారు?
ఎ) ఉత్తరప్రదేశ్ బి) బీహార్
సి) పశ్చిమ బెంగాల్ డి) ఆంధ్రప్రదేశ్

38. భారతదేశంలో మొదటి ముస్లిం రాష్ట్రపతి?
ఎ) జాకీర్ హుస్సేన్ బి) ఫక్రుద్దీన్ అలీ అహ్మద్
సి) ఎ.పి.జె.అబ్దుల్ కలాం డి) హమీద్ అన్సారీ

39. ఏకగ్రీవంగా ఎన్నికైన రాష్ట్రపతి ఎవరు?
ఎ) ఎ.పి.జె.అబ్దుల్ కలాం బి) జాకీర్ హుస్సేన్
సి) నీలం సంజీవరెడ్డి డి) వి.వి.గిరి

40. భారతదేశ తొలి దళిత ఉపరాష్ట్రపతి, రాష్ట్రపతి ఎవరు?
ఎ) ఆర్.వెంకట్రామన్ బి) శంకర్ దయాళ్‌శర్మ
సి) రామ్‌నాథ్ కోవింద్ డి) కె.ఆర్.నారాయణన్

41. సుప్రీం కోర్టుకు స్వయంగా హాజరై తన వాదనలు వినిపించిన రాష్ట్రపతి ఎవరు?
ఎ) బాబూ రాజేంద్రప్రసాద్ బి) సర్వేపల్లి రాధాకృష్ణన్
సి) వి.వి.గిరి డి) నీలం సంజీవరెడ్డి

42. ప్రస్తుతం 14వ రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రామ్‌నాథ్ కోవింద్ ఏ రాష్ట్రానికి చెందిన వారు?
ఎ) బీహార్ బి) ఉత్తరప్రదేశ్
సి) ఆంధ్రప్రదేశ్ డి) మధ్యప్రదేశ్

43. రాష్ట్రపతిగా ఎన్నిక కాకముందు రామ్‌నాథ్ కోవింద్ ఏ రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించారు?
ఎ) కర్ణాటక బి) ఉత్తరప్రదేశ్
సి) బీహార్ డి) మధ్యప్రదేశ్

44. ప్రస్తుత రాష్ట్రపతి బీహార్ 36వ గవర్నర్‌గా పని చేసిన కాలం?
ఎ) 2012-17 బి) 2015-17 సి) 2016-17 డి) 2014-17

45. రామ్‌నాథ్ కోవింద్ మొదటిసారిగా 1994లో ఏ రాష్ట్రం నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు?
ఎ) బీహార్ బి) గుజరాత్
సి) రాజస్థాన్ డి) ఉత్తరప్రదేశ్

46. ప్రస్తుత రాష్ట్రపతితో ప్రమాణ స్వీకారం చేయించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి?
ఎ) జస్టిస్ జగదీష్‌సింగ్ ఖేహర్
బి) జస్టిస్ కె.జి.బాలకృష్ణన్ సి) జస్టిస్ దీపక్ మిశ్రా
డి) జస్టిస్ దీపక్ గుప్తా

47. జాకీర్ హుస్సేన్ మరణానంతరం తాత్కాలిక రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన తొలి ఉపరాష్ట్రపతి?
ఎ) సర్వేపల్లి రాధాకృష్ణన్ బి) వి.వి.గిరి
సి) బి.డి.జెట్టి డి) మహ్మద్ హిదయతుల్లా

48. రాష్ట్రపతి జీతాన్ని ఎక్కడ నుంచి చెల్లిస్తారు?
ఎ) ఆర్‌బిఐ నుంచి
బి) భారత ఆగంతుక నిధి నుంచి
సి) భారత సంఘటిత నిధి నుంచి డి) ఏదీకాదు

49. ఏ రాష్ట్రం నుంచి ఎక్కువ మంది రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు?
ఎ) తమిళనాడు బి) ఆంధ్రప్రదేశ్
సి) ఉత్తరప్రదేశ్ డి) మహారాష్ట్ర

50. భారత మొదటి మహిళా రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ ఏ రాష్ట్రానికి చెందినవారు?
ఎ) తమిళనాడు బి) ఉత్తరప్రదేశ్
సి) మహారాష్ట్ర డి) కర్ణాటక

సమాధానాలు

1) సి	8) బి	15) ఎ	24) ఎ	33) సి	42) బి
2) ఎ	9) సి	16) బి	25) సి	34) ఎ	43) సి
3) ఎ	10) బి	17) సి	26) బి	35) డి	44) బి
4) డి	11) ఎ	18) బి	27) ఎ	36) సి	45) డి
5) ఎ	12) సి	19) సి	28) డి	37) బి	46) ఎ
6) సి	13) సి	20) డి	29) డి	38) ఎ	47) బి
7) బి	14) డి	21) ఎ	30) ఎ	39) సి	48) సి
		22) సి	31) సి	40) డి	49) ఎ
		23) ఎ	32) బి	41) సి	50) సి

అడ్మిషన్స్

జామ్ 2018

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీల్లో పీజీ కోర్సుల ప్రవేశానికి ఉద్దేశించిన **జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ ఎమ్మెస్సీ(జామ్) 2018**కి ప్రకటన వెలువడింది.

పీజీ కోర్సులు: ఎమ్మెస్సీ/ జాయింట్ ఎమ్మెస్సీ పీహెచ్‌డీ/ ఎమ్మెస్సీ - పీహెచ్‌డీ డ్యూయెల్ డిగ్రీ

టెస్ట్ పేపర్స్ - కోడ్: బయో టెక్నాలజీ(బిటి)/ కెమిస్ట్రీ(సివై)/ జియాలజీ(జిజి)/ మేథమెటికల్ స్టాటిస్టిక్స్(ఎంఎస్)/ బయోలాజికల్ సైన్స్(బిఎల్)/ మేథమెటిక్స్(ఎంఏ)/ ఫిజిక్స్(పిహెచ్)

అర్హత: గుర్తింపు పొందిన సంస్థ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి

జామ్ 2018 జరిగే తేదీ: 2018 ఫిబ్రవరి 11

ఫలితాల విడుదల: 2018 మార్చి 20

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: సెప్టెంబరు 5

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 10

వెబ్‌సైట్: www.jam.iitb.ac.in

ఉస్మానియా యూనివర్సిటీ

ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలోని ప్రొఫెసర్ జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఇ)- **పీజీ డిప్లొమా (బయో ఇన్ఫర్మాటిక్స్)** కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

కోర్సు వ్యవధి: ఏడాది

అర్హత: 50 శాతం మార్కులతో బీఎస్సీ/ బీఫార్మసీ/ బీఎస్సీ - అగ్రి/ ఎంబీబీఎస్/ బీవీఎస్సీ/బీడీఎస్/ బీహెచ్ఎంఎస్/ బీఏఎంఎస్/ బీయూఎంఎస్/ బీఇ/ బీటెక్/ ఎమ్మెస్సీ/ ఎంటెక్/ ఎంసీఏ/ పీహెచ్‌డీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 16

వెబ్‌సైట్: www.oucde.ac.in
www.osmania.ac.in, www.oucde.net

హా..ర్టీసీ

- క్షణాల్లో అగ్నికి ఆహుతి
- ఇలా జరగడం రెండో సారి
- డ్రైవర్ , కండక్టర్ అప్రమత్తతో తప్పిన పెను ముప్పు
- 40 మంది ప్రయాణికులు సురక్షితం
- అశోక్ లేలాండ్ ప్రతినిధులకు సమాచారం

హా.. ర్టీసీ ! సీఎన్‌జీ బస్సు క్షణాల్లో అగ్నికి ఆహుతైంది. నలభై మంది ప్రయాకులతో బయలుదేరిన ఈ బస్సు బెజవాడలో మంగళవారం 16వ నెంబర్ జాతీయ రహదారిపై సిద్ధార్థ మెడికల్ కళాశాల ఎదురుగా దగ్ధమైంది. డ్రైవర్ వెంకటేశ్వరరావు చాకచక్యంగా వ్యవహరించడంతో పెనుప్రమాదం తప్పింది. ప్రయాణికులు దిగగానే బస్సు కింద భాగంలో చెలరేగిన మంటలు దావానలంలా వ్యాపించాయి. చూస్తుండగానే బస్సు మొత్తం అగ్నికీలల్లో చిక్కుకుంది. ట్రాఫిక్ పోలీసులు జాతీయ రహదారిపై రాకపోకలను నిలిపివేశారు. దాదాపు అర్ధగంటపాటు బస్సు దగ్ధమౌతూనే ఉంది. అగ్నిమాపక శాఖ అదికారులు వచ్చి పదిహేను నిమిషాల్లో మంటలను అదుపులోకి తెచ్చారు. సీఎన్‌జీ సిలిండర్ల నుంచి గ్యాస్ లీక్ కావడం వల్ల ప్రమాదం సంభవించి ఉండవచ్చునని మొదట భావించారు కానీ బస్సుకు కుడి భాగంలో వెనుక టైర్ల వెనుక ఈ సిలిండర్లు ఉన్నాయి. ఈ భాగంలో కేబుల్స్ కూడా ఉండవు. ప్రమాదం ఎలా సంభవించిందన్నది అధికారులకు కూడా అంతు చిక్కటం లేదు. సీఎన్‌జీ లీక్‌తో పాటు, షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు వ్యాపించాయని ప్రత్యక్ష సాక్షులు చెబు తున్నారు.




బస్సు దగ్ధంతో ఆందోళన చెందుతున్న ప్రయాణికులు



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/మాచవరం / భారతీనగర్):

గవర్నర్ పేట - 2 డిపోకు చెందిన రూట్ నెంబర్ 54 సీఎన్‌జీ బస్సు ఆటోనగర్ బస్సు డిపో నుంచి మొత్తం 70 మంది ప్రయాణికులతో ఉదయం 8 గంటలకు బయలు దేరింది. బెంజ్‌సర్కిల్ వరకు బాగానే వచ్చింది. అక్కడి నుంచి 16వ నెంబరు జాతీయరహదారి వైపునకు వచ్చే సందర్భంలో బస్సు సమస్యాత్మకంగా ఉందని గుర్తించారు. గవర్నమెంట్ హాస్పిటల్ వరకు బస్టాపుల్లో ప్రయాణికులు ఎక్కి దిగుతూనే ఉన్నారు. ప్రభుత్వాసుపత్రి స్టాప్ నుంచి బయలు దేరే సమయానికి బస్సులో 40 మంది ప్రయాణికులు వున్నారు. కొద్ది దూరం వెళ్ళగానే బస్సులో ఒక్కసారిగా శబ్ధం రావటంతో బస్సును నిలుపు చేసి కుడివైపున పరిశీలిస్తుండగా.. ఎడమవైపు నుంచి పొగలు రావటం గమనించారు. పొగతో పాటు మంటలు రావటంతో ఒక్కసారిగా కండక్టర్‌ను, ప్రయాణి కులను డ్రైవర్ అప్రమత్తం చేశారు. వారు దిగిపోయారు. వెంటనే నిమిషాల వ్యవధిలో బస్సు మొత్తానికి మంటలు వ్యాపించాయి. బస్సు దగ్ధమైనా సీఎన్‌జీ సిలిండర్లు మాత్రం పేలలేదు. ఆర్టీసీ విజయవాడ జోన్ ఈడీ ఎన్‌వీ రావు, కృష్ణా ఆర్‌ఎం పీవీ రామారావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. బస్సు ప్రమాద ఘటనపై అంచనాకు రాలేకపోయారు. అశోక్ లేలాండ్ ప్రతినిధులకు సమాచారం అందించారు. వారు ఈ బస్సును పరిశీలించి నివేదిక ఇవ్వనున్నారు.

ఇది రెండో సీఎన్‌జీ బస్సు ప్రమాదం

ఆర్టీసీ సీఎన్‌జీ బస్సులు తరచూ మొరాయిస్తున్నాయని ఆర్టీసీ డ్రైవర్లు తెలుపుతున్నారు. దగ్ధమైన బస్సుల్లో ఇది రెండో సీఎన్‌జీ! ఇంతకు ముందు నున్న వెళ్ళే మార్గంలో సీఎన్‌జీ బస్సు దగ్ధమైంది. అప్పట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా బస్సు దగ్ధమైంది. ప్రస్తుత ఘటనలో గ్యాస్ లీక్ అయినా ... షార్ట్ సర్క్యూట్ వల్లే మంటలు చెలరేగినట్టు తెలుస్తోంది. రెండు ఘటనల్లోనూ సిలిండర్లు పేలలేదు. సీఎన్‌జీ సిలెండర్ల నుంచి మంటలు వచ్చే అవకాశం ఉండదని, గ్యాస్ లీకైన మాట వాస్తవమే అయినా ఫైర్ ఎక్కడి నుంచి వచ్చిందన్నది అధికారులకు అంతుచిక్కక లేలాండ్ కంపెనీ ప్రతినిధులను పరిశీలించటానికి ఆహ్వానించారు. సీఎన్‌జీ కాకుండా ఇటీవల కాలంలో ఇప్పటికే రెండు బస్సులు దగ్ధమయ్యాయి. విజయవాడ డిపో గ్యారేజీలో ఒక గరుడ , ఒక సూపర్ లగ్జరీ బస్సు దగ్ధమైంది.



సీఎన్‌జీ సిలెండర్



కాలిన బస్సును పరిశీలిస్తున్న ఆర్‌ఎం పీవీ రామారావు

ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌కు సన్మానం

బస్‌స్టేషన్ (వన్‌టౌన్) : ప్రయాణికులను కాపాడిన బస్సు డ్రైవర్ ఎ.వెంకటేశ్వరరావు (ఎ.వి.రావు), మహిళా కండక్టర్ ఎం.శిరీషలను మంగళవారం సాయంత్రం ఆర్టీసీ ఎండి ఎం.మాలకొండయ్య తన కార్యాలయంలో సన్మానించారు. ఒక్కొక్కరికి రెండు వేల రూపాయల చొప్పున నగదు బహుమతి అందజేశారు. ఈడీ (ఇ) కోటేశ్వరరావు ఈడీ ఏవీఆర్, కృష్ణ ఆర్‌ఎం పి.వి.రామారావు, డీసీటీఎం శ్రీరాములు, ఎన్‌ఎంయూ కృష్ణా సెక్రటరి రావి సుబ్బారావు, ఇయూ నాయకులు వై.ఎస్.రావు తదితరులు పాల్గొన్నారు.



డ్రైవర్ ఎ.వి.రావు, కండక్టర్ శిరీషను సన్మానించి నగదును బహూకరిస్తున్న ఎండీ మాలకొండయ్య

వృద్ధాశ్రమాల్లో మెను చార్జీల పెంపు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

మచిలీపట్నంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఇచ్చే మెను చార్జీలు పెంచుతూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా అనంతపురం, గుంటూరు, మచిలీపట్నం, తిరుపతుల్లో ప్రభుత్వం వృద్ధాశ్రమాలను నిర్వహిస్తోంది. మొత్తం 305 మంది వృద్దులు, దివ్యాంగులు వీటిల్లో ఆశ్రయం పొందుతున్నారు. వీరందరికి ఇప్పుడు ఒక్కొక్కరికి నెలకు రూ 850 చొప్పున మెను చార్జీలు ఇస్తున్నారు. ఇవి చాలడం లేదని ప్రభుత్వానికి అందిన నివేదిక మేరకు మరో రెండు వందల రూపాయలు పెంచుతూ నెలకు రూ 1050 ఇచ్చేందుకు ప్రభుత్వం ఆమోదించింది.

మచిలీపట్నంలోని వృద్ధాశ్రమంలో ఉంటున్న 65 మందికి ఇప్పుడు ఏడాదికి రూ 5,52,000 ఇస్తున్నారు. పెంచిన చార్జీల మేరకు రూ 6,82,500 వ్యయమవుతుందని అంచనా వేశారు. పెంచిన మొత్తం రూ. 200 వల్ల ప్రభుభుత్వానికి అదనంగా రూ 1,30,000 వ్యయమవుతుందని అంచనా.

ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఆందోళన

వీసీ జోక్యంతో విరమణ

నూజివీడు టౌన్: రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలోని నూజివీడు క్యాంపస్ నాలుగో ఏడాది విద్యార్థులు మంగళవారం అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ వద్ద ధర్నా చేశారు. వి.సి రామచంద్రరాజు జోక్యంతో ఆందోళన విరమించారు. వివరాల్లోకి వెళితే మెస్ నిర్వాహకులు ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం నిమజ్జనం సందర్భంగా డీజే సౌండ్‌బాక్స్, మాక్ డ్యాన్స్ నిర్వహణకు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు యాజమాన్యాన్ని అనుమతికోరగా నిరాకరించింది. అయినా విద్యార్థులు కొందరు సౌండ్ బాక్సులను ఏర్పాటు చేశారు. క్యాంపస్‌లోని వెల్ఫేర్ ఆఫీసర్లు అభ్యంతరం చెప్తూ వాటిని స్వాధీనం చేసుకున్నారు. దీంతో శని, ఆదివారాల్లో గణపతి విగ్రహాల నిమజ్జనాన్ని విద్యార్థులు అడ్డుకుని సౌండ్ బాక్సులు ఇవ్వాలని పట్టుబట్టారు. మంగళవారం దాదాపు 200 మంది విద్యార్థులు ఆందోళన బాట పట్టారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ డైరెక్టర్ వి.వి. దాసు సెలవుపై ఉండటంతో చివరికి సమస్య వి.సి రామచంద్రరాజు దగ్గరకు వెళ్ళింది.క్యాంపస్‌లో క్రమ శిక్షణా రాహిత్యాన్ని సహించనని ఆందోళన విరమించా లని హెచ్చరించడంతో విద్యార్థులు ఆందోళన విర మించారు.

రొయ్యూరు ఇసుక క్వారీ పునరుద్ధరణ



రొయ్యూరు క్వారీ నుంచి వస్తున్న ఇసుక ట్రాక్టరు

రొయ్యూరు(తోట్లవల్లూరు) : రొయ్యూరు ప్రభుత్వ ఇసుక క్వారీని అధికారులు పునరుద్ధరించారు. సోమవారం నుంచి క్వారీని తెరవటంతో వినియోగదారులకు ఇసుక అందుబాటులోకి వచ్చింది. 'రొయ్యూరు క్వారీలో అడ్డగోలు దోపిడి' శీర్షికన ఈ నెల 25న ఆంధ్రజ్యోతి లో కథనం ప్రచురించటంతో అధికారులు ఇసుక తవ్వకాలను మూడు రోజుల పాటు క్వారీని తాత్కాలికంగా తహసీల్దార్ జి భద్రు నిలిపివేశారు. ప్రభుత్వ నిబంధనలను పాటించాలని కార్మికులను హెచ్చరించారు. ఆ తరువాత క్వారీని పునరుద్దరించారు. ఆంధ్రజ్యోతి కథనం తరువాత అదనపు లోడుకి వసూలు చేసే రూ 200లను రూ 100కు తగ్గించారని ట్రాక్టర్ల డ్రైవర్లు తెలిపారు.

గ్రూప్-2 పరీక్షలు రద్దు చేయాలి

గాంధీనగర్ : గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలో అక్రమాలు జరిగాయని, వెంటనే ఆ పరీక్షలను రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. నిరుద్యోగ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో లక్ష్మణరావు మాట్లాడుతూ జూలై 15, 16 తేదీల్లో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన పరీక్షల్లో చీరాల, విశాఖపట్నం, కేంద్రాల్లో అక్రమాలు జరిగాయని తెలిపారు. ఈ అంశంపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. పరీక్ష నిర్వహణలో ఏపీపీఎస్సీ పూర్తిగా విఫలం అయిందని నిరుద్యోగ ఐక్యవేదిక నాయకుడు పరిమి కిరణ్‌కుమార్ ఆరోపించారు. వీటిని మళ్లీ ఆన్‌లైన్‌లో నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 31న ధర్నా చౌక్ వద్ద ధర్నా చేపట్టనున్నట్టు తెలిపారు. సమావేశంలో సుబ్రహ్మణ్యం, సూర్యారావు పాల్గొన్నారు.

దేశ ప్రతిష్టను ఇనుమడింపజేస్తున్న క్రీడాకారులు

టెన్నిస్ సీనియర్ క్రీడాకారుడు కె.రాధాకృష్ణమూర్తి

లబ్బీపేట స్పోర్ట్స్ : దేశ ప్రతిష్టను పెంపొందించడానికి క్రీడాకారులు ఎంతోదోహదపడుతున్నారని జాతీయ టెన్నిస్ సీనియర్ క్రీడాకారుడు కె.రాధాకృష్ణమూర్తి అన్నారు. గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలోని టెన్నిస్ కోర్ట్‌లో మంగళవారం అభినందన సభ జరిగింది. కె.రాధాకృష్ణమూర్తి, సి.వరప్రసాద్‌లను ఫౌండేషన్ ఛైర్మన్ శేషయ్య, వాలీబాల్ కోచ్ కోటేశ్వరరావులు ఘనంగా సన్మానించారు. కె.రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని, కష్టపడి ఏ పనిచేసినా విజయం సాధించవచ్చునన్నారు. వరప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు, క్రీడాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని తెలిపారు.. ఈ కార్యక్రమంలో టెన్నిస్ కోచ్ వై.శివరామకృష్ణ, జి.వి.ఎస్.ప్రసాద్, ఖాన్, ఫౌండేషన్ సభ్యులు ఏ.సుబ్బారావు, కె.అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



టెన్నిస్ సీనియర్ క్రీడాకారులు కె.రాధాకృష్ణమూర్తి, సి.వరప్రసాద్‌లను సన్మానించిన గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ సభ్యులు

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 3, 5



మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): ఉద్యోగ, వ్యాపారాల్లో లక్ష్య సాధనకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తారు. సంకల్పం నెరవేరుతుంది. వృత్తిపరమైన సమావేశాలు, ప్రయాణాలకు అనుకూలం. సహోద్యోగులతో చర్చలు ఫలిస్తాయి.



వృషభరాశి: (ఏప్రిల్21-మే20): పూర్వ మిత్రులను కలుసుకుంటారు. షాపింగ్ ఉల్లాసం కలిగిస్తుంది. ఆంతరంగిక చర్చలు ఫలిస్తాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం. పూజలు, వేడుకల్లో పాల్గొంటారు. విరాళాలు, దానధర్మాలకు ఖర్చు చేస్తారు.



మిథునరాశి: (మే21-జూన్21): ప్రియతముల కలయికతో ఇంట్లో సందడి వాతావరణం నెలకొంటుంది. సమావేశాల్లో మార్పులకు ప్రయత్నిస్తారు. వేడుకలు, శుభకార్యాల్లో ఉత్సాహంగా పాల్గొంటారు. రియల్ ఎస్టేట్ రంగంలోని వారికి అనుకూలం.



కర్కాటకరాశి: (జూన్22-జూలై23): వృత్తి, వ్యాపారాలకు అవసరమైన పత్రాలు, సరకుల రవాణాకు అనుకూలం. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లు లాభిస్తాయి. రిజిస్ట్రేషన్లకు శుభతరుణం. సన్నిహితు ఆరోగ్య విషయాలపై దృష్టి సారిస్తారు.



సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): పొదుపు పథకాలు లాభిస్తాయి. ప్రేమానుబంధాలు బలపడతాయి. షాపింగ్, క్రయవిక్రయాలకు అనుకూలం. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. చిన్నారులు, ప్రియతముల విషయాల్లో శుభపరిణామాలు సంభవం.



కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): బదిలీలు, మార్పులకు అనుకూలం. దూరంలో ఉన్న బంధుమిత్రులను కలుసుకుంటారు. కుటుంబ సభ్యుల వైఖరిని సమీక్షించుకుంటారు. వాయిదాపడుతున్న పనులు పూర్తి చేస్తారు.



తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): సోదరీసోదరుల విషయంలో శుభపరిణామాలు సంభవం. ప్రయాణాలు ఆనందం కలిగిస్తాయి. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లపై ఒక నిర్ణయానికి వస్తారు. విలువైన సమాచారం అందుకుంటారు. విద్యార్థులకు శుభప్రదం.



వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): షాపింగ్ ఉల్లాసం కలిగిస్తుంది. ఆర్థికపరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఆర్థిక సంస్థలు, బ్యాంకులతో పనులు పూర్తవుతాయి. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. ప్రేమానుబంధాలు బలపడతాయి.



ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): సంకల్పం నెరవేరుతుంది. ప్రభుత్వ సంస్థలు, రాజకీయ రంగాల వారు గౌరవ, మన్ననలు అందుకుంటారు. పెద్దల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. వృత్తి, వ్యాపారాల విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.



మకరరాశి(డిసెంబర్22-జనవరి21): దూరంలో ఉన్న ప్రియతములను కలుసుకుంటారు. ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలు, ఉత్సవాలకు నిధులు సమకూరతాయి. ముఖ్య సమాచారం అందుకుంటారు. సినీ, రాజకీయ రంగాల వారికి ప్రోత్సాహకరం.



కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): బృందకార్యక్రమాలు, వేడుకలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. షాపింగ్ ఆనందం కలిగిస్తుంది. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో సమావేశాలు ఫలిస్తాయి. పూర్వ మిత్రులను కలుసుకుంటారు.



మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): ఉన్నత పదవులు అందుకుంటారు. భాగస్వామి సహకారంతో వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. జన సంబంధాలు మెరుగుపడతాయి. వేడుకలు, శుభకార్యాల్లో ప్రముఖులను కలుసుకుంటారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

సినిమా గైడ్

అలంకార్	వివేకం
అన్నపూర్ణ	నేనేరాజు నేనేమంత్రి
అప్సర	జయ జానకి నాయక
శ్రీదుర్గాకళామందిర్	సమరసింహారెడ్డి
జయరామ్	దువ్వాడ జగన్నాథమ్
కళ్యాణచక్రవర్తి	సోగ్గాడే చిన్నినాయనా
కపర్ధి	ఫిదా
నవరంగ్	ఆనబెల్/జెంటిల్‌మన్
నీలిమ	అర్జున్‌రెడ్డి
రాజ్	అర్జున్‌రెడ్డి/విఐపి-2
రామ్‌గోపాల్	అర్జున్‌రెడ్డి
రాజకుమారి	ఆనందోబ్రహ్మ
రాఘవేంద్ర	వివేకం
స్వర్ణప్యాలెస్	లై
శకుంతల	అర్జున్‌రెడ్డి
శైలజ	అర్జున్‌రెడ్డి
శ్రీనివాసమహల్	వివేకం
స్వాతి	వివేకం
సౌమ్య	అర్జున్‌రెడ్డి
వెంకటేశ్వరప్యాలెస్	ఆనందోబ్రహ్మ
వెంకటస్వర్ణ ప్యాలెస్	విఐపి-2
యువరాజ్	వివేకం/ఆనందోబ్రహ్మ/నేనేరాజు నేనేమంత్రి

పాయకాపురం

రవీంద్ర సినిమాస్ -	వివేకం/ విఐపి-2/అర్జున్‌రెడ్డి
స్వర్ణలక్ష్మి	అర్జున్‌రెడ్డి
శ్రీవెంకటేశ్వరడీలక్స్	జయ జానకి నాయక

పటమట

దుర్గామహల్	అర్జున్‌రెడ్డి
రామకృష్ణ	ఆనందోబ్రహ్మ
వినాయక్	వివేకం
విజయలక్ష్మి (కానూరు)	వివేకం

పోరంకి

బాలాజీ సినీవిల్లా	వివేకం/ఆనందోబ్రహ్మ
వెంకటకృష్ణ	అర్జున్‌రెడ్డి
శ్రీనివాస	విఐపి-2/జయ జానకి నాయక

కంకిపాడు

శ్రీవిజయలక్ష్మి	వివేకం
శ్రీచంద్ర	నేనేరాజు నేనేమంత్రి
శ్రీరామచంద్ర	అర్జున్‌రెడ్డి

గన్నవరం

శాంతి	జయ జానకి నాయక
శ్రీవెంకటేశ్వర	వివేకం

ఇబ్రహీంపట్నం

బాలాజీ	జయ జానకి నాయక
శ్రీవెంకటేశ్వరడీలక్స్	అర్జున్‌రెడ్డి
శివకృష్ణ(కొండపల్లి)	వివేకం/ఆనందోబ్రహ్మ

ఊర్వశి ఐనాక్స్: అర్జున్‌రెడ్డి, విఐపి-2, వివేకం, ఆనందోబ్రహ్మ, నేనేరాజు నేనేమంత్రి

మీరజ్ సినిమాస్: అర్జున్‌రెడ్డి, విఐపి-2, వివేకం

పైస్క్రీన్స్: అర్జున్‌రెడ్డి, విఐపి-2, వివేకం, ఆనందోబ్రహ్మ

పీవీఆర్ సినిమాస్: అర్జున్‌రెడ్డి, విఐపి-2, వివేకం, ఆనందోబ్రహ్మ, నేనేరాజు నేనేమంత్రి, ఆన్‌బెల్, జంటిల్‌మాన్

క్యాపిటల్ సినిమాస్: అర్జున్‌రెడ్డి, విఐపి-2, వివేకం, ఆనందోబ్రహ్మ, నేనేరాజు నేనేమంత్రి, జంటిల్‌మాన్, ఖైదీబాండ్, జయ జానకి నాయక, ఆన్‌బెల్, ఫిదా, ది డార్క్‌టవర్

ఎల్ఈపీఎల్ఐనాక్స్: అర్జున్‌రెడ్డి, విఐపి-2, వివేకం, ఆనందోబ్రహ్మ, ఆన్‌బెల్, నేనేరాజు నేనేమంత్రి, జంటిల్‌మాన్

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూపాయల్లో)		వెన్‌కాబ్ (రూపాయల్లో)	
బ్రాయిలర్ బర్డ్	97, 105, 116	ఫారం ధర	90
చికెన్ విత్ స్కిన్	186	రిటైల్ ధర	105
చికెన్ స్కిన్‌లెస్	196	చికెన్ విత్ స్కిన్	147
		చికెన్ స్కిన్‌లెస్	173

నెక్ కోడిగుడ్ల ధర

విజయవాడ జోన్ రైతు ధర
రూ. 3.59

బులియన్

బిస్కెట్ (100 గ్రా)	రూ.3,06,000
బిస్కెట్ బంగారం22 క్యారెట్లు(10గ్రా)	రూ.28,500
వెండి (కిలో)	రూ.41,300
వెండి (10 గ్రా)	రూ.413

డోక్లామ్ విజయంపై ర్యాలీ

స్వదేశీ జాగరణ్ మంచ్ హర్షం



స్వదేశీ జాగరణ్ మంచ్ ఆధ్వర్యంలో ర్యాలీ

విజయవాడ: డోక్లామ్‌పై చైనా వెనక్కు తగ్గడం భారత్ దౌత్యపరమైన ఘన విజయమని స్వదేశీ జాగరణ్ మంచ్ రాష్ట్ర కో-కన్వీనర్ సాగి వెంకట నరసింహ రాజు అన్నారు. భారత్, చైనా సైన్యాల మధ్య దాదాపు రెండున్నర నెలలుగా తలెత్తిన ఈ వివాదం శాంతియుతంగా పరిష్కారం అవడాన్ని హర్షిస్తూ మంగళవారం విజయవాడలో విజయోత్సవ ప్రదర్శన జరిగింది. లెనిన్ సెంటర్ నుంచి ఏలూరు రోడ్డు, బీసెంట్ రోడ్డు తదితర వివిధ కూడళ్ల మీదుగా సాగిన ఈ ప్రదర్శన తిరిగి లెనిన్ సెంటర్‌కు చేరుకుంది. ఈ ప్రదర్శనలో స్వదేశీ జాగరణ్ మంచ్‌తో పాటు, ఆరెస్సెస్, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు. చైనా కుట్రలను తిప్పికొట్టడంలో మోదీ సర్కారు కృషిని, ప్రజల మద్దతును, సైన్యం పోరాట స్ఫూర్తిని నరసింహరాజు కొనియాడారు. ఇదే స్ఫూర్తితో చైనా వస్తువులను తిప్పికొట్టి స్వదేశీ ఉత్పత్తులను ప్రజలు ప్రోత్సహించాలని, తద్వారా భారత్ ఆర్థిక పురోగతికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్వదేశీ జాగరణ్ మంచ్ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ యూవీ రామరాజు, రాష్ట్ర యువ ప్రముఖ్ ఎం.అఖిలేష్, విజయవాడ కో-కన్వీనర్ కె.శ్రీహరి, కార్యాలయ కార్యదర్శి సి.హెచ్. సురేష్, కాళేశ్వరరావు, లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సిటీ డైరీ

ఫ్రెషర్స్‌డే
విషయం: ఫ్రెషర్స్‌డే
సమయం: ఉదయం 9.30 గంటలకు
వేదిక: మేరీస్ స్టెల్లా ఆడిటోరియం, పటమట

ధర్నా
విషయం: ఎపిఆర్‌పిఎ కృష్ణాజిల్లా ధర్నా
సమయం: ఉదయం10.30 గంటలకు
వేదిక: ధర్నా చౌక్

బహిరంగ కోర్టు
విషయం: కార్మికశాఖ బహిరంగ కోర్టు
సమయం: ఉదయం 11 గంటలకు
వేదిక: సబ్ కలెక్టర్ కార్యాలయం

ఇంటర్వ్యూలు
విషయం: ఉద్యోగాల ఎంపిక నిమిత్తం ఇంటర్వ్యూలు
సమయం: ఉదయం10.30 గంటలకు
వేదిక: జిల్లా ఉపాధి కార్యాలయం

ఎంపిక
విషయం: హాకీలో జిల్లా జట్ల ఎంపికలు
సమయం: ఉదయం 9.00గంటలకు
వేదిక: ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం

జెరూసలెం యాత్రకు దరఖాస్తులు ఆహ్వానం

● చివరి తేదీ సెప్టెంబరు 30

●బిషప్‌లు, మత పెద్దలు, ఫాదర్లకు క్రిస్టియన్ కార్పొరేషన్ లేఖలు

(అమరావతి, ఆంధ్రజ్యోతి): జెరూసలెం యాత్రకు వెళ్లే క్రిస్టియన్లకు సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. క్రిస్టియన్(మైనార్టీ) ఫైనాన్స్ కార్పొరేషన్ తరఫున వారికి ఆర్థిక సహాయం అందిస్తూ జెరూసలెంతో పాటు ఆ చుట్టుపక్కల ఉన్న పవిత్ర ప్రాంతాలను దర్శించే అవకాశం కల్పిస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రిస్టియన్(మైనార్టీ) ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ పి.ఉషాకుమారి రాష్ట్రంలోని బిషప్‌లు, క్రిస్టియన్ కమ్యూనిటీ పెద్దలు, ఫాదర్లకు ప్రత్యేకంగా లేఖలు పంపించారు. దరఖాస్తుదారులు తప్పనిసరిగా ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారై ఉండాలి. క్రిస్టియన్ కమ్యూనిటీ ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలి. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేయడానికి ఆఖరు తేదీ సెప్టెంబరు 30. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడంతో పాటు, మరో కాపీని వ్యక్తిగతంగా క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు అందించాలి. ప్రతి బ్యాచ్‌లో ఇద్దరి నుంచి 30మంది సభ్యుల చొప్పున 45 నుంచి 100 బ్యాచ్‌లను యాత్రకు పంపేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. యాత్రకు ఒక్కొక్కరికి రూ.87,309 ఖర్చవుతుందని అధికారులు అంచనా వేశారు. వార్షిక ఆదాయం 3లక్షల కంటే తక్కువ ఉన్నవారికి రూ.40వేలు, అంతకుమించి ఆదాయం ఉన్నవారికి రూ.20వేలు ప్రభుత్వం సబ్సిడీగా అందిస్తుందని ఆ లేఖలో పేర్కొన్నారు.

ప్రధానోపాధ్యాయురాలు పోస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

రైల్వేస్టేషన్: విజయవాడ రైల్వే డివిజన్ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న జాక్ అండ్ జిల్ ఇంగ్లీషు మీడియం పాఠశాలకు ప్రధానోపాధ్యాయురాలు పోస్ట్‌ను భర్తీ చేయటానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు సంస్థ అధ్యక్షురాలు, డీఆర్‌ఎం సతీమణి ఆర్.శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు. గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, బెడ్, మెడ్ అర్హతలు కలిగి ఉన్న వారు, టీచింగ్‌లో కనీసం 10 ఏళ్ల అనుభవం ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సెక్రటరీ, జాక్ అండ్ జిల్ స్కూల్ ఎస్‌సీఆర్‌డబ్ల్యుడబ్ల్యువో, విజయవాడ చిరునామాకు సంప్రదించవచ్చని ఆమె తెలిపారు.

నిరుపయోగంగా ఉన్న ప్లాస్టిక్ కవర్లు తీసుకురండి

రైతుబజార్‌లో స్టాల్ ఏర్పాటు



పటమట రైతు బజార్ వద్ద ఏర్పాటు చేసిన స్టాల్

పటమట: మీ నివాసాలలో నిరుపయోగంగా ఉన్న ప్లాస్టిక్ కవర్లను తీసుకువచ్చి రైతుబజార్‌లో ఏర్పాటు చేసిన స్టాల్ వద్ద ఉంచండి అంటూ పటమట రైతుబజార్ ముఖ ద్వారం వద్ద సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. అక్కడ ప్లాస్టిక్ కవర్లను ఉంచడానికి ప్రత్యేకంగా స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిర్మూలించడానికి అందరూ సహకరించాలంటూ అందులో పేర్కొన్నారు. రైతు బజారులో చిరువ్యాపారస్తులు ప్లాస్టిక్ కవర్లను రూ.2 నుంచి రూ.5 వరకు విక్రయిస్తుండటంతో తప్పనిసరి పరిస్థితులలో వినియోగదారుడు వాటిని కొనుగోలు చేస్తుండటంతో కవర్ల సంఖ్య పెరిగిపోతుంది. దీంతో ఇళ్లల్లో వాడని కవర్లను మార్కెట్ బయట ఉంచిన స్టాల్ వద్ద ఉంచడం ద్వారా అవసరం ఉన్నవారు వీటిని తిరిగి వినియోగించడంతో కవర్ల సంఖ్య తగ్గించవచ్చనే వినూత్న ఆలోచనతో మార్కెట్ అధికారులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. చాలా మంది వినియోగదారులు కవర్లు తీసుకు వచ్చి ఇక్కడ తగిలిస్తున్నారు.

ఆటోక్లస్టర్ ఎండీ వేమూరి ఆకస్మిక మృతి



ఆటోనగర్ : ఆటోక్లస్టర్ మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాజేంద్రప్రసాద్ (71) మంగళవారం సాయంత్రం మృతి చెందారు. కొంతకాలంగా శ్వాసకోశవ్యాధితో బాధపడుతున్న వేమూరి హైదరాబాద్‌లోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఆటోనగర్ స్టోర్స్, హౌసింగ్ ప్రాజెక్టులకు ఆయన వ్యవస్థాపకుడు. రెండు పర్యాయాలు ఐలా చైర్మన్‌గా, ఏటీఏ కార్యదర్శిగా, ఆటోనగర్‌లో పలు సంఘాలకు గౌరవాధ్యక్షులుగా పనిచేశారు. ఐలా చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్, కార్యదర్శి అన్నే శివనాగేశ్వరరావు, కోశాధికారి బాయనబాబ్జి, స్టోర్సు చైర్మన్ యార్లగడ్డ సుబ్బారావు, కార్యదర్శి జె.ఎ.నరసయ్య, మెకానిక్ సంఘం కార్యదర్శి గల్లా సదాశివరావు, స్టోర్సు మాజీ చైర్మన్ కత్తిక శివనాగేశ్వరరావు, మాజీ కార్యదర్శి కత్తుల సత్యనారాయణ, వివిధ సంఘాల నేతలు వేమూరి మృతికి తమ సంతాపం వ్యక్తం చేశారు.

ప్రేక్షకుల గుండెల్లో నాగార్జునకు ప్రత్యేక స్థానం

ఆలిండియా అక్కినేని నాగార్జున యువసేన అధ్యక్షుడు సర్ధార్ ఎన్. సర్వేశ్వరరావు



అక్కినేని నాగార్జున 59వ జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేస్తున్న సర్ధార్ సర్వేశ్వరరావు

విజయవాడ సెంట్రల్: విభిన్న కథాచిత్రాలలో నటించడం ద్వారా అక్కినేని నాగార్జున తెలుగు ప్రేక్షకుల గుండెల్లో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సాధించారని ఆలిండియా అక్కినేని నాగార్జున యువసేన అధ్యక్షుడు సర్ధార్ ఎన్. సర్వేశ్వరరావు అన్నారు. టాలీవుడ్ కింగ్, యువసామ్రాట్ అక్కినేని నాగార్జున 59వ జన్మదిన వేడుకలు మంగళవారం ఆలిండియా అక్కినేని నాగార్జున యువసేన అధ్యక్షుడు సర్ధార్ ఎన్. సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మొదట గాంధీనగర్‌లోని కామాక్షి మూవీస్ కార్యాలయంలో అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను సర్ధార్ సర్వేశ్వరరావు కట్ చేసి అభిమానులకు తినిపించారు. అనంతరం చిత్రాల పంపిణీదారులు, ఎగ్జిబిటర్స్‌కు స్వీట్ ప్యాకెట్లు అందజేశారు. బందరు రోడ్డులోని నిర్మల హృదయ భవన్‌లోని అనాథలకు, వృద్ధులకు బ్రెడ్‌లు, పండ్లు, కేకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విక్రమ్ సినిమాతో తెలుగు చలనచిత్ర పరిశ్రమకు పరిచయమైన నాగార్జున విభిన్న కథాంశాలు ఎన్నిక చేసుకోవడం ద్వారా ప్రేక్షకులకు నూతనత్వాన్ని అందించారన్నారు. తమ అభిమాన నటుడు మూడు తరాల ప్రేక్షకుల అభిమానాన్ని పొందారన్నారు. అక్టోబర్‌లో విడుదల కానున్న అక్కినేని నాగార్జున నటించిన రాజు గారి గది-2 చిత్రం యువతరాన్ని ప్రత్యేకంగా ఆకట్టుకుంటుందన్నారు. ఆయన మరిన్ని పుట్టినరోజులు జరుపుకుంటూ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాగార్జున అభిమానులు టి. శేఖర్, బి.కృష్ణ, కె.ప్రభాకర్, ఎం.లోకేష్, ఎన్.సత్యం, ఎం. విజయకృష్ణ, ఎస్‌కె బాషా, శ్రీను, రాజా, ఏ.చిన్ని, ఏ.అమర్, సన్నీ, గౌతమ్, హరి, అజయ్, చెన్నారెడ్డి, ప్రభు, సురేష్, భాను, షఫీ, రమ్మిరెడ్డి, ప్రదీప్, వర్మ, మహేష్, హనుమంతరావు, శివ, రాజా, ప్రకాష్, సుబ్బు, శివమణి, బాజీ పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న బీజేపీ

ఏపీ కిసాన్‌ఖేత్ మజ్దూర్ కాంగ్రెస్ చైర్మన్ గురునాథరావు

విజయవాడ సెంట్రల్: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం క్రింద రైతులకు ఇంతవరకు బీమా అందలేదని ఆంధ్రప్రదేశ్ కిసాన్‌ఖేత్ మజ్దూర్ కాంగ్రెస్ చైర్మన్ జెట్టి గురునాథరావు అన్నారు. మంగళవారం ఆంధ్రరత్న భవన్‌లోఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరితో రైతు పరిస్థితి దారుణంగా తయారైందన్నారు. ఫసల్ బీమా యోజన పేరిట 8.61 లక్షల రైతుల దగ్గర నుంచి రూ. 5077.13 కోట్లు ప్రీమియం కింద వసూలు చేశారన్నారు. కానీ ఇప్పటి వరకు ఈ బీమా కంపెనీలు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల పంటగాని వేయకపోతే 25 శాతం రైతులకు చెల్లిస్తామని చెప్పి ప్రీమియం కట్టించారని వారికి కూడా ఏ ఒక్కరికీ రూపాయి కూడా కట్టలేదన్నారు.

నిష్ణాతులైన అధ్యాపకులు అవసరం

రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షురాలు, వైస్ చైర్మన్ డాక్టర్ వి.వల్లేకుమారి

పెనమలూరు: నాణ్యమైన విద్యను అందించగలిగితే దేశ సంపదను మనదేశంలోనే ఉంచగలుగుతామని, రాష్ట్రాన్ని కేంద్రంగా మార్చగలమని అందుకు నిష్ణాతులైన అధ్యాపకుల అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షురాలు, వైస్ చైర్మన్ డాక్టర్ వి.వల్లేకుమారి తెలిపారు. కానూరు పీవీపీ సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో కంప్యూటర్ సైన్స్ విభాగం నందు ఇన్ఫర్మేషన్ తయారీ అండ్ ఎనంటిన్స్ అనే అంశంపై 50 రోజుల అధ్యాపక శిక్షణ కార్యక్రమం ప్రారంభించి అనంతరం ప్రసంగించారు. ఉన్నత చదువుల కోసం తమ పిల్లలను ఇతర రాష్ట్రాలకు, దేశాలకు పంపుతున్నారని, దీంతో రాష్ట్రం, దేశం ఆర్థికంగా, మేధోపరంగా నష్టపోతుందన్నారు. ప్రిన్సిపాల్ కె.శివాజీబాబు మాట్లాడుతూ ఈ శిక్షణ అధ్యాపకులకు తమను తాము తీర్చిదిద్దుకోవడానికి మాత్రమే కాకుండా విద్యార్థులను అకడమిక్, రీసెర్చ్‌పరంగా అభివృద్ధి చేసే అవకాశాలను ఇస్తుందన్నారు. కార్యక్రమంలో సీఎస్‌ఈ విభాగాధిపతి డాక్టర్ సురేష్‌చంద్ర శతపతి, ఎఫ్‌డీపీ కో- ఆర్డినేటర్ ఎం.వి.రామకృష్ణ, కో- ఆర్డినేటర్లుగా ప్రొఫెసర్ జానకిరామయ్య, వి.రమణలక్ష్మి, సహ ఆచార్యులు బి.ఎన్.స్వామి, 70 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

తెలుగు వెలుగుల కృష్ణా

గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలో సీఎం చంద్రబాబు

(ఆంధ్రజ్యోతి,విజయవాడ)

తెలుగుకు వెలుగు నిచ్చింది కృష్ణాజిల్లా అని సీఎం చంద్రబాబు కొనియాడారు. తెలుగు భాష వెలుగునకు కృషి చేసిన గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి మంగళవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్య అతిధిగా సీఎం పాల్గొని మాట్లాడుతూ తెలుగు భాషకు సేవ చేసిన శ్రీకృష్ణదేవరాయలు జిల్లాలోని శ్రీకాకుళంలో ఆముక్తమాల్యదను రచించారన్నారు. కవి సామ్రాట్ విశ్వనాధ సత్యనారాయణ విజయవాడ వాసి కావడం గర్వించదగ్గ విషయమన్నారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగువారికి మహోన్నత గౌరవాన్ని తెచ్చిన మహా వ్యక్తి ఎన్టీఆర్ అన్నారు.

డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. మంత్రి అఖిలప్రియ, ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్, జడ్పీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, భాషాపరిరక్షణ సంస్థ అధ్యక్షుడు హరికృష్ణ, కలెక్టర్ లక్ష్మీకాంతం, మేయర్ శ్రీధర్, డిప్యూటీమేయర్ గోగుల రమణ, మాజీ మేయర్ తాడిశకుంతల సాంస్కృతిక సంచాలకుడు డాక్టర్ డి విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పలువురికి సత్కారం...

గుంటూరు జిల్లాకు చెందిన రామ్‌మోహన్‌రాయ్, డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి, సహజకవి దుబ్బల దాసు, వి సింగారావు, విశాఖపట్నంకు చెందిన అచార్య చందుసుబ్బారావు రామతీర్థ, ప్రకాశం జిల్లాకు చెందిన శంకరనారాయణ, నెల్లూరుజిల్లాకు చెందిన ఆర్ అనంతపద్మనాభరావు, కృష్ణాజిల్లాకు చెందిన విహారి, కోకా విమలకుమారి, చిత్తూరు జిల్లాకు చెందిన దామోదరనాయుడు, పలమనేరు బాలాజీ, వి ఆర్ రాసాని, మునిరత్నం నాయుడు, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన మహదేవమణి, డాక్టర్ గూటంస్వామి, పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన రామతీర్థం, రసరాజు, ఎం ఆర్ వి సత్యనారాయణమూర్తి, హైదరాబాద్‌కు చెందిన తిరునగరి, చెన్నైకు చెందిన ద్రావిడదేశం కృష్ణారావు, శ్రీకాకుళం జిల్లాకు చెందిన రామారావు నాయుడు, విజయనగరం జిల్లాకు చెందిన కృష్ణాజీ. మల్లిపురం జగదీష్, అనంతపురం జిల్లాకు చెందిన జూపల్లి ప్రేమ్‌చంద్, పి రమేష్‌నారాయణ, రాధేయ, కడపజిల్లాకు చెందిన డి మస్తానమ్మ, వేంపల్లి షరీఫ్ తదితరులను మెమొంటో, దుశ్శాలువాలతో సత్కరించారు.

ధ్వనులతో పద్యపటిమ.

ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు మృదంగం, మోర్సింగ్, తబల తదితర ధ్వనులను అనుకరిస్తూ పద్య పటిమను ప్రదర్శించారు.

అవసరాల కన్యాకుమారికి సత్కారం

వయలనిస్టు అవసరాల కన్యాకుమారి అమరావతి రాగాన్ని రూపొందించించారు. సీఎం సీడీలను ఆవిష్కరించి ఆమెను సత్కరించారు. గిడుగు రామ్మూర్తి పంతులు వారసులను సీఎం సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

పాడనా తెలుగుపాట పరవశమయేలా... అనే పాటకు తెలుగులో చక్కటి సంగీతంతో స్వాగత నృత్యాన్ని లేఖ్య భరిణి, లక్ష్మీవాత్సల్యలు సప్పా శివ కుమార్ ఆధ్వర్యంలో నృత్యాలు ప్రదర్శించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు



సీఎం నుంచి అవార్డు అందుకుంటున్న ఈమని,జొన్నవిత్తుల,సింగారావు,దుబ్బలదాసు, కోకా విమలకుమారి



ఛాంపియన్ షిప్ సాధించిన తెలంగాణా మహిళా జట్టు

మహిళా ఛాంపియన్ తెలంగాణ

లబ్బీపేటస్పోర్ట్స్ : నగరంలోని దండమూడి రాజగోపాలరావు ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న సెపక్‌తక్రా ఛాంపియన్ షిప్ పోటీల్లో టీమ్ ఈవెంట్‌లో మహిళా విభాగంలో తెలంగాణా, పురుషుల విభాగంలో తమిళనాడు జట్టులు విజయం సాధించాయి. పురుషుల విభాగంలో ఏపీ ద్వితీయ స్థానం, కేరళ, గోవా జట్లు సంయుక్తంగా మూడవ స్థానం కైవసం చేసుకున్నాయి. మహిళా విభాగంలో గోవా రెండవ స్థానం, ఏపీ, కేరళ జట్లు మూడవ స్థానంలో నిలిచాయి. మగళవారం జరిగిన మ్యాచ్‌ల ఫలితాలలో పురుషుల విభాగంలో కేరళపై 3-0తో ఏపీ, గోవాపై 3-0తో తమిళనాడు, కర్ణాటకపై 2-1 తో ఏపీ, తెలంగాణాపై 3-0తో తమిళనాడు, కర్ణాటక పై 3-0తో కేరళ, తెలంగాణాపై 3-0తో గోవా జట్లు విజయం సాధించాయి. సెమీ ఫైనల్స్‌లో కేరళపై 2-0తో తమిళనాడు, గోవాపై 2-0తో ఏపీ జట్లు గెలుపొంది ఫైనల్‌కు చేరాయి. ఫైనల్స్‌లో ఏపీ పై 2-0తో తమిళనాడు విజయం సాధించగా, మహిళల విభాగంలో ఫైనల్స్‌కు చేరిన తెలంగాణా, గోవా జట్లు తలపడగా తెలంగాణా జట్టు విజయం సాధించింది.



పురుషుల విభాగంలో రెండవ స్థానంలో ఏపీ జట్టు

బాబుకు బుద్దా అభినందన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

నంద్యాల ఉప ఎన్నికల ఫలితాల్లో టీడీపీ విజయ దుందుభి మోగించిన నేపథ్యంలో విజయవాడ అర్బన్ టీడీపీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న మంగళవారం సీఎం చంద్రబాబును కలిసి అభినందించారు. మంగళవారం వెంకన్న తాడేపల్లిలోని సీఎం నివాసానికి వెళ్లారు. నంద్యాల ఎన్నికల ఫలితం తనకు ఎంతో సంతృప్తిని కలిగించిందని సీఎంతో బుద్దా వెంకన్న చెప్పారు.

నంద్యాల స్ఫూర్తి రానున్న రోజుల్లో కూడా కొనసాగుతుందని చెప్పారు. పార్టీని అభివృద్ధి చేయటానికి మరింతగా కష్టపడాలని సీఎం చంద్రబాబు, బుద్దా వెంకన్నకు సూచించారు.



సీఎం బాబుకు బొకే అందజేస్తున్న బుద్దా వెంకన్న

తెలంగాణలో లేని అభ్యంతరం ఇక్కడెందుకు?

విజయవాడ : ఆర్ఎంపీలు, పీఎంపీలకు తగిన శిక్షణ ఇచ్చి వారిచేత గ్రామీణ ప్రాంతాలలో వైద్యసేవలను మెరుగు పరుస్తామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ చెప్పారు. మంగళవారం విజయవాడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్ఎంపీలకు శిక్షణ ఇవ్వడంపై ఐఎంఏ వైద్యులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు కదా అని ప్రశ్నించగా.. తెలంగాణలో 2015లోనే ఆర్ఎంపీలు, పీఎంపీలకు శిక్షణ ఇచ్చి గ్రామీణ వైద్య సేవలను మెరుగుపరిచేందుకు జీవో ఇచ్చి అమలు చేస్తున్నారని, అక్కడి లేని అభ్యంతరం ఇక్కడి వైద్యులకు ఎందుకని ప్రశ్నించారు. ఐఎంఏ వైద్యులతో సమావేశం జరిపి.. వారికి అన్ని విషయాలను వివరిస్తామని అన్నారు. ఆర్ఎంపీలు, పీఎంపీలకు ఆరు నెలల పాటు ప్రాథమిక వైద్యంపై శిక్షణ ఇస్తామని, వారు మూడు నెలలపాటు ఆస్పత్రులలో, మరో మూడు నెలలు క్షేత్రస్థాయిలో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. శిక్షణ దశలవారీగా ఇవ్వడానికి ప్లాన్ చేస్తున్నామని చెప్పారు. ఆర్ఎంపీలు, పీఎంపీలు ఇప్పుడు కూడా వైద్యం చేస్తున్నారని.. అయితే తగిన గుర్తింపు లేకుండా వారు చేసే వైద్యానికి చట్టబద్ధత ఉండదని స్పష్టం చేశారు. యాంటీ బయోటిక్స్ ఇచ్చేటప్పుడు, ఇతరత్రా ట్రీట్‌మెంట్‌లు వారు ఇప్పుడు చేయకూడదని, అదే చట్టబద్ధమైన శిక్షణ ఉన్నట్లయితే గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలు మెరుగుపడతాయని చెప్పారు.

ఆలయ సంస్కృతి మహోన్నతమైనది

తాడేపల్లి టౌన్ : సనాతన ధర్మం, ఆలయ సంస్కృతి మహోన్నతమైనదని అర్చక ట్రైనింగ్ మిషన్, అకాడమీ డైరెక్టర్ డాక్టర్ వేదాంతం రాజగోపాల చక్రవర్తి అన్నారు. సీతానగరంలోని సీత ప్రాంగణంలో శిల్ప శాస్త్ర విషయాలపై అవగాహన కల్పించేందుకు అవసరమైన పాఠ్యప్రణాళికలు రూపొందించేందుకు అర్చక ట్రైనింగ్ అకాడమీ ఆధ్వర్యంలో రెండు రోజుల శిల్ప శాస్త్ర సదస్సు మంగళవారం ప్రారంభమైంది. ఈ సదస్సుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దేవాదాయ శాఖ డిప్యూటీ స్తపతులు, అసిస్టెంట్ స్తపతులు, శిల్పి డ్రాఫ్ట్‌మెన్‌లు, శిల్పిట్రేసర్లు హాజరు కాగా, ముఖ్య అతిథిగా రాష్ట్ర దేవాదాయ శాఖ స్తపతి పీ.పరమేశ్వరప్ప విచ్చేశారు. అర్చక ట్రైనింగ్ అకాడమీ డైరెక్టర్ రాజగోపాల చక్రవర్తి మాట్లాడుతూ ఆలయాల్లో వివిధ అంశాలతోపాటు ఆలయ వాస్తు, శిల్ప సంబంధమైన విషయాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామని, అందుకు అవసరమైన పాఠ్యాంశాలు స్తపతులు తెలియజేయాలని కోరారు. సదస్సులో ఆలయ వాస్తు సక్రమంగా వున్న ప్రాచీన ఆలయాలను పునరుద్ధరణ సందర్భంలో శిల్ప శాస్త్రాన్ని, ఆలయ వాస్తును అనుసరించకపోవడం వలన కలుగుతున్న ఇబ్బందులు సదస్సులో ప్రస్తావనకు వచ్చాయి. రాష్ట్ర దేవాదాయ శాఖ స్తపతి పరమేశ్వరప్ప మాట్లాడారు.

తెలుగు భాష, సంస్కృతిని

భావితరాలకు అందించాలి

సత్యనారాయణపురం : వేల సంవత్సరాల చరిత్ర కలిగిన తెలుగు భాష, సంస్కృతిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత నేటి తరంపైన ఉందని రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి సీఈవో విజయభాస్కర్ అన్నారు. భాష, సాంస్కృతిక శాఖ, జె.ఎం.ఎస్ యోగా భారత ఆధ్వర్యంలో సత్యనారాయణపురం ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం విద్యార్థులకు సుమతి శతకం పఠనం, నృత్యప్రదర్శన నిర్వహించారు. తొలుత విజయభాస్కర్ జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన తెలుగు భాష ఔనత్యాన్ని వివరించారు. తెలుగుభాష, సంస్కృతి అభివృద్ధికి అనేక మంది కృషి చేశారన్నారు. నేడు వివిధ కారణాలతో తెలుగు భాషను ప్రక్కన పెడుతున్నారన్నారు. భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. లిపిలేని సవర భాషకు లిపిని తయారు చేసిన ఘనత గిడుగు రామ్మూర్తి పంతులుకు దక్కుతుందన్నారు. వ్యవహారిక భాషోద్యమం ద్వారా సామాన్యులకు భాషను అందుబాటులో తీసుకు వచ్చిన ఘనుడు గిడుగు అని కొనియాడారు. అనంతరం 250 మంది విద్యార్థులు సుమతీ శతకం పఠనంలో పాల్గొన్నారు. జె.ఎం. ఎస్ విద్యార్థులు తెలుగు భాషా వైభవం అంశంగా ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్.ఈమని శివనాగిరెడ్డి, సినీ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, మృదంగ విద్వాంసులు ఎం.విజయకుమార్, గోళ్ల నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభిస్తున్న సీఈవో విజయభాస్కర్

సబ్సిడీ రుణాలకు అర్హత లబ్ధిదారుల ఎంపిక

విజయవాడ రూరల్ : ప్రభుత్వ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలకై లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమాన్ని పూర్తి చేసినట్లు ఎంపీడీవో కొడాలి అనురాధ తెలిపారు. లక్ష్యానికి మించి అర్హత కలిగిన లబ్ధిదారులను మండల స్థాయి కమిటీ ఎంపిక చేసినట్లు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం విలేకర్లతో ఆమె మాట్లాడారు. 2017-18 సంవత్సరానికి ప్రభుత్వం 435 మందికి సబ్సిడీ రుణాలు అందించాలని నిర్ణయించింది. కాగా మండలస్థాయి కమిటి 693 మందిని ఎంపిక చేసినట్లు చెప్పారు. ఎంపికైనవారి వివరాలు మండలంలోని బ్యాంకులకు పంపినట్లు ఆమె వివరించారు.



మత్స్య సొసైటీ అధ్యక్షులు బత్తుల సురేష్‌ను సన్మానిస్తున్న సభ్యులు

సమష్టి కృషితో సొసైటీని అభివృద్ధి చేసుకోవాలి

గన్నవరం: గన్నవరం మత్స్య సహకార సంఘం నూతన కమిటీ ఏకగ్రీవం కావడంతో మంగళవారం దళితవాడలో అభినందన సభ నిర్వహించారు. నూతన కమిటీ సభ్యులను పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు తిరివీధి రంగారావు మాట్లాడుతూ సమిష్టిగా పనిచేసి సొసైటీని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ రుణాలు అందరికీ అందేలా కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు బత్తుల సురేష్, నిడమర్తి చిన్నారావు, నల్లమోతు నాని, షేక్ కరీముల్లా, బుజ్జారావు, భిక్షాలు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

చైన్‌స్నాచర్ల కోసం గాలింపు

హనుమాన్‌జంక్షన్: బాపులపాడు పంచాయతీ కార్యాలయం వద్ద మహిళ మెడలో నుంచి నానుతాడు లాక్కుపోయిన అగంతకుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సంఘటనపై పంచాయతీ రోడ్డులో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల పుటేజ్‌లను పరిశీలించిన పోలీసులు యువకులను పట్టుకునేందుకు బృందాలను ఏర్పాటు చేశారు. జంక్షన్‌లో చైన్‌స్నాచర్ల ఆగడాలను అరికట్టేందుకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పేకాటరాయుళ్లపై దాడులు

హనుమాన్‌జంక్షన్: బాపులపాడులో పేకాటరాయుళ్లపై జంక్షన్ ఎస్సై బెజవాడ తులసీధర్ దాడులు నిర్వహించారు. పేకాడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని రూ.2,100 నగదు స్వాధీనం చేసుకున్నారు.



వీరవల్లిలో గణపయ్య గ్రామోత్సవం

వీరవల్లిలో గణనాథుని నిమజ్జనం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడుమండలం వీరవల్లిలో గణపయ్య గ్రామోత్సవాన్ని నిర్వహించారు. మంగళవారం మాజీ సర్పంచ్ అమృతపల్లి సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఊరేగింపును చేపట్టారు. యాదవ బజారులో వినాయకచవితి సందర్భంగా ఏర్పాటుచేసిన గణపతి ప్రతిమను ఏర్పాటు చేశారు. ఐదురోజుల పూజల అనంతరం ఆయనను ఏలూరు కాలువలో నిమజ్జనం చేసేందుకు ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో గోళ్ల శ్రీమన్నారాయణ, ధర్మవరపు వెంకటేశ్వరరావు, కొలుసు బాజి తదితరులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

రంగన్నగూడెంలో మీ భూమి మీఇంటికి

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం రంగన్నగూడెంలో మీఇంటికి మీభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం బాపులపాడు తహసీల్దార్ కె.గోపాలకృష్ణ పాల్గొన్న ఈ కార్యక్రమంలో నాలుగు పట్టాదార్ పాస్‌పుస్తకాలను అందించారు. మరో నాలుగు పొజిషన్ సర్టిఫికెట్లు, ఆరు కౌలురైతు కార్డులు అందించారు. 23 అర్జీలు అందినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర జలవనరులశాఖ ఎఫెక్స్ కమిటీ సభ్యుడు ఆళ్ల వెంకటగోపాలకృష్ణ, గ్రామసర్పంచ్ నత్తా ప్రసన్నరావు, ఆర్ఐ నండూరి ప్రసాద్ పాల్గొన్నారు.

పీఆర్ఎఈగా ఉమా నియామకం

విజయవాడ రూరల్ : విజయవాడ రూరల్ మండల పరిషత్‌కు పంచాయతీరాజ్ ఏఈగా జి.ఉమా నియామితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఏఈ పోస్టు ఖాళీగా వుండడంతో జి.కొండూరు ఏఈ శ్రీనివాస్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ నుంచి పదోన్నతులపై ఏఈగా ఉమా నియమితులయ్యారు.

ఆర్వోబీపై ప్రయాణం.. భయం భయం

● మచిలీపట్నం-కల్లూరు హైదరాబాద్ రహదారిపై గుంతల మయం



ఫ్లైవోవర్ పై భారీ గుంతలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: మచిలీపట్నం నుంచి నూజివీడు-కల్లూరు మీదుగా హైదరాబాద్ ప్రయాణించే ఆర్వోబి వంతెన ఇది. ఈ వంతెనపై ప్రయాణించాలంటేనరకమే. ఆర్వోబిపై ప్రయాణం క్షణంక్షణం భయమే. బాపులపాడు-నూజివీడు రైల్వే ఫ్లైవోవర్‌బ్రిడ్జి పరిస్థితి ఇది. సుమారు 200 మీటర్లు పొడవువున్న ఈ ఆర్వోబీని సుమారు దశాబ్దం క్రితం నిర్మించారు. ప్రతి రెండు సంవత్సరాలకు పరిరక్షణ నిమిత్తం మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. ప్రతినిత్యం మచిలీపట్నం, గుడివాడ, హనుమాన్‌జంక్షన్ నుంచి వందలాది వాహనాలతో పాటు భారీ వాహనాలు ప్రయాణిస్తుంటాయి. దీనికితోడు వంతెన ఆవలివైపు 20గ్రామాల ప్రజలు నిత్యం హనుమాన్‌జంక్షన్‌కు పనులపై రాకపోకలు సాగిస్తుంటారు.

ఇంత ప్రధానమైన వంతెనపై సిమెంట్, ఫ్లోరింగ్ కిందవున్న ఇనుపచువ్వలు సైతం బయటపడేంత పెద్దగుంతలు ఏర్పడటంతో తరచూ ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. ద్విచక్రవాహనదారులు అధికశాతం ప్రమాదాలకు గురై ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. సిమెంట్ దిమ్మల మధ్యన ఉన్న ఐరన్ గడ్డర్లపై రబ్బర్లు పూర్తిగా తొలగిపోయి ఐరన్‌గడ్డర్లు ఒంగిపోయి గుంతలు ఏర్పడ్డాయి. అధికారులు స్పందించి తక్షణమే వంతెనకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



సిమెంట్ దిమ్మల వద్ద ఐరన్ గడ్డర్లు భయటపడి గుంతలుపడిన బాపులపాడు ఆర్వోబీ

గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలి

● మండల సమావేశంలో ఎమ్మెల్యే వంశీ

● గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలి

● అల్లాపురం పైలెట్ ప్రాజెక్టుపై పర్యవేక్షణ లేదు

● సమావేశంలో ప్రజాప్రతినిధుల ఆరోపణ





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీ. హాజరైన ప్రజా ప్రతినిధులు, అధికారులు

గన్నవరం: మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం సర్వసభ్య సమావేశం ఎంపీపీ పట్రా కవిత అధ్యక్షతన జరిగింది. ఆయా శాఖల అధికారులు తమ కార్యాకలాపాలను వివరించారు. అల్లాపురం పైలెట్ ప్రాజెక్టుపై పర్యవేక్షణ లేదని సర్పంచ్ అనగాని రవి అన్నారు. కాంట్రాక్టర్ కాల పరిమితి ముగిసినప్పటికీ మళ్లీ కాంట్రాక్ట్ పిలవలేదన్నారు. లైబ్రరీ సెస్సు పంచాయతీలు చెల్లిస్తున్నప్పటికీ భవన ప్రారంభానికి సర్పంచ్‌లను ఆహ్వానించకపోటంపై అసహనం వ్యక్తం చేశారు. మొక్కల పెంపకం స్కీమ్ అధికారుల నిర్లక్ష్యం వలన స్కామ్‌లా మారిందని సర్పంచ్‌లు ఆరోపించారు. వెలుగు అధికారులు మొక్కలు నాటి వదిలేయటంతో చనిపోతున్నాయని రక్షణ కవచాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు అందరూ హాజరు కాకపోవటంతో ఎమ్మెల్యేకి ప్రజా ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. సమావేశానికి హాజరు కాని అధికారులకు నోటీసులు జారీ చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీ మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ గ్రామాల అభివృద్ధికి విశేష కృషి చేస్తుందన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రోడ్లను, శ్మశానాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ పొట్లూరి బసవరావు, వైస్ ఎంపీపీగొంది పరందామయ్య, ఎంపీడీవో వై.ఇందిరా ప్రియదర్శిని, తహసీల్దారు ఎం.మాధురీ, ఈవోపీఆర్డీ వివిస్ జాన్సన్, సూపరింటెండెంట్ చిన రాట్నాలు తదితరులు పాల్గొన్నారు.





రన్ ఫర్ రివర్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న అతిథులు. ర్యాలీ చేస్తున్న వైద్య విద్యార్థులు, వైద్యులు

జీవనదుల సంరక్షణలో భాగస్వాములు కావాలి

చిన అవుటపల్లి(గన్నవరం): జీవనదులను సంరక్షించేందుకు ఈషా ఫౌండేష్ చేపట్టిన యజ్ఞంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యులు కావాలని ఫౌండేషన్ అధికార ప్రతినిధి జోగులాంబ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ర్యాలీ ఫర్ రివర్స్‌పై అవగాహన సదస్సు జరిగింది. జోగులాంబ మాట్లాడుతూ 365 రోజులు కళకళలాడుతూ గలగల పారే నదులు సైతం నేడు అడుగంటిన పరిస్థితి కనిపిస్తుందన్నారు. ఇలానే ఉంటే 2030 నాటికి నీటి కష్టాలు ఉధ్రుతమౌతాయన్నారు. అడవులను పరిరక్షించటంతో పాటు వ్యవసాయదారులు పండ్ల పంటలపై ఆసక్తిని పెంపొందించాలన్నారు. కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈషా ఫౌండేషన్ మంచి కార్యక్రమాన్ని తీసుకుందని చెప్పారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతమైన పర్యావరణంతో పాటు నీటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం పోస్టర్ విడుదల చేసి ర్యాలీ నిర్వహించారు.

కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పిఎస్ఎన్ మూర్తి, హెల్త్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కొల్లి శ్రీకరుణమూర్తి, మెడికల్ సూపరింటెండెంట్ చందర్, నర్సింగ్ కళాశాలల కన్వీనర్ వీరపనేని శశికళ, డాక్టర్ రవికుమార్, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పోటీతత్వంతోనే చదువులో రాణింపు

ఎంఈవో బీజీ మార్గరెట్

గన్నవరం: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకుంటేనే చదువులో రాణించగలరని ఎంఈవో బిజి మార్గరెట్ అన్నారు. స్థానిక గ్రేడ్-1 గ్రంథాలయంలో మంగళవారం మండల స్థాయిలో క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు గ్రంథాలయ అధికారి కె.నాగరాజు అధ్యక్షత వహించారు. ఎంఈవో మాట్లాడుతూ చిన్ననాటి నుంచే పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలన్నారు. అనంతరం సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో వెలగపూడి ప్రసాదరావు, చిమట రామారావు, ఆనందకుమార్, శ్రీరాం, శ్రీనివాస్, తాతారావు, పార్వతీదేవి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో బీజీ మార్గరెట్

ముగిసిన రెవెన్యూ గ్రామసభలు

హనుమాన్‌జంక్షన్: బాపులపాడు మండలంలో మంగళవారంతో రెవెన్యూగ్రామసభలు ముగిశాయని, తహసీల్దార్ కలగర గోపాలకృష్ణ తెలిపారు. మండలంలో మొత్తం 631మంది ప్రజలు గ్రామసభలో అర్జీలు పెట్టుకున్నారన్నారు. ఇందులో అత్యధికంగా మల్లవల్లి గ్రామంలో 65 అర్జీలు వచ్చాయన్నారు. అడంగల్ తప్పుల సవరణకు 590 అర్జీలు వచ్చాయన్నారు. గ్రామసభల్లో 120 పట్టాదార్ పాస్‌పుస్తకాలను రైతులకు అందజేశామన్నారు. సెప్టెంబర్ మొదటివారంలోనే సమస్యలపై అర్జీలుపెట్టిన వారికి పరిష్కారపత్రాలు అందజేస్తామన్నారు.

మాతృభాష మనుగడను కాపాడుదాం

హనుమాన్‌జంక్షన్: ప్రాచీన గ్రాంధిక భాషను అభిమానించే రోజుల్లో తెలుగువారి కావ్యభాష పలు అలంకారాలకు అలవాలమై పండిత జనులకు ఆమోదయోగ్యంగా ఉండేది. దీంతో ప్రజలకోసం రాసే రచనలు అన్ని వ్యవహారిక భాషలోనే రాయాలంటూ గిడుగు రామ్మూర్తి పంతులు వ్యవహారిక భాషా ఉద్యమం నడిపి తెలుగుభాషా సాహిత్యానికి విశేష కృషిచేశారు. తెలుగువ్యవహారిక భాషకు ఎనలేని సేవచేసి గుర్తింపు తెచ్చిన గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి రోజున భాషాదినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నాం. ఇతరభాషల వ్యామోహం వల్ల తెలుగుభాష గొప్పతనం తగ్గిపోతుందని, భాష ఆధునికతకు కృషిచేసి తెలుగువెలుగులు అద్దాలని పలువురు 'ఆంధ్రజ్యోతి'కి తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

శుభపరిణామం


లలితాకామేశ్వరి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయిని



తెలుగువ్యవహారిక భాషకు ఎనలేని కృషిచేసిన గిడుగు రామ్మూర్తి జయంతి రోజున భాషాదినోత్సవం నిర్వహించటం ఆనందదాయకం. ప్రజలకోసం చేసే రచనలు అన్ని వ్యావహారిక భాషలో రాయాలి. కొన్నివిద్యాసంస్థల్లో తెలుగులో మాట్లాడితే అపరాధ రుసుం వసూలు చేయడం దురదృష్టకరం.

భాషను పరిరక్షించుకోవాలి

సీతారామానుజాచార్యులు, పూజారి, హనుమాన్‌దేవాలయం



అందమైన లిపితో కూడిన మధురమైన తెలుగుభాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత తెలుగువారందరిపై ఉంది. పోరాటం చేసి ప్రాచీనభాష హోదాను ఆచరణలో విస్తరింప చేయాలి. మన అక్షరాన్ని మనం మర్చిపోకుండా ఉండాలంటే భాషలో సౌందర్యం, సౌభాగ్యం చనిపోకుండా చూసుకోవాలి.

తెలుగులోనే సమాచారం

కెఎన్‌వీ జయకుమార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, హనుమాన్‌జంక్షన్



పోలీస్‌స్టేషన్‌లలో ఛార్జ్‌షీట్, రిమాండ్ రిపోర్టు వంటివి ఆంగ్లంలోనే ఉంటాయి. కక్షిదారులతో కేసుల విషయం చర్చించేటప్పుడు తెలుగులో అర్థమయ్యే రీతిలో మాట్లాడాలని సిబ్బందికి సూచిస్తున్నాం. ప్రజలనుంచి వచ్చేఫిర్యాదులను తెలుగులో రాసేలా ప్రోత్సహిస్తున్నాం.

భాషను సరళీకరించిన గిడుగు

గన్నవరం: భాషను సరళీకరించి, ప్రజలపరం చేసిన భాష సంస్కర్త గిడుగు రామమూర్తి పంతులు అని ప్రముఖ కవి అరసవల్లి కృష్ణ అన్నారు. స్థానిక వీకేఆర్ కళాశాలలో తెలుగు బాష దినోత్సవం సందర్భంగా తెలుగు విభాగం ఆధ్వర్యంలో మంగళవారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వ జాతికి లిపి, వ్యాకరణం తయారు చేసి ఇచ్చిన శాస్త్రవేత్త గిడుగు జయంతి రోజును తెలుగు బాష దినోత్సవంగా జరుపుకోవటం గొప్ప విషయమన్నారు. అనంతరం తెలుగు సబ్జెక్టులో 99 మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.వెయ్యి చొప్పున తెలుగు విభాగాధిపతి డాక్టర్ కాకుమాని శ్రీనివాసరావు అందజేశారు. కళాశాల ఏడి డాక్టర్ కొడాలి రాజేశ్వరీ, ప్రిన్సిపాల్ డి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



గన్నవరం వీకేఆర్ కళాశాల కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రముఖ కవి అరసవల్లి కృష్ణ



రేమల్లె జడ్పీ స్కూల్లో పద్యాల పోటీలు నిర్వహిస్తున్న అధ్యాపకులు

రేమల్లెలో పద్యాల పోటీలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం రేమల్లెలో మాతృభాష దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పద్యాల పోటీలు నిర్వహించారు. ముందుగా గిడుగు రామ్మూర్తి గురించి అధ్యాపకులు వివరించారు.తెలుగులో వాడుకభాష ఉద్యమ పితామహుడిగా పేరుగడించారని విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. జూనియర్స్ విభాగంలో 6, 7 తరగతుల్లో 20మంది విద్యార్థులు, సీనియర్స్ విభాగంలో 8, 9, 10 తరగతుల్లో 15మంది పోటీల్లో పాల్గొన్నారని ఉపాధ్యాయులు దారపురెడ్డి భాస్కర్‌రావు తెలిపారు. సిహెచ్ పూజిత ప్రథమ, కె.అనిల్ ద్వితీయస్థానంలో నిలిచారని, సీనియర్స్ విభాగంలో పి.సిద్దార్ధ, డి.సునీల్ ప్రథమ, ద్వితీయస్థానాలు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయురాలు వెంకటేశ్వరిదేవి ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు జరిగాయి.

చైతన్యటెక్నోలో తెలుగుభాషా దినోత్సవం

హనుమాన్‌జంక్షన్: స్థానిక నూజివీడురోడ్డులో చైతన్య టెక్నోస్కూల్లో మంగళవారం తెలుగుభాషా దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. తెలుగుభాష గొప్పతనాన్ని చాటిచెబుతూ పలువురు విద్యార్థులు పాటలు పాడి కనువిందు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కె.వి రమేష్ మాట్లాడుతూ తెలుగుభాషకు వన్నెతీసుకువచ్చిన గిడుగురామ్మూర్తిపంతులు జయంతి రోజున తెలుగుభాషాదినోత్సవం జరుపుకోవడం అదృష్టమన్నారు. కార్యక్రమంలో ఏవో రమణ, డీన్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మూలకొట్టు సెంటర్‌లో గణనాథునికి పూజలు

హనుమాన్‌జంక్షన్: స్థానిక విజయవాడరోడ్డులోని మూలకొట్టు సెంటర్లో టీడీపీ నాయకుడు వీరమాచినేని బుజ్జి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుడి విగ్రహానికి భక్తులు విశేషపూజలు నిర్వహిస్తున్నారు. హనుమాన్‌జంక్షన్ పట్టణంలో పలుప్రాంతాల్లో ఏర్పాటుచేసిన వినాయకచవితి పందిళ్ళలో గడిచిన ఐదురోజులుగా సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహిస్తున్నారు. హనుమాన్‌నగర్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుడి విగ్రహానికి అధ్యక్షుడు లంకా సాంబశివరావు పదకొండున్నర కేజీల లడ్డూని బహూకరించారు. మంగళవారం భక్తులకు అన్నదానం చేశారు.



వీఎన్‌పురంలో ధనవినాయకుడు

గన్నవరం: మండలంలోని పలు గ్రామంలో గణనాథునికి ప్రత్యేక అలంకరణలు చేసి విశేష పూజలు చేస్తున్నారు. కేసరపల్లి శివారు వీఎన్‌పురం కాలనీలో నగదుతో గణపతయ్యను అలంకరించి పలువురు దంపతులు ప్రత్యేక పూజలు జరిపారు. రవి, సాల్మన్, దుర్గా, స్వామి, వెంకటప్పయ్య, బుజ్జి ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్థానిక హిందూధార్మిక మండలి ప్రాంగణంలో గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో పూజలు జరుగుతున్నాయి. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. సమితి కార్యదర్శి తుమ్మల మురళీ కృష్ణ, మండవ వెంకట ప్రభాకరరావు, పసుమర్తి సుధాకర్, టిఎస్‌ఆర్‌కె ప్రసాద్, పోలవరపు గోపాలకృష్ణ, బాలయ్య, జాస్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే వంశీ

అధికారుల సమష్టి కృషితోనే అభివృద్ధి

గన్నవరం: అభివృద్ధికి అధికారులందరూ సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ సూచించారు. తన కార్యాలయంలో రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇతర అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీ మాట్లాడుతూ గ్రామాల్లో అంతర్గత రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్హులైన వారందరికి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేసిందన్నారు. పేదలకు ఇచ్చే స్థలాలలో తాత్కాలికంగా గ్రావెల్ రోడ్లు నిర్మించేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. దీనిలో అధికారులందరూ భాగస్వామ్యం కావాలని చెప్పారు. లేఅవుట్లను పూర్తిచేసి త్వరితగతిన రోడ్లు నిర్మించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ పొట్లూరి బసవరావు, తహసీల్దారు ఎం.మాధురీ, పంచాయతీ రాజ్ డీఈ అక్కినేని వెంకటేశ్వరరావు, ఏఈ దేవాది బాబూరావు, టీడీపీ మండల అధ్యక్షులు పడమట సురేష్, అల్లాపురం , సూరంపల్లి సర్పంచ్‌లు అనగాని రవి, దేవరపల్లి కోటేశ్వరరావు, రాజులపాటి శ్రీనివాసరావు, పాల్గొన్నారు.



రహదారి మార్జిన్ తవ్విన గుంతలోకి వెళ్లిన బస్సును క్రేన్‌తో తీస్తున్న దృశ్యం

రహదారి పక్కకు వస్తే.. ప్రమాదమే

● **జాతీయ రహదారి రోడ్డు మార్జిన్లు తవ్వి వదిలేశారు**

ఉంగుటూరు: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా చినఅవుటపల్లి రింగు నుంచి గుండుగొలను వరకు, పెద్ద అవుటపల్లి నుంచి హనుమాన్ జంక్షన్ వరకు రోడ్డు మార్జిన్లు తవ్వారు. అయితే గుత్తెదారుకు ప్రభుత్వానికి ఏర్పడిన సమన్వయ లోపం కారణంగా పనులు నిలిచిపోయాయి. ఈ క్రమంలో నిత్యం రాకపోకలు సాగించే వాహన చోదకులు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం ఆదివారం తెల్లవారు జామున విజయవాడ-గోకవరం బస్సు ఏలూరు వైపు వెళుతూ పొట్టిపాడు టోల్‌ప్లాజా వద్ద ప్రమాద వశాత్తు ఎడమవైపు పక్కనే ఉన్న గుంతలోకి వెళ్లింది. డ్రైవర్ అప్రమత్తతతో ప్రమాదం తప్పింది. ఇప్పటికైనా జాతీయ రహదారి నిర్వాహణ అధికారులు ఆరు లైన్ల విస్తరణ జరిపే లోపు మార్జిన్ల వెంబడి రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేసి, మలుపుల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఉమామహేశ్వరపురంలో డ్రైనేజిని ప్రక్షాళన చేస్తున్న పంచాయతీ సిబ్బంది

ఉమామహేశ్వరపురంలో పారిశుధ్య పనులు

● **ప్రత్యేక పరీక్షలు చేపట్టిన వైద్య బృందం**

● **అంటు వ్యాధుల నివారణకు చర్యలు**

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడుమండలం కోడూరుపాడు పంచాయతీపరిధిలోని ఉమామహేశ్వరపురం గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఇటీవల గ్రామంలో అంటు వ్యాధులు ప్రబలడంతో వైద్యబృందం ప్రత్యేక పరీక్షలు చేపట్టింది. అనంతరం గ్రామాన్ని బాపులపాడు తహసీల్దార్ గోపాలకృష్ణ, రెవెన్యూ బృందం పరిశీలించారని పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు వివరించారు. స్థానికంగా ఉన్న ఆర్‌ఎంపీ వైద్యులతో ఎక్కువ మోతాదు మందుతో ఇంజక్షన్ చేయించుకోవడం వల్ల కీళ్ల నొప్పులు వస్తున్నాయని దీంతో అంటురోగాలు ప్రబలుతున్నాయని ఆయన వివరించారు.

అత్తింటి వారిపై వేధింపుల కేసు

కానూరు (పెనమలూరు): వివాహితను పుట్టింటి నుంచి అధిక సొమ్ము తీసుకురమ్మని వేధిస్తున్న అత్తింటి వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం కానూరుకు చెందిన మద్దెల సుభాషిణిని గుంటూరు జిల్లాకు చెందిన పాండురంగారావు 2015లో వివాహం చేసుకున్నాడు. అప్పుడు అల్లుడికి లాంఛనాలు సమర్పించారు. గత ఏడాది సుభాషిణి ఒకే కాన్పులో ఇద్దరు ఆడ పిల్లలకు జన్మనిచ్చింది.

కొద్దికాలం తరువాత భర్త పాండు రంగారావు, అత్త పద్మ, మామ వెంకటేశ్వరరావు, మరిది రవిచంద్ కలిసి అధిక సొమ్ము కోసం వేధిస్తున్నారు. పుట్టింటికి పంపడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.



క్రీడాకారులకు జ్ఞాపికలు అందిస్తున్న పరమేష్

క్రీడాకారులను ప్రోత్సహించాలి

కానూరు (పెనమలూరు/ పెనమలూరు రూరల్): హాకీ, క్రికెట్, షటిల్ తదితర క్రీడాకారుల వల్ల దేశానికి ప్రపంచ స్థాయిలో గుర్తింపు లభించిందని మంచినేని ట్రస్టు చైర్మన్ పరమేష్ పేర్కొన్నారు. హాకీ క్రీడా మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి, క్రీడా దినోత్సవం సందర్భంగా కానూరులో మంగళవారం క్రీడా జ్యోతి వెలిగించి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు ఎంత ప్రోత్సాహం కల్పిస్తే అంతస్థాయిలో దేశానికి పేరు ప్రతిష్ఠ లు సాధించగలుగుతామన్నారు. క్రీడాకారులకు గ్రామీణ స్థాయి నుంచి ప్రో త్సాహం కల్పించాలన్నారు. ప్రతి పండుగకు గ్రామాల్లో క్రీడా పోటీలు నిర్వహించి ప్రోత్సాహ బహుమతులు అందించాలని తమ ట్రస్టు నిర్ణయించిందన్నారు. అనం తరం బాడీబిల్డింగ్‌లో ఉత్తమ క్రీడాకారులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్ర మంలో దాత అన్నే శివనాగేశ్వరరావు, ఖాదర్, బోయపాటి కృష్ణ స్వామి, కమల, మురళి, రాజేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న ఈవోఆర్డీ సీతారామరాజు

పీఆర్ఐఎస్ సర్వే ప్రారంభం

పెనమలూరు/ పెనమలూరు రూరల్: మండలంలోని పది గ్రామాల్లో ప్రతి ఇంటి డేటాను ఆన్‌లైన్‌లో పొందుపర్చేందుకు పీఆర్ఐఎస్ సర్వే చేపడుతున్నట్లు ఈవోఆర్డీ సీతారామరాజు తెలిపారు. ఆయా గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది, ప్రైవేట్ టీమ్‌తో వర్క్ చేయిస్తున్నట్లు చెప్పారు. జియో ట్యాగింగ్ ప్రకారం ఇంటి వైశాల్యం, పొడవు, వెడల్పు, డ్రెయినేజీ, మరుగుదొడ్ల వివరాలను పొందుపర్చుతున్నామన్నారు. సర్వే పూర్తయిన తరువాత ఇంటికి కొత్త ఎస్ఎస్, డోర్ నంబర్లు ఇస్తామన్నారు. మండలంలో 45 వేల అనధికార ఇళ్లు ఉన్నట్లు తేలిందని, వాటిని కూడా గుర్తించి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చుతామన్నారు. ఇప్పటికే కానూరు, యనమలకుదురు, పోరంకి, పెనమలూరు, గోసాల, వణుకూరు, తాడిగడప గ్రామాల్లో సర్వే ప్రారంభించి పది శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. మరో 15 రోజుల్లో సర్వే పూర్తిచేసి జిల్లా యంత్రాంగానికి నివేదిక అందిస్తామన్నారు. గ్రామాల్లో సర్వే సిబ్బంది ఇళ్లకు వచ్చినప్పుడు ఇంటి యజమానులు సహకరించి వివరాలు అందించాలని సూచించారు.

గొయ్యి పూడ్చారు

కానూరు (పెనమలూరు రూరల్): కానూరు ప్రధాన రహదారిపై పీవీపీ సిద్ధార్థ కళాశాలకు వెళ్లే మార్గం ప్రారంభంలో ఏర్పడిన అతిపెద్ద గొయ్యిని పంచాయతీ సిబ్బంది మంగళవారం పూడ్చివేశారు. నాణ్యత లేకుండా రహదారిని నిర్మించడంతో అతి పెద్ద గుంత ఏర్పడి వర్షం కురిసినపుడు అందులో నీరు నిలుస్తుంది. వాహనదారులు గమనించక అందులో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. పంచాయతీ కార్యదర్శి అప్పలనరసమ్మ స్పందించి ప్రమాదాలు జరుగకుండా మరమ్మతులు చేపట్టారు.





విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న తుమ్మలపల్లి హరికృష్ణ



కవులు, రచయితలు, ఉపన్యాసకులను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

తియ్యనైనది తెలుగు భాష

కంకిపాడు: పంచదార కన్నా... పాల మీగడ కన్నా తెలుగు భాష మధుర మైనదని దస్తావేజు లేఖరుల సంక్షేమ సం ఘం రాష్ట్ర అధ్యక్షుడు, తుమ్మలపల్లి పరమేశ్వర చారిటబుల్ ట్రస్టు చైర్మన్ తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా స్థానిక జడ్పీ హైస్కూ ల్‌లో విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పెద్ద బాలశిక్ష అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తెలుగు పదాలే చెవిన పడేవన్నారు. మారుతున్న పరిస్థితుల్లో తెల గు స్థానంలో పర భాషా ప్రమేయం పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయులు గీతా గాయత్రి, టి.ఎస్.పి.ముదర్జిలను ఘనంగా సత్కరించారు. హెచ్ఎం వి.పూర్ణ చంద్రరావు, స్కూల్ సెక్రటరీ తోట సాంబశివరావు పాల్గొన్నారు. మద్దూరు జడ్పీ హైస్కూల్‌లో జరిగిన తెలుగు భాషా దినోత్సవంలో సర్పంచ్ వల్లె నరసింహారావు, ఏఎంసీ డైరెక్టర్ యనమదల వెంకటేశ్వరరావు, హెచ్ఎం శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరులో..

ఉయ్యూరు: స్థానిక రామకృష్ణా రిక్రియేషన్ క్లబ్ ఆడిటోరియంలో రోటరీ క్లబ్, సరస భారతి ఆధ్వర్యంలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. గిడుగు రామమూర్తి చిత్రపటానికి క్లబ్ చైర్మన్ ఎస్.సంపత్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు భాష గొప్పతనం గురించి పలువురు మాట్లాడారు. అనంతరం కవి, రచయిత బి.వెంకటరామారావు, తెలుగు ఉపన్యాసకుడు జి.వేణుగోపాలరెడ్డి, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం కార్యదర్శి చలపాక ప్రకాష్, సరస భారతి కార్యదర్శి మాదిరాజు శివలక్ష్మిలను సత్కరించారు. క్లబ్ సెక్రటరీ అనీస్, అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ తిరుమలరావు, జె.శ్యామలాదేవి, అల్‌రియాజ్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



వక్తృత్వ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఉయ్యూరు పబ్లిక్ స్కూల్‌లో..

ఉయ్యూరు పబ్లిక్ స్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు అక్షరాలను తయారు చేసి వాటిలో రకరకాల ఆకారాల్లో పిల్లలను నిలబెట్టి అక్షరాలు చదివించారు. తెలుగు భాష గొప్పదనాన్ని స్కూల్ డైరెక్టర్ ఎం.కె.బాబు విద్యార్థులకు వివరించారు.

కానూరులో..

కానూరు (పెనమలూరు రూరల్): తెలుగు భాష 2400 సంవత్సరాల పూర్వమే ఆవిర్భవించిందని కేసీపీ సిద్ధార్థ ఆదర్శ రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సి పాల్ డాక్టర్ కె.భవన్నారాయణ అన్నారు. పాఠశాలలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2008లో తెలుగుకు ప్రాచీన భాష హోదా లభించిందన్నారు. శ్రీకృష్ణ దేవరాయులు తెలుగు భాషకు పట్టం కట్టి దేశ భాషలందు తెలుగు లెస్స అని ప్రశంసించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నీతి పద్యాలు, నీతి కథలు, దేశ భాష లందు తెలుగు లెస్స అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

2030 వరకు టీడీపీకి ఎదురులేదు

పెనమలూరు: రాష్ట్రంలో 2030 వరకు టీడీపీకి ఎదురులేదని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. నంద్యాల, కాకినాడ ఉప ఎన్నికల ప్రచారాన్ని ముగించుకొని మంగళవారం ఆయన స్వగ్రామం చేరుకున్నారు. కానూరు నుంచి పోరంకి వరకు అభిమానులు ఎమ్మెల్యేని ఘనంగా స్వాగతించి ర్యాలీ నిర్వహించారు. పోరంకి పార్టీ కార్యాలయంలో కేక్ కోసి కార్యకర్తలకు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ చేస్తున్న అభివృద్ధికి రాష్ట్ర ప్రజలు ఆకర్షితుల య్యారని, జగన్ పార్టీని ప్రజలు ఆదరించడం లేదన్నారు. 2019 ఎన్నికల్లో జగన్ పార్టీ కనుమరుగైపోతుందన్నారు. ఎన్నికల ఫలితాల తరువాత కాంగ్రెస్‌లో విలీనం చేసి జగన్ శేషజీవిత జైలులో గడుపుతారన్నారు. టీడీపీ నేతలు కోయా ఆనందప్రసాద్, అనుమోలు ప్రభాకరరావు, బొగ్గవరపు శ్రీనివాసరావు, వెలగపూడి శంకరబాబు, కొండవీటి శివాజీ, వల్లభనేని నాని, రియాజుద్దీన్ గోరా, మరుపూడి ధనకోటేశ్వరరావు, తోటకూర సుబ్బారావు పాల్గొన్నారు.

ఇంటి పన్నుల బకాయిలు చెల్లించాలి

ఈవోఆర్డీ సీతారామరాజు

పెనమలూరు: ఈ ఏడాది ఇంటి పన్నుల బకాయిలను యజమానులు వెంటనే చెల్లించాలని ఎరియర్స్ ఉంటే వాటిపై వచ్చే ఏడాది జరిమానా విధిస్తామని ఈవోఆర్డీ సీతారామరాజు తెలిపారు. పది గ్రామాల్లో రూ.11 కోట్ల వరకు ఇంటి పన్నులు వసూళ్లు చేయాల్సి ఉండగా రూ.9.20 కోట్లు (82 శాతం) వసూళ్లు జరిగాయని ఇంకా 18 శాతం బకాయిలు ఉన్నాయన్నారు. కొందరు విదేశాల్లో ఉండటం, మరికొందరు చెల్లించలేకపోవడం ఎరియర్స్ కింద నమోదు చేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా బకాయిలు ఉన్న యజమానులు పంచాయతీ కార్యాలయంలో చెల్లించి రసీదు పొందాలన్నారు. లేనిపక్షంలో ఎరియర్స్ కింద వచ్చే ఏడాది ఇంటి పన్నుతో పాటు అధనంగా జరిమానా విధిస్తామన్నారు. మూడేళ్లు పన్ను చెల్లించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

ఇళ్ల ముందు నిలిపిన రెండు బైక్‌లు చోరీ

కానూరు (పెనమలూరు): ఇంటి ముందు నిలిపిన బైక్‌లు మాయమైనట్లు అందిన ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం కానూరుకు చెందిన మహ్మద్ ఇబ్రహీం తన బైక్‌ను ఇంటి ముందు పార్క్‌చేసి మరుసటి రోజు చూడగా కనిపించలేదు.

సనత్‌నగర్‌కు చెందిన సైకం రమేష్ తన బైక్‌ను ఆదివారం రాత్రి పార్క్ చేసి మరుసటి రోజు చూడగా మాయ మైంది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నలుగురికి జైలు, జరిమానా

ఉయ్యూరు: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన కేసులో నలుగురికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ ఉయ్యూరు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీకాంత్ మంగళవారం తీర్పు చెప్పారు.

ఇద్దరికి రెండు రోజుల జైలు రూ.2 వేల జరిమానా, మరో ఇద్దరికి ఒక రోజు జైలు రూ.2 వేల జరిమానా విధించారు.

ఆంధ్రజ్యోతి
పెనమలూరు
5
విజయవాడ • బుధవారం 30 ఆగస్టు 2017
• పెనమలూరు • కంకిపాడు • ఉయ్యూరు



ఉయ్యూరు రైతు బజార్ ధరలు

టమాటా 30, వంకాయలు 25/22, బెండకాయలు 12, మిర్చి 19, కాకరకాయలు 12, బీరకాయలు 14, క్యాబేజి 19, క్యారెట్ 46, దొండకాయలు 18, బంగాళదుంపలు 14, ఉల్లిపాయలు 20, గోరుచిక్కుడు 18, దోసకాయలు 12, సొర కాయ 10/12, పొట్లకాయ 12/10, అరటికాయ 8/7, చిక్కుడు 44/28, చామదుంపలు 25, ములగకాయ ఒకటి 6/5, కంద 24, ఆకుకూరలు కట్ట 2, బీట్‌రూట్ 27, కీరదోస 21, బీన్స్ 53, క్యాప్సికమ్ 46, చిలగడ దుంప 28, కొత్తిమీర కట్ట 12/16, పుదీనా 3/7, ముల్లంగి 8, బజ్జీమిర్చి 22, నిమ్మ కాయలు డజను 16/14 (నిన్నటివి)

విద్యాశాఖ ఉన్నతాధికారులు అనుసరిస్తున్న విధి విధానాలతో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల్లో అయోమయం నెలకొంది. ఇప్పటికే సకాలంలో బిల్లులు రాక అవస్థలు పడుతున్న నిర్వాహకులపై కోడిగుడ్లు భారం మోపారు. ఏజెన్సీల నుంచి మూడు రోజులు గుడ్లు పంపిణీ చేస్తూ నిర్వాహకులకు ఇచ్చే బిల్లుల్లో ఆరు రోజులకు కోత విధించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో పథకం నిర్వాహకులు గుడ్లు తేలేస్తున్నారు.



భోజన పథకం నిర్వాహకుల్లో అయోమయం

గుడ్లు తేలేస్తున్నారు..!

పెట్టుబడులు చెల్లించడంలో ఆలస్యం



వారానికి మూడు గుడ్లు పెట్టి.. ఆరు రోజులకు కోత

కంకిపాడు


మండలంలోని వివిధ గ్రామాల్లో జిల్లా పరిషత్, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలు మొత్తం 57 ఉన్నాయి. వీటిలో సుమారు 4868 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అందులో సుమారు మూడు వేల మంది విద్యార్థులు ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. అయితే ఇటీవల పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం భారమైందని, మెస్ చార్జీలు పెంచాలన్న నిర్వాహకుల కోరిక మేరకు ప్రభుత్వం ఒక రూపాయి పెంచింది. ప్రస్తుతం ప్రతి విద్యార్థికి రూ.6.48 మేరకు ప్రభుత్వం చెల్లిస్తుంది. అలాగే వారానికి రెండు గుడ్లు బదులు మూడు గుడ్లు పెట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రతి గుడ్డుకు రూ.2.35 చెల్లించాలని నిర్వాహకులకు సూచించారు. బహిరంగ మార్కెట్‌లో గుడ్డు ధర అధికంగా ఉండటంతో ఏజెన్సీల ద్వారా ప్రభుత్వం రూ.2.35కే అందించటంతో నిర్వాహకులు ఆనందపడ్డారు. అయితే వారానికి అందిస్తున్న మూడు గుడ్ల స్థానంలో నిర్వాహకుల నుంచి ఆరు గుడ్లకు బిల్లులు కట్ చేయాలని జిల్లా ఉన్నతాధికారుల నుంచి మండల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు అందాయి. అక్కడ నుంచి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు నోటీసులు జారీ అయ్యాయి. దీంతో ఒక్కసారిగా మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు గుడ్లు తేలేశారు.

డీఈవో దృష్టికి తీసుకెళ్లాం



గుడ్ల సమస్యను డీఈవో దృష్టికి తీసుకెళ్లాం. పెరిగిన నిర్వహణ ఖర్చులను దృష్టిలో పెట్టుకొని మూడు రోజుల గుడ్లకు ఆరు రోజులు ఖర్చు తగ్గించడం అన్యాయమే అవుతుంది. జిల్లా స్థాయి లో జరిగే సమావేశంలో గుడ్ల సమస్యపై చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటాం.
- కనకమహాలక్ష్మి, ఎంఈవో

తొందరపాటు నిర్ణయం



ప్రభుత్వ విధి విధానాల వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజులు గుడ్లు అందజేస్తూ ఆరు రోజులకు బిల్లులు పెట్టడం దురదృష్టకరం. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలి. లేకుంటే కార్మికుల తరఫున ఉద్యమిస్తాం.
పంచకర్ల రంగారావు, సీపీఎం మండల కార్యదర్శి

ఆరు రోజుల సొమ్ము వసూలా ?



ప్రభుత్వం రూ.2.35కే గుడ్డు ఇస్తుందని ఆనందంగా ఉన్నాం. మూడు రోజుల పాటు విద్యార్థులకు అందజేస్తున్నాం. మూడు రోజుల గుడ్డుకు ఆరు రోజులు వసూలు చేయాలనడం సరికాదు.
- యలమంద
మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుడు



శానిటేషన్ అధికారికి సూచనలిస్తున్న చైర్మన్ పూర్ణచంద్రరావు

పారిశుధ్యంపై అశ్రద్ధ వద్దు

ఉయ్యూరు: పట్టణంలో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని శానిటేషన్ అధికారి సూర్యచంద్రరావును నగర పంచాయతీ చైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు ఆదేశించారు. శ్రీనగర్ కాలనీలో పారిశుధ్య సమస్యపై 'దోమకుట్టిందో మంచమెక్కాల్సిందే' శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన కథనానికి చైర్మన్ స్పందించారు. మంగళవారం శానిటేషన్ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాలు కురుస్తున్న తరుణంలో పట్టణంలో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మురుగు కాల్వల్లోపూడిక తీయించాలన్నారు. కో-ఆప్షన్ సభ్యుడు నజీర్ పాల్గొన్నారు.



సొసైటీని రద్దు చేయాలని కోరుతున్న సభ్యులు

ఫిషర్‌మెన్ సొసైటీని రద్దు చేయాలి

గొడవర్రు (కంకిపాడు): గొడవర్రులో ఇటీవల నిర్వహించిన ఫిషర్‌మెన్ సొసైటీ ఎన్నికను రద్దు చేయాలని కలెక్టర్‌ను కలిసి విన్నవించినట్లు సొసైటీ సభ్యుడు ఎం.సీతారామయ్య తెలిపారు. స్థానికంగా మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం గొడవర్రులో ఫిషర్‌మెన్ సొసైటీ ఎన్నికలు అసంబద్ధంగా జరిగాయన్నారు. తక్షణం ఎన్ని కలను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. ఈ సమావేశంలో సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

బురదకయ్యగా రైతు బజారు



రైతు బజార్‌లో నిలిచిన వర్షపు నీరు

ఉయ్యూరు: చినుకు పడిందంటే ఉయ్యూరు రైతు బజార్ బురద కయ్యగా తయారవడంతో వినియోగదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. చిన్నపాటి వర్షానికి సైతం ఆవరణలో నీరు నిలిచి చెరువును తలపించడమే కాకుండా నీరుపోయే మార్గం లేక బురద మయవుతోంది. దీనికితోడు మిగిలిన కూరగాయలు, చెత్త అక్కడే వేయడంతో కుళ్లి దుర్గంధం రావడంతో లోనికి వెళ్లేందుకు వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. లోపల షెడ్లలోని స్టాల్స్ ముందు నీరునిలిచి నడిచేందుకు సైతం వీలు లేకపోవడంతో రైతు బజార్‌కు రావాలంటే వినియోగదారులు భయపడిపోతున్నారు.

డంపింగ్ యార్డులా ఆర్ అండ్ బీ రహదారి

చినఓగిరాల (ఉయ్యూరు): చిన ఓగిరాల - తోట్లవల్లూరు ఆర్ అండ్ బీ రహదారి చెత్తకుప్పలతో నిండి డంపింగ్ యార్డులా తయారైంది. పంచాయతీ పారిశుధ్య సిబ్బంది గ్రామంలో రోడ్లు శుభ్రపరచి చెత్తను గ్రామం వెలుపల రహదారి పక్కన వేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతం చెత్తకుప్పలతో నిండి డంపింగ్ యార్డులా ఉంటుంది. చెత్తతోపాటు, జంతు కళేబరాలను ఇక్కడే పడవేయడంతో కుళ్లి పరిసర ప్రాంతాలకు దుర్గంధం వ్యాపిస్తోంది.



తోట్లవల్లూరు రోడ్డు వెంట వేసిన చెత్త



ప్రొద్దుటూరు బీసీ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

మురుగు సమస్య తక్షణం పరిష్కరించాలి

ప్రొద్దుటూరు (కంకిపాడు): ప్రొద్దుటూరులో మురుగు నీటి సమస్యను తక్షణం పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ప్రొద్దుటూరు బీసీ కాలనీలో మంగళవారం సీపీఎం నాయకులు పర్యటించారు. స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి పంచకర్ల రంగారావు మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షానికి ప్రొద్దుటూరులో పల్లపు ప్రాంతాలు నీట మునిగాయన్నారు. మురుగు నీరు పారుదలకు పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. పంచాయతీ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు ఈడా కోటేశ్వరరావు, తాడంకి నరేష్ పాల్గొన్నారు.



ఎంపీపీకి వినతిపత్రం సమర్పిస్తున్న పీఈటీలు

వాకింగ్ ట్రాక్‌పై గొయ్యిని పూడ్చాలి

• ఎంపీపీకి పీఈటీల వినతి

కంకిపాడు: పునాదిపాడు జడ్పీ హైస్కూల్‌లో వాకింగ్ ట్రాక్‌పై ఏర్పడిన గొయ్యిని పూడ్పించాలని వ్యాయామోపాధ్యాయులు ఎంపీపీ దేవినేని రాజాకు మంగళవారం విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పీఈటీలు ప్రసాద్, రవీంద్రబాబు మాట్లాడుతూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారని, అయితే ఉపాధి హామీ పథకంతో ఈ పనులకు మ్యాచ్ చేయడంతో ఉపాధి కూలీలు ఇష్టానుసారం తవ్వి వదిలేశారన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎంపీపీ ఉపాధి హామీ పథకం అధికారులను పిలిపించి మాట్లాడారు. తక్షణం గొయ్యి పూడ్పించాలని ఆదేశించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో వేమూరి వెంకట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే డైరీ



ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ బుధవారం నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం ప్రజలకు కార్యాలయంలో అందుబాటులో ఉంటారు.

ఎమ్మెల్సీ డైరీ



ఎమ్మెల్సీ వెంకన్న బుధవారం నగరంలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం ప్రజలకు కార్యాలయంలో అందుబాటులో ఉంటారు.

క్లిక్.. పోస్ట్ Click.. Post

వన్‌టౌన్, కుమ్మరిపాలెం, విద్యాధరపురం, భవానీపురం, కబేళా, పాలప్రాజెక్టు, కొత్తపేట, చిట్టినగర్, పాతరాజరాజేశ్వరిపేట, కేదారేశ్వరపేట తదితర ప్రాంతాల్లో సమస్యలు మీ దృష్టికి వచ్చిన వెంటనే ఫొటో తీసి వాట్సాప్ ద్వారా ఆంధ్రజ్యోతికి పంపవచ్చు. మీ పేరు, ప్రాంతం తప్పనిసరిగా తెలియజేయాలి.
వాట్సాప్ నెంబర్ 9700255566 -చిట్టినగర్

పార్కుల అభివృద్ధికి ముమ్మర చర్యలు



పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఏఈ ప్రసన్నను కోరుతున్న కార్పొరేటర్ కనకదుర్గ



కేఎల్‌రావు పార్కుకు ఎల్ఈడీ బోర్డ్



ఆట పరికరాలను పరిశీలిస్తున్న అధికారులు

చిట్టినగర్ : పార్కుల అభివృద్ధికి ముమ్మరంగా చర్యలు తీసుకుంటున్నారు. పశ్చిమలోని పార్కులను మంగళవారం ఉద్యానశాఖ అధికారులు పరిశీలించారు. కె.ఎల్.రావు పార్కులో పాడైన ఆట పరికరాలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. రూ.2లక్షలతో పాడైన పరికరాలకు మరమ్మతులు చేపట్టడానికి పనులు ప్రారంభించాలని అధికారులు కాంట్రాక్టర్‌కు సూచించారు. మూడేళ్ల క్రితం సుమారు రూ.10లక్షలతో జింబోసింగ్(పెద్ద ఊయ్యాల) జింబోసీసా(బ్యాలెన్స్ రాడ్), మల్టీప్లే ఏర్పాటు చేశారు. అయితే వాటి చుట్టూ కంచె ఏర్పాటు చేసి కొంతకాలం ఆ పరికరాలను వినియోగించక పోవడంతో తుప్పుపట్టి పాడయ్యాయి. ఇటీవల పార్కులో సుమారు రూ.25లక్షలతో బోటింగ్ కెనాల్, ప్యాచ్ వర్క్ తదితర అభివృద్ధి పనులను వీఎంసీ అధికారులు చేపట్టారు. దీంతో సందర్శకులు పెరగటంతో వారికి పూర్తి స్థాయిలో ఆహ్లాదాన్ని అందించడానికి చర్యలు తీసుకున్నారు. దీంతో పార్కు నూతన శోభ సంతరించుకోనుంది.

విద్యుత్ కాంతులతో ఎల్ఈడీ బోర్డు

సందర్శకులను ఆకర్షించేలా పార్కు ఎంట్రన్స్ సోమవారం నగరపాలక సంస్థ అధికారులు ఎల్ఈడీ బల్బులతో కొత్తగా బోర్డు ఏర్పాటు చేశారు. దీంతో బోర్డు చుట్టూ వెదజల్లే కాంతులు సందర్శకులను ఆకర్షిస్తున్నాయి.

లక్షన్నరతో మరో రెండు నూతన బోట్లు

బోటింగ్ కెనాల్‌లో ఏర్పాటు చేసిన రెండు బోట్లు సందర్శకులకు సరిపోకపోవడంతోపాటు, ఆది వారం, సెలవు దినాలలో సందర్శకులు ఎక్కువ బోటు షికారు చేయడానికి ఉత్సాహం చూపుతున్నారు. దీంతో ఉన్న బోట్లు చాలక కొంతమంది సందర్శకులు వెళ్లిపోతున్నారు. వీరికి పూర్తి స్థాయిలో ఆహ్లాదాన్ని అందించేలా సుమారు రూ.లక్షన్నరతో మరో రెండు బోట్లు వారంలో పార్కుకు చేరనున్నాయి.

రెండు రోజుల్లో ఓపెన్ జిమ్

పార్కుకు వచ్చే సందర్శకులకు ఆహ్లాదంతోపాటు, మానసిక ఉల్లాసాన్ని అందించేలా పార్కులో సుమారు రూ.10లక్షలతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. దాన్ని రెండు రోజుల్లో ప్రారంభించడానికి నగరపాలక సంస్థ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

పార్కుకు పూర్వ వైభవం తీసుకొస్తాం

పార్కుకు పూర్వం వైభవం తీసుకురావడానికి అభివృద్ధి చేస్తున్నామని వీఎంసీ ఉద్యానవన శాఖ ఏడీహెచ్ ప్రదీప్‌కుమార్ అన్నారు. మంగళవారం



కొత్తగా ఏర్పాటుచేసిన జిమ్

కె.ఎల్.రావుపార్కు, మరుపిళ్ల చిట్టి పార్కు, సిండికేట్ బ్యాంక్ కాలనీలోని చిల్డ్రన్స్ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను డీఈ ఎ.ఎన్.ఎస్.ప్రసాద్, ఎ.ఇ. ప్రసన్న, స్థానిక టీడీపీ నేతలతో కలసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కె.ఎల్.రావు పార్కులో పాడైన ఆట పరికరాలను వినియోగంలోకి తీసుకురావడానికి మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. మరుపిళ్ల చిట్టి పార్కులో గ్రీనరీ అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకున్నామని తెలిపారు. సిండికేట్ బ్యాంక్ కాలనీలోని చిల్డ్రన్ పార్కులో ఇప్పటికే వాకింగ్ ట్రాక్ నిర్మించామని, త్వరలో చిన్నారులు ఆడుకునేందుకు ఐదు రకాల ఆట పరికరాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గుర్రం కొండా, నాగోతి రామారావు, పోతినేడి లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని ఆట పరికరాల ఏర్పాటుకు కృషి

పాతబస్తీలో ఎక్కువ శాతం పేద మధ్యతరగతి చెందిన వారే ఉన్నారు. వారికి పూర్తి స్థాయిలో ఆహ్లాదాన్ని అందించేలా పార్కును తీర్చిదిద్దుతున్నాం. ప్రస్తుతం ఉన్న ఆట పరికరాలతోపాటు రెండేళ్ల పైబడిన చిన్నారులకు పలు ఆట పరికరాలు ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే అనుమతి కోరాం. అనుమతి వచ్చిన వెంటనే సుమారు 10 రకాల ఆట పరికరాలను ఏర్పాటు చేసేలా కృషి చేస్తా.
- కనకదుర్గ, కార్పొరేటర్

విజయగణపతిగా బాలగణపతి



వన్‌టౌన్ : చవితి ఉత్సవాల్లో భాగంగా పూజారి వారి వీధిలోని బాలగణపతి మందిరంలో మంగళవారం విజయగణపతిగా దర్శనమిచ్చారు. గద్దం రామ్మోహనరావు భక్త బృందం 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. సాయంత్రం బాలగణపతి మందిరం మహిళా సంఘం ఆధ్వర్యాన అటుకులతో నైవేద్యం (స్వీట్, హాట్) పోటీలు జరిగాయి. అనంతరం సుసర్ల నందిని శ్రీనివాస్ శిష్య బృందం చేసిన వీణానాదం, గాత్ర కచేరి ఆకట్టుకున్నాయి. వెంకటేశ్వర భక్త సంఘం - సర్వాసరోజిని ఆధ్వర్యాన శివ, గణపతి సహస్రనామ పారాయణ, సంకీర్తనలు జరిగాయి. కార్యక్రమంలో మందిరం కమిటీ అధ్యక్షుడు గ్రంధి శ్రీనివాసు, ఎం.వేణుగోపాలరావు, ఎ.రాంబాబు, కె.వెంకటేశ్వరరావు, మహిళా మండలి సభ్యులు ఎ.శ్రీదేవి, గ్రంధి ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి భూపాల్‌రెడ్డి

కబేళా : చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ జి.భూపాల్‌రెడ్డి తెలిపారు. ఐరన్ యార్డు కార్యాలయంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన ముఠాకార్మికులకు మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సులో అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఏసమస్య ఉన్నా తమ వద్దకు వస్తే పరిష్కరిస్తామన్నారు. దీనికి ఫీజు కూడా అవసరం లేదని చెప్పారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తామన్నారు. టెక్నాలజీ పెరిగిన తరువాత చాలా మోసాలు జరుగుతున్నాయని చెప్పారు. ఎవరైనా ఫోన్ చేసి బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నాం మీ ఏటీఎం కార్డు నెంబర్ చెప్పండి అని అడిగినప్పుడు చెప్పవద్దని సూచించారు. దొంగతనాలు, చీటింగ్‌లు జరిగితే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఐరన్‌యార్డు ప్రధాన కార్యదర్శి కె.కామేశ్వరావు, ఎస్ఐ సలాం తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించితే చర్యలు

గుణదల : పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని ఆటోలు నడిపే వారిపై చర్యలు తీసుకుంటామని డీసీపీ క్రాంతి రాణా టాటా హెచ్చరించారు. సీపీ గౌతం సవాంగ్ ఆదేశాల మేరకు నగరంలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని ఆటోలు నడిపే వారిపై కేసులు నమోదు చేసేందుకు ట్రాఫిక్ పోలీసులు, రవాణాశాఖ అధికారులు సంయుక్తంగా నగరంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఇబ్రహీంపట్నం, కొత్తపేట, ఎంజీ రోడ్డు, కంకిపాడు, గన్నవరం, ఎనికేపాడు తదితర ప్రాంతాల్లో డ్రైవ్ నిర్వహించి పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న 45 ఆటోలను సీజ్ చేశారు. అలాగే 257 మంది ఆటోడ్రైవర్లకు ఈ-చలాన్లు, 267 ఆటోడ్రైవర్లకు ఈ-నోటీసులు అందజేశారు. ఆటోడ్రైవర్లు వాహనానికి సంబంధించిన ఇన్సూరెన్స్, పర్మిట్, సీబుక్, లైసెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లను విధిగా వారి వెంట ఉంచుకోవాలని డీసీపీ క్రాంతి రాణా టాటా తెలిపారు. ఎవరైనా ప్రయాణికులు వాహనంలో బ్యాగులు వదిలి వెళ్లిపోతే అటువంటి బ్యాగ్‌లను దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌లో అందజేయాలని కోరారు.

● రైలు నిండా ట్రాక్టర్లు



రోడ్లపై, పొలాల్లో ఉండాల్సిన ట్రాక్టర్లు రైలెక్కడేమంటని అనుకోకండి. ఇది నిజమే.. అదేంటంటే.. కేఎల్‌రావునగర్ వైపు రైల్వే అప్‌యార్డు ఉంది. ఇక్కడ నుంచి గూడ్స్‌కు లోడ్ చేస్తుంటారు. మంగళవారం ఇక్కడ నుంచి ట్రాక్టర్లను గూడ్స్ రైలులో ఇతర రాష్ట్రాలకు తరలించడానికి ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా ట్రాక్టర్లను ఇక్కడి నుంచి గూడ్స్‌పైకి ఎక్కించారు. ఆ సమయంలో ఆంధ్రజ్యోతి క్లిక్‌మనిపించింది. -చిట్టినగర్

ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడుకోవాలి

చిట్టినగర్: ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడుకునేందుకు తప్పక చిన్నారులకు తట్టు-రుబెల్లా టీకాలు వేయించాలని గౌతమ్ హైస్కూల్ డైరెక్టర్ ఎన్.సూర్యారావు అన్నారు. చిట్టినగర్ స్కూల్ ప్రాంగణంలో మంగళవారం విద్యార్థులకు తట్టు-రుబెల్లా టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ తొమ్మిది నెలల నుంచి 15సంవత్సరాల మధ్య వయసున్న పిల్లలకు టీకాలను వేయించాలని, సెప్టెంబర్ 8వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేత బలివాడ శివకుమార్ పట్నాయక్, స్కూల్ ఇన్‌చార్జీ పి.తులసీ, సునీత, ఎఎన్ఎంలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషను పరిరక్షించుకోవాలి

విద్యాధరపురం: విద్యాధరపురం, భవానీపురం, పాతబస్తీ ప్రాంతాల్లోని పాఠశాలల్లో మంగళవారం తెలుగు భాషాదినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని పాఠశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో అలరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ తెలుగు భాషను పరిరక్షించుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రపంచ భాషాలన్నిటిలో చక్కటి లిపితో రెండోస్థానంలో నిలిచిన భాష మన తెలుగు భాష, సుందర తెలుంగు అని తమిళకవి సుబ్రహ్మణ్య భారతి మెచ్చుకున్న తీరును కొనియాడారు. విద్యా ధరపురంలోని డీఎస్ఎంసీ హైస్కూల్, భవానీపు రం శివాల యం సెంటర్‌లో ఉన్న చైతన్య స్కూల్, పాతబస్తీ లోని ఎంఎస్ఆర్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్, తదితర ప్రాంతాల్లోని పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం జరిగింది

తమ్మిన పోతరాజు స్కూలులో

పాతరాజరాజేశ్వరి పేట : తెలుగు భాష అభివృద్ధికి ఎంతో కృషి చేసిన గిడుగు వెంకట రామమూర్తి జయంతి వేడుకలను మంగళవారం కంసాలిపేటలోని తమ్మిన పోతరాజు నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.

ఈ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ అల్లు జయలక్ష్మి గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి ఘనం నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు భాషను విస్తృతంగా ప్రచారం చేసిన ఘనత గిడుగు రామమూర్తికే దక్కుతుందన్నారు. తెలుగుభాషకు ఆయన చేసిన కృషిని గుర్తించి, ఆయన జయంతిని తెలుగుభాషా దినోత్సవంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం రవిశంకర్, ఉపాధ్యాయులు రఫీ, నాగేంద్రం, రాణి, నరసింహారావు, నాయకులు డి.వి. హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.


వివిధ వేషధారణలో చైతన్య విద్యార్థులు


రామమూర్తి చిత్రపటానికి దండ వేస్తున్న కార్పొరేటర్

బస్‌షెల్టర్ ఆక్రమణ..!

- రోడ్డు మధ్యలో ఆటోలు నిలుపుదల
- పాదచారులకు అంతరాయం
- పట్టించుకోని అధికారులు

వన్‌టౌన్ : పాతబస్తీలోని కాళేశ్వరరావు మార్కెట్ ఎదురుగా ఉన్న బస్‌షెల్టర్ ఆక్రమణకు గురవుతోంది. ఆటో డ్రైవర్లు రోడ్డు మధ్యలో ఆటోలు ఆపి ఇతర వాహనాలకు, పాదచారుల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నారు.

కేఆర్ మార్కెట్ ఎదురుగా ఉన్న బస్ షెల్టర్‌ను ఇరువైపులా వివిధ రకాల వ్యాపారులు ఆక్రమించుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీంతో బస్సులు కోసం నిలబడే ప్రయాణికులకు సరైన సౌకర్యం లేనందున అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొందరు డ్రైవర్లు రోడ్డు మధ్యలో ఆటోలు నిలుపుతున్నారు. దీంతో వెనుకవచ్చే వాహనదారులు, బస్ డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులు నిలబడటానికి వీలు లేకుండా బస్ షెల్టర్‌ను వ్యాపారులు ఆక్రమించుకున్నారు. సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంతో వ్యాపారులు యథేచ్ఛగా వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బస్ షెల్టర్‌ను ఆక్రమించి వ్యా పారం నిర్వహిస్తున్న వారిని ఖాళీ చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



బస్‌షెల్టర్ ఇరువైపుల స్థలాన్ని ఆక్రమించుకున్న వ్యాపారులు

చెత్త,వ్యర్థాలతో దుర్గంధం

- పట్టించుకునే వారే లేరు

కబేళా: స్థానిక హెచ్‌బీకాలనీ ఎంఐజీ 2 బ్లాక్ రోడ్డులో డ్రెయినేజీ ప్రక్కనే చెత్త వ్యర్థాలు వేయటంతో దుర్గంధం వెదజల్లుతోంది. స్థానికులు శానిటరీ సిబ్బందికి తెలిపినా ఇంత వరకు చెత్తను తొలగించలేదని కాలనీ వాసులు వాపోతున్నారు. ఈ రోడ్డున వెళ్లాలంటే ముక్కు మూసు కోని వెళ్లాలసిన పరిస్థితి చోటు చేసుకుంది. వ్యర్థాలతో ఈగలు, దోమలు వ్యాప్తి చెందుతున్నాయి.

వ్యర్థాల వద్ద కుక్కలు, పందులు చేరి చెల్లాచెదురు చేస్తున్నాయి. దీంతో వ్యర్థాలు డ్రెయినేజీలో పడుతున్నాయి. డ్రెయినేజీ వ్యవస్థ ఇప్పటికే అస్తవ్యస్తంగా ఉండటంతో ఇక్కడ అపరి శుభ్ర వాతావరణం చోటు చేసుకుంది. దాంతో మురుగు నీరు పారకుండా అక్కడే నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతోంది. ఇప్పటికైనా అధికారులు చెత్త, వ్యర్థాలను తొలగించాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.


డ్రెయినేజీ పక్కనే చెత్త, వ్యర్థాలు


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

మెగా వైద్య శిబిరం

విద్యాధరపురం : గవర్నరుపేటలోని భారత మహిళా మండలి ప్రాంగణంలో మంగళవారం మహిళలకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మణిపాల్ హాస్పటల్ వైద్య బృందం క్యాన్సర్ బ్రెస్ట్ స్క్రీనింగ్ టెస్ట్ 2డీఏకో, ఈసీజీ, బీఎండీ, బీపీ, షుగర్ పరీక్షలు, కార్డియాలజిస్ట్, ఆర్థోపెడిక్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో భారత మహిళా మండలి అధ్యక్షురాలు వి.అనురాధ, కమి టీ సభ్యులు సువర్లలక్ష్మి, ఉమా దేవి పాల్గొన్నారు.


చప్టాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ధ్వంసమైన చప్టాలు తొలగింపు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

చిట్టినగర్: కేటీరోడ్డు మధ్యలో ప్రధాన వాటర్ పైపులైన్ వాల్ వద్ద ధ్వంసమైన చప్టాలను మంగళవారం నగరపాలక సంస్థ అధికారులు మార్చి కొత్తవి ఏర్పాటు చేశారు. సోమవారం 'చప్టాలు ధ్వంసంతో ప్రమాదాలు' శీర్షికతో ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనానికి స్పందించి నీటి సరఫరా విభాగం అధికారులు ఆయా ప్రాంతంలో నూతనంగా చప్టా రాళ్లను వేశారు. దీంతో అటుగా రాకపోకలు సాగించే వాహనచోదకులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.


సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎంపీ కేశినేని

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

విద్యాధరపురం : ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను బాధితులకు ఎంపీ కేశినేని నాని మంగళవారం తన కార్యాలయంలో వేర్వేరుగా అందజేశారు. 27వ డివిజన్ పరిధి భవానీపురానికి చెందిన అబ్దుల్ ఖాదర్‌కు రూ. 70, 000, వై.రమణమ్మకు రూ. 30,000 చెక్కులను ఇచ్చారు. 28వ డివిజన్ పరిధి భవానీపురం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన లంకా శశిభూషణ్‌రావుకు రూ.1,15,846 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు షేక్ హబీబుల్లా, యేదుపాటి రామయ్య, పార్టీ సీనియర్ నేత గన్నె వెంకటనారాయణ ప్రసాద్ (అన్న), మాధవ తదితరులు పాల్గొన్నారు.

వనిత కార్డుతో పది శాతం రాయితీ

కబేళా: ప్రియదర్శిని కాలనీ కమ్యూనిటీహాల్లో వనిత ఫ్యామిలి పక్షోత్సవంలో భాగంగా మంగళవారం ఏపీఎస్ ఆర్టీసీ విద్యాధరపురం డిపో ఆధ్వర్యంలో క్యాంపు నిర్వహించారు. డిపో మేనేజర్ గిరిబాబు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తెల్లరేషన్ కార్డు ఉన్నా ప్రతి ఒక్కరూ వనిత కార్డును తీసుకుంటే కుటుంబం మొత్తం ప్రయాణం చేసేటప్పుడు పది శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. ఈ కార్డు తీసుకున్నవారికి రెండు సంవత్సరాల కాలపరిమితి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ అశోక్‌కుమార్, రాంబాబు, ఎం.జె. అయ్యప్ప వి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


వనితా కార్డులు అందజేస్తున్న ఆర్టీసీ సిబ్బంది



ఎమ్మెల్యే డైరీ

ఎమ్మెల్యే ఉమామహేశ్వరరావు బుధవారం నగరంలో ఉంటారు. పలు డివిజన్లలో కార్యక్రమాలకు హాజరవుతారు. సాయంత్రం ప్రజలకు అందుబాటులో ఉంటారు.



ఎమ్మెల్సీ డైరీ

ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న బుధవారం పలు కార్య క్రమాల్లో పాల్గొంటారు. అనంతరం ఆయన కార్యాలయంలో అందుబాటులో ఉంటారు.

అంతన్నారు.. ఇంతన్నారే..!

యువతకు అందుబాటులో మోడల్ జిమ్ వస్తోందని అధికారులు ఊదరగొట్టారు.. అంతన్నారు.. ఇంతన్నారు.. ఇంకేముంది అధునాతన పరికరాలతో వ్యాయామం చేయడమే ఆలస్యమని కొత్త రాజీవ్‌నగర్ యువత అనుకుంది. శాఖల మధ్య సమన్వయ లోపంతో మోడల్ జిమ్ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ఇవి ఎప్పుడు పూర్తవుతాయోనని స్థానికులు ఎదురుచూస్తున్నారు.



మోడల్ జిమ్ అండీ.. తాళాలు వేశారండీ..

ఉన్నా ఉపయోగం లేదు



జిమ్‌లో ఏర్పాటుచేసిన పరికరాలు

పాయకాపురం : పాయకాపురం 58వ డివిజన్‌లో రూ.10 లక్షల వ్యయ అంచనాతో ప్రయోగాత్మకంగా చేపట్టిన మోడల్ జిమ్ ఏర్పాటు పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. నగరంలోనే మొట్టమొదటిసారిగా మోడల్‌జిమ్ ఏర్పాటు చేయబోతున్నామని ఊదరగొట్టిన అధికారులు ఇప్పుడు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదు. నగరపాలక సంస్థ శాఖల మధ్య సమన్వయలోపంతో ప్రారంభించకుండానే మూతపడిందని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

సగం పనులతో సరి

కొత్త రాజీవ్‌నగర్‌లో వీఎంసీకి చెందిన ఖాళీస్థలంలో మోడల్ జిమ్ ఏర్పాటుకు రెండు నెలల క్రితం శంకుస్థాపన జరిగింది. ఏపీ అర్బన్ గ్రీన్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ నిధులతో నగరపాలక సంస్థ అగ్రికల్చర్ విభాగం అధికారులు పనులను చేపట్టారు. జిమ్‌కు సేకరించిన స్థలంలో ఫ్లోరింగ్ చేసి ఫెన్సింగ్ వేసి సర్వం సిద్ధం చేశారు. రెండు పరికరాలను కూడా ఏర్పాటు చేసి చూడటంతో స్థానిక యువత నుంచి మంచి స్పందన వచ్చింది.

గేటు ఏర్పాటు చేస్తాం

మోడల్ జిమ్ ప్రాంగణానికి గేటు ఏర్పాటు చేయనున్నాం. రూ.85వేలుతో గ్రౌండ్ అభివృద్ధి, గేటు ఏర్పాటుకు అంచనాలు రూపొందించాం. వారం, పదిరోజుల్లో పనులు ప్రారంభిస్తాం.

- రామారావు, ఏఈ, వీఎంసీ

- **ప్రారంభించని మోడల్ జిమ్**
- **రెండు నెలలు గడిచినా పార్కుకు చేరని పరికరాలు**
- **రాజీవ్‌నగర్ వాసుల నిరాశ**

పరికరాలు పంపడంలేదు

ఇక్కడ మొత్తం పది వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా రెండు మాత్రమే బిగించారు. మిగిలినవి వీఎంసీ కార్యాలయంలో మూలుగుతున్నాయి. అధికారులు జిమ్ ప్రాంగణానికి తాళంకూడా వేయడంతో దీని ప్రారంభంపై స్థానికుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ఎప్పుడు అందుబాటులోకి తీసుకువస్తారోనని స్థానికులు ఎదురు చూస్తున్నారు.

శాఖల మధ్య సమన్వయలోపం

మోడల్ జిమ్ ప్రారంభం కాకపోవడానికి నగరపాలక సంస్థ అధికారుల మధ్య సమన్వయలోపమే కారణంగా తెలుస్తోంది. పరికరాలు పంపకుండా అగ్రికల్చర్ విభాగం అధికారులు అలసత్వం ప్రదర్శిస్తుండగా, పరికరాలకు భద్రత కల్పించే విషయమై ఇంజనీరింగ్ విభాగం అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారు. జిమ్ ఏర్పాటు చేసే ప్రాంగణానికి గేటు లేదని పరికరాలకు భద్రతలేని చోటుకు పంపబోమని అగ్రికల్చర్ విభాగం అధికారులు భీష్మించుకున్నారు. గేటు ఏర్పాటు విషయంలో ఇంజనీరింగ్ అధికారులు అదిగో ఇదిగో అంటూ నెట్టుకొస్తున్నారు.

ప్రైవేటు జిమ్‌ల్లో రేటెక్కువ



ప్రైవేటు జిమ్‌లకు వెళ్లాలంటే ఫీజులు ఎక్కువగా ఉన్నాయి. సామాన్యులు వెళ్లలేని పరిస్థితి. అదే కార్పొరేషన్ జిమ్ అయితే ఖర్చు ఉండదు. మోడల్ జిమ్‌ను ప్రారంభిస్తే అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడుతుంది.

-మల్లేశ్వరరావు, స్థానికుడు

వినియోగంలోకి తేవాలి



స్థానికంగా ఎలాంటి జిమ్‌లు లేక యువత నగరంలోకి వెళుతున్నారు. మోడల్ జిమ్‌ను ప్రారంభించాలి. వినియోగంలోకి తీసుకువస్తే బాగుంటుంది.

-రమేష్, స్థానికుడు

పారిశుధ్యం పెంపుతో స్వచ్ఛభారత్



ఎంకే బేగ్ స్కూల్ రోడ్డులో పూడిక తీస్తున్న డిప్యూటీ మేయర్ గోగుల వెంకటరమణారావు

అజిత్‌సింగ్‌నగర్ : పారిశుధ్యం పెంపుతో స్వచ్ఛభారత్ కల సాకారమవుతుందని, ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని డిప్యూటీ మేయర్ గోగుల వెంకట రమణారావు అన్నారు. అజిత్‌సింగ్‌నగర్ ఎంకే బేగ్ నగరపాలకసంస్థ పాఠశాల రోడ్డులో మంగళవారం ప్రజారోగ్యశాఖ అధికారులు, సిబ్బందితో కలసి డిప్యూటీ మేయర్ స్వచ్ఛ స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. పూడికలు సక్రమంగా తొలగించాలని పారిశుధ్య సిబ్బందికి సూచించిన డిప్యూటీ మేయర్ స్వయంగా పారపట్టి పూడికను తొలగించారు. పచ్చగడ్డి, పిచ్చి మొక్కలను సిబ్బంది తొలగించారు. ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెకర్లు వేణుగోపాలరావు, వెంకటేశ్వరరెడ్డి, సూపర్‌బజార్ డైరెక్టర్ పైడిమర్రి వెంకటరామారావు, శానిటరీ మేస్త్రీలు, పాల్గొన్నారు.

ఇలా ఉంటే దోమలు పెరగవేంటి!

మధురానగర్ వాటర్‌ట్యాంక్ వద్ద అటు చెత్త.. ఇటు మురికినీరు



రోడ్డు పక్కన పడేసిన చెట్ల కొమ్మలు

మధురానగర్ : దోమలపై దండయాత్ర అంటూ పిలుపు ఇచ్చారు... ప్రచార హోరెత్తించారు.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలంటూ హితబోధ చేశారు.. వీఎంసీ అధికారులు. ఇంత బాగా ఊదరగొట్టిన అధికారులు.. వారి తీరును మార్చుకోవడం లేదు. రోడ్డుపై చెత్త వేసినా.. మురుగునీరు ఉన్నా కన్నెత్తి చూడటం లేదు. మధురానగర్ వాటర్‌ట్యాంకు వద్ద పరిస్థితి చూస్తే అర్థమవుతుంది పరిశుభ్రతపై వారికున్న శ్రద్ధ. ఇటీవల డివిజన్‌లో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉంటున్నాయని చెట్లకొమ్మలను విద్యుత్ శాఖ సిబ్బంది నరికి రోడ్లపై పడేశారు. వాటిని కార్పొరేషన్ సిబ్బంది రైవస్ కాల్వ ఒడ్డున పడేశారు. ఇవి వర్షానికి తడిసి అక్కడ నీరు నిలిచాయి. వీటిలో దోమలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉంటే ఆ పక్కనే రోడ్డుమీద గోతుల్లో కూడా వర్షం నీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయని వాపోతున్నారు. కార్పొరేషన్ అధికారులు శ్రద్ధ చూపి చెట్లకొమ్మలను, వర్షం నీటిని తొలగించాలని వారు కోరుతున్నారు.



రోడ్డుపైకి మురుగు నీరు

రైతుబజారు ఎదుట ఐద్వా ధర్నా



పాయకాపురంలో ఇటీవల ఏర్పాటు చేసిన రైతుబజార్‌లో స్టాళ్లను నిబంధనలకు అనుగుణంగా కేటాయించాలని కోరుతూ అఖిలభారత ప్రజాతంత్ర మహిళ సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా జరిగింది. స్టాళ్ల కేటాయింపులు సక్రమంగా జరగ లేదని నేతలు ఆరోపించారు. ఐద్వా సింగ్‌నగర్‌జోన్ కార్యదర్శి ఝాన్సీ, సీఐటీయూ నేత దుర్గారావు, పిచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

-పాయకాపురం

పోటీ తత్వం అలవర్చుకోవాలి



విజయవాడ సెంట్రల్ : పోటీతత్వం అలవర్చుకుంటే అన్ని రంగాల్లో విద్యార్థులు రాణిస్తారని విజయవాడ శానిటరీ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.రామకృష్ణ అన్నారు. మువ్వగోపాల కల్చరల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యాన జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి గెలుచుకుని కళామయూరి అని ప్రశంస పొందిన షణ్ముక అంజనిని సంఘ సభ్యులు గవర్నర్‌పేటలోని గణేష్ పందిళ్ల ప్రాంగణంలో మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో సంఘ సంయుక్త కార్యదర్శి ఎ.సురేష్, సభ్యులు పాల్గొన్నారు.

అడుగేస్తే జారడమే..

● చిత్తడిగా నందమూరునగర్ రోడ్డు
● విజ్ఞప్తి చేసినా పట్టించుకునేవారు లేరు



ఏజెన్సీని తలపిస్తున్న నందమూరునగర్ రోడ్డు..


అజిత్‌సింగ్‌నగర్ : నందమూరునగర్ రోడ్డుపై అడుగేస్తే జారిపడటమే. ఇటీవల ఈ ప్రాంతంలో అపార్టుమెంట్ల నిర్మాణం జోరందుకోవడంతో మధ్యతరగతి వర్గాలు ప్లాట్లను కొనుగోలు చేశారు. ప్లాట్ల నుంచి ప్రధాన రోడ్డుకు వచ్చే రహదారి కచ్చా రోడ్డు కావడంతో చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారుతోంది. బురదమయంగా మారిన రోడ్డుపై రాకపోకలు సర్కస్ ఫీట్లను తలపిస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 200కు పైగా కుటుంబాలకు ఇదే ప్రధాన మార్గం కావడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. వృద్ధులు, పిల్లలు వేరొకరి సాయం లేనిదే రోడ్డుపై నడవలేని పరిస్థితి అక్కడ ఉంది. పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి రోడ్డు దుస్థితిని తీసుకువెళ్లినా ఫలితం లేదని స్థానికులు ఆంధ్రజ్యోతి ఎదుట వాపోయారు. ఇప్పటికైనా వారు స్పందించాలని కోరుతున్నారు.

కౌన్సిల్లో ప్రతిపాదనలు

నందమూరునగర్‌లో రోడ్ల నిర్మాణంపై కౌన్సిల్లో ప్రతిపాదనలు పెట్టాం. సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. రోడ్డు నిర్మించాలని కోరతాం.

- ఎరుబోతు శ్రావణి, కార్పొరేటర్, 52వ డివిజన్

బయటకు రాలేని పరిస్థితి



ప్రధాన మార్గంలో నడవాలంటే ప్రాణం మీదకు వస్తోంది. దీంతో ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే ఆందోళన చెందుతున్నాం. అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా రోడ్డుకు మోక్షం కలగడం లేదు.

-కృష్ణంరాజు, స్థానికుడు

ప్రమాదాలబారిన పడుతున్నాం



రోడ్డు బురదమయంగా ఉంది. ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి కిందపడిపోతున్నాయి. పిల్లలను పాఠశాలలకు తీసుకువెళ్లేందుకు, తీసుకురావడానికి అవస్థ పడుతున్నాం.

- నాగరాజు, స్థానికుడు

పాములు తిరుగుతున్నాయి..



అసలే అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డుకు ఇరువైపులా గడ్డిభూములు ఉన్నాయి. దీంతో పాములు చేరుతున్నాయి. లైట్లు కూడా సక్రమంగా వెలగడం లేదు. బయటకు వస్తే కర్రలను తెచ్చుకోవాల్సిందే.

- చంద్రశేఖరశర్మ

చవితి పందిళ్లలో ఎమ్మెల్యే ఉమా పూజలు



అయోధ్యనగర్‌లో అన్నదానం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్ : అయోధ్యనగర్, అజిత్‌సింగ్‌నగర్, న్యూరాజరాజేశ్వరిపేటలో వినాయకచవితి ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటుచేసిన చవితి పందిళ్లలో మంగళవారం సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ప్రత్యేక పూజలు చేశారు. అయోధ్యనగర్‌లో అన్నదానాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ అర్బన్ నేత చెన్నగిరి రామ్మోహన్, స్థానిక నేతలు పాల్గొన్నారు.



శ్రీనగర్ కాలనీ మొదటిలైన్‌లో..

● సత్యనారాయణపురం : సత్యనారాయణపురం, బావాజీపేట, దుర్గాపురం, ముత్యాలంపాడు, శ్రీనగర్ కాలనీల్లోని పందిళ్లలో వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీనగర్ కాలనీ ఒకటో లైన్‌లో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన మంగళవారం కమిటీ గౌరవ అధ్యక్షుడు కొండా మాలకొండయ్య, దేవరపు మాల్యాద్రి, కనిగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ దేవరపునేని చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు గరికపాటి వీరశేఖర్, కార్యదర్శి నూతంగి వెంకట నరసింహారావు, కోశాధికారి అడుసుమల్లి వెంకట రత్తయ్య తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు

పాయకాపురం : స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు వచ్చాయి. కొన్ని రోజులుగా అప్రకటిత విద్యుత్‌కోత ఉండటం, కరెంట్ వచ్చి పోతోంది. అయితే మంగళవారం సుమారు ఇరవై నిమిషాల పాటు విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు రావడంతో ప్రకాష్‌నగర్ ప్రాంతంలో పలు విద్యుత్ గృహోపకరణాలు పాడయ్యాయి. సరఫరాలో హెచ్చుతగ్గులు రావడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని పలువురు కోరుతున్నారు.

డాక్టర్ బంగారురావు మృతి



విజయవాడ సెంట్రల్ : సూర్యారావుపేట విష్ణువర్ధనరావు వీధిలోని పావని క్లినిక్ డాక్టర్ సీహెచ్ బంగారురావు (60)మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతిపై పలువురు డాక్టర్లు, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలిపారు. ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. పేద, మధ్య తరగతి వర్గాలకు ఆయన చేసిన సేవల్ని గుర్తుచేసుకున్నారు. 21వ డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి, చింతా దుర్గారావు, రమణ, కృష్ణ తదితరులు నివాళులర్పించారు.

సంక్షేమ పథకాలే శ్రీరామ రక్ష



చంద్రన్న బీమా రూ.5 లక్షలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఉమా

అజిత్‌సింగ్‌నగర్/పాయకాపురం/మధురానగర్ : సంక్షేమ పథకాలే ప్రజలకు శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. పాయకాపురం శాంతినగర్‌కు చెందిన బాపిరాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో అతని కుటుంబానికి చంద్రన్న బీమా కింద ఎమ్మెల్యే మంగళవారం రూ.5 లక్షల నగదు అందజేశారు. అదే ప్రాంతానికి చెందిన మరో రెండు కుటుంబాలకు బీమా పథకంలో భాగంగా రూ.10వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో 55వ డివిజన్ కార్పొరేటర్ పిరియా జగదాంబ, టీడీపీ డివిజన్ అధ్యక్షుడు చాగర్లమూడి శ్రీనివాసరావు, పార్టీ అర్బన్ ఉపాధ్యక్షుడు దాసరి కనకారావు, జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షుడు పిరియా సోమేశ్వరరావు, డివిజన్ కార్యదర్శి అమరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బుడమేరు మధ్యకట్టపై..

బుడమేరు మధ్యకట్టపై విజయదుర్గానగర్ ప్రాంతానికి చెందిన కార్మికుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులకు తక్షణ సహాయంగా చంద్రన్న బీమా పథకంలో రూ.5 వేలను డిప్యూటీ మేయర్ రమణారావు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు డివిజన్ గొట్టుముక్కల శేషంరాజు, అర్బన్ నేత గరిమెళ్ల చిన్నాచౌదరి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

44వ డివిజన్‌లో..

స్థానిక 44వ డివిజన్‌లో లబ్ధిదారుడికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కును మంగళవారం ఎంపీ కార్యాలయంలో ఎంపీ కేశినేని శ్రీనివాస్, కార్పొరేటర్ కాకు మల్లికార్జునయాదవ్ అందజేశారు. గులాబీతోట పున్నయ్య కాలనీలో నివసించే తుమ్మి పాపినాయుడు (15) అనే బాలుడు సైకిల్‌పై నుంచి కింద పడటంతో చేయికి తీవ్ర గాయమైంది. అతను చికిత్స చేయించుకోవడానికి ఇబ్బంది పడుతుండగా కార్పొరేటర్ కాకుమల్లికార్జున యాదవ్ ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయించారు. దీంతో రూ.15,480 చెక్కును పంపించారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



చికిత్స ఆస్పత్రి ఆవరణలో అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

పాయకాపురం : అగ్ని ప్రమాదాలు, వాటి నివారణపై పాయకాపురం ఫైర్ స్టేషన్ సిబ్బంది మంగళవారం అవగాహన కల్పించారు. స్థానిక చికిత్స ఆస్పత్రి ఆవరణలో జరిగిన కార్యక్రమంలో వైద్యులు, ఇతర సిబ్బందికి వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చారు. సీఓటూ, డ్రైకెమికల్ పౌడర్ వినియోగం, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అగ్నిప్రమాదాలు సంభవించినపుడు వైద్య సిబ్బంది రోగులను ఎలా రక్షించాలి అనే అంశాన్ని వివరించారు. పాయకాపురం ఫైర్ ఆఫీసర్ ఎస్‌కే నజీర్‌బాషా మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు ఏర్పడితే భయపడకుండా తప్పించుకునే మార్గం చూడాలన్నారు. కార్యక్రమంలో ఫైర్ స్టేషన్ సిబ్బంది, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మెల్యే డైరీ

ఎమ్మెల్యే గద్దెరామ్మోహన్ బుధవారం కాకినాడ ఎన్నికలపై సీఎం ఇంటి వద్ద ఉదయం నుంచి రాత్రి వరకు జరిగే సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. కార్యాలయంలో అందుబాటులో ఉండరు.



ఎమ్మెల్సీ డైరీ

ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న బుధవారం నగరంలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు



కృష్ణలంకలోని ఆనంద్ భవన్ రోడ్డులో మహారాష్ట్ర తలపాగా వేషధారణలో విఘ్న వినాయకుడు

పరిమితికి మించితే చర్యలు

- నగరంలో ప్రత్యేక డ్రైవ్
- ఆటో డ్రైవర్లకు డీసీపీ క్రాంతి రాణా హెచ్చరిక
- 45 ఆటోలు సీజ్ ● 257 మంది ఆటో డ్రైవర్లకు ఈ - చలానాలు ● 267 మందికి ఈ నోటీసులు



సర్వీస్ ఆటోలను ఆపి కేసులు నమోదు చేస్తున్న ట్రాఫిక్ సీఐ మహేంద్ర

గుణదల: పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని ఆటోలు నడిపే వారిపై చర్యలు తీసుకుంటామని డీసీపీ క్రాంతి రాణా టాటా తెలిపారు. సీపీ గౌతం సవాంగ్ ఆదేశాల మేరకు నగరంలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని ఆటోలు నడిపే వారిపై కేసులు నమోదు చేసేందుకు ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ అధికారులు సంయుక్తంగా నగరంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.

ఇబ్రహీంపట్నం, కొత్తపేట, బందర్ రోడ్డు, కంకిపాడు, గన్నవరం, ఎనికేపాడు తదితర ప్రాంతాలలో డ్రైవ్ నిర్వహించి పరిమితికి మించి ప్రయాణికులతో వెళుతున్న 45 ఆటోలను సీజ్ చేశారు. అలాగే 257 మంది ఆటో డ్రైవర్లకు ఈ-చలాన్లు, 267 ఆటో డ్రైవర్లకు ఈ-నోటీసులు అందజేశారు. ఆటో డ్రైవర్లు వాహనానికి సంబంధించిన ఇన్సూరెన్స్, పరిమిట్, సీబుక్, లైసెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్లను విధిగా వారి వెంట ఉంచుకోవాలని డీసీపీ క్రాంతి రాణా టాటా తెలిపారు. ఎవరైనా ప్రయాణికులు వాహనంలో బ్యాగులు వదిలి వెళ్ళి పోతే అటువంటి బ్యాగ్‌లను దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి అందజేయాలని కోరారు.

సీఎం, గద్దె కోసం పూజలు



చంద్రబాబు 2019లో అధికారంలోకి రావాలని పూజలు చేస్తున్న టీడీపీ డివిజన్ నాయకులు

కృష్ణలంక : సీఎం,ఆయురారోగ్యాలతో ఉండాలని, వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి ం గద్దె రామ్మోహన్ అధ్వర్యంలో తూర్పు నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకెళ్లాలని కాంక్షిస్తూ టీడీపీ నాయకులు గణపతికి పూజలు చేశారు. 24వ డివిజన్ తెలుగుదేశం, తెలుగుయువత నాయకులు మంగళవారం భ్రమరాంబపురంలోని సతీష్ కుమార్ రోడ్డులో గల వినాయక చవితి పందిరి వద్ద టీడీపీ డివిజన్ అధ్యక్షుడు పలిశెట్టి అన్నారావు , గజ్జలకొండ కృష్ణ, సూదా లక్ష్మణరావు, బాలబొమ్మ రంగ, విజ్జి మహేష్, పైడి మోహన్, శారద, పుల్లమ్మ, సమతం రమణ పూజల్లో పాల్గొన్నారు.

కుటుంబ బంధం పిల్లలకు చెప్పాలి

నెల్లూరు రవీంద్ర భారతిలో గ్రాండ్ పేరెంట్స్ డే



గ్రాండ్ పేరంట్స్ డేలో చిన్నారుల నృత్యం



మొగల్రాజపురం: సాంకేతికత పెరుగుతున్న ఈ రోజుల్లో కుటుంబ వ్యవస్థ, విలువలు, బంధాలను పిల్లలకు చెప్పాలని నెల్లూరు రవీంద్ర .భారతి పాఠశాలల జీఎం శివారెడ్డి అన్నారు. మొగల్రాజపురం బ్రాంచ్‌లో ప్రైమరీ, ప్రీప్రైమరీ విద్యార్థుల తల్లిదండ్రులు, వారి తాత, అమ్మమ్మ, నాయనమ్మలతో గ్రాండ్ పేరంట్స్ డే మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో పిల్లలు ఉన్నత స్థాయికి ఎదగాలంటే ఇంట్లో ఉండే పెద్దలతో పిల్లలు ఎలా నడచుకోవాలో తల్లింద్రులు తెప్పాలని అలాగే వారు కూడా మెలగినపుడే తల్లిదండ్రులను పిల్లలు ఆదర్శంగా తీసుకుంటారని సూచించారు. అనంతరం పిల్లలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. పిల్లల తాత, అమ్మమ్మ. నాయనమ్మలకు వేదిక మీద సత్కరించారు. పెద్దలు మాట్లాడుత తమకు గుర్తింపు ఇవ్వడంతో పాలు పిల్లలకు కూడా తెలిసేలా చేయడం పట్ల పాఠశాల యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. జోనల్ ఇన్‌ఛార్జి మహేష్, పాఠశాల జోనల్ డీన్ సుబ్బలక్ష్మి, డీన్ సత్యచిత్ర, ప్రిన్సిపాల్ షబానా పాల్గొన్నారు.

పటమటలంకలో



అలరించిన చిన్నారుల నృత్యం

పటమట : పటమటలంకలోని నెల్లూరి రవీంద్ర భారతి పాఠశాల లో మంగళవారం గ్రాండ్ పేరంట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తాతామామ్మ,అమ్మమ్మలతో కలసి దిగిన ఫోటోలను ప్రదర్శనగా ఉంచారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

నేడు ఆటోనగర్ స్టోర్సు కమిటీ సర్వ సభ్య సమావేశం

ఆటోనగర్ : జవహర్ ఆటోనగర్ స్టోర్సు సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు పాలక కమిటీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. హౌసింగ్ ప్రాజెక్టు లబ్ధిదారులు ఈ సమావేశానికి హాజరు కావాలని వారు కోరారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

పాయకాపురం : అగ్ని ప్రమాదాలు, వాటి నివారణపై పాయకాపురం ఫైర్‌స్టేషన్ సిబ్బంది మంగళవారం అవగాహన కల్పిం చారు. స్థానిక చికిత్స ఆస్పత్రి ఆవరణలో జరిగిన కార్యక్రమంలో వైద్యులు, ఇతర సిబ్బందికి వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చారు. సీఓటూ, డ్రైకెమికల్ పౌడర్ వినియోగం, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

సబ్‌వే పనులు వేగవంతం చేయాలి

సీపీఎం ధర్నా



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కృష్ణలంక : అగ్నిమాపక కేంద్రం వద్ద అసంపూర్తిగా నిర్మించిన సబ్‌వే పనులు త్వరగా పూర్తి చేయాలని సీపీఎం నాయకులు మంగళవారం సబ్‌వే వద్ద ధర్నా చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి దోనేపూడి కాశీనాథ్ నేతృత్వం వహించారు. ఆయన మాట్లాడుతూ అగ్నిమాపక కేంద్రం వద్ద గత ఏడాది ప్రారంభించిన సబ్‌వే నిర్మాణం ఇంతవరకు పూర్తికాకపోవడం విచారకరమన్నారు. కృష్ణలంక సర్వీసు రోడ్డులో ఆర్చ్ రోడ్డు నుంచి నల్లగేటు సెంటర్ వరకు తారురోడ్డు వేయకుండా కంకర వేసి వదిలేశారని మండిపడ్డారు. నిర్మాణం ఎందుకు ఆగిందో ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. హైవేకు అనుసంధానించి నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ నిర్మాణం కూడా నిలిచిపోయిందని, ఇదే విషయాన్ని సంబంధిత కాంట్రాక్టరును అడుగగా హైవే కేంద్రానికి సంబంధించింది కనుక అనుమతులు రాలేదంటున్నారని, ఈ విషయంపై వాస్తవాలు నిగ్గుతేల్చాలన్నారు. కృష్ణలంక వాసులు ఇబ్బందులు పడుతుంటే అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టనట్లు ప్రవర్తిస్తున్నాని ఆరోపించారు. సబ్‌వే నిర్మాణానికి అనుమతి రాకపోతే ఆ బాధ్యతను ఎంపీ, ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వం లో ఎవరు స్వీకరిస్తారని కాశీనాథ్ ప్రశ్నించారు. సీపీఎం నాయకులు లక్ష్మీనారాయణ, రంగారావు, భాను, బాబు, రమణ, జనార్దన్, లక్ష్మి, సరోజనమ్మ పాల్గొన్నారు.

ఆటోనగర్‌లో గణపతికి పూజలు



గణనాథుడికి పూజలు చేస్తున్న మెకానిక్ సభ్యులు వేమూరి. పార్ధసారథి, గంధం కొండా తదితరులు

ఆటోనగర్ : ఆటోనగర్‌లో గణపతి నవరాత్రులు వేడుకగా జరుగుతున్నాయి.నాలుగో రోడ్డులో శ్రీ వెంకటేశ్వర మెకానికల్ వర్క్స్ ఆవరణలో విఘ్నేశ్వరుని విగ్రహానికి గులాబీలతో మంగళవారం పూజలు చేశారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గంధం వెంకటేశ్వరరావు (కొండా) మాట్లాడుతూ శనివారం భక్తులకు అన్నప్రసాద వితరణ సాయంత్రం భారీ ఊరేగింపు, నిమజ్జనం జరుగుతుందని తెలిపారు. ఏటీఏ మాజీ అధ్యక్షుడు గొల్లపూడి నాగేశ్వరరావు, మాజీ కోశాధికారి పంచకర్ల వెంకటరమణ, కొట్టికృష్ణ వేమూరి పార్ధసారధి, మాదల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పోటీతత్వం అలవర్చుకోవాలి

విజయవాడ సెంట్రల్ : పోటీతత్వం అలవర్చుకుంటే అన్ని రంగాల్లో విద్యార్థులు రాణిస్తారని విజయవాడ శానిటరీ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.రామకృష్ణ అన్నారు. షణ్ముక అంజనిని సంఘ సభ్యులు గవర్నర్‌పేటలోని గణేష్ పందిళ్ల ప్రాంగణంలో మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో సంఘ సంయుక్త కార్యదర్శి ఎ.సురేష్, సభ్యులు పాల్గొన్నారు.

నేత్రదానంపై విద్యార్థులకు పోటీలు

బెంజ్‌సర్కిల్ : నేత్రదాన పక్షోత్సవాలలో భాగంగా స్వేచ్ఛా గోరా ఐ బ్యాంకు ఆధ్వర్యంలో బుధవారం బెంజ్‌సర్కిల్‌లో గల వాసవ్య మహిళా మండలి ఇన్ఫర్మేషన్ హాలులో వ్యాస రచన పోటీలు నిర్వహించనున్నట్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ జి. సమరం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31న డ్రాయింగ్,సెప్టెంబరు 1న పాటలు, 2న క్విజ్ పోటీలు నిర్వహించనున్నామన్నారు. ఈ పోటీలకు నగరంలోని హైస్కూల్, కళాశాలల విద్యార్థులు అర్హులని తెలిపారు. విజేతలకు సెప్టెంబరు 8న బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 9704020303 ఫోన్ నెంబరును సంప్రదించాలని సూచించారు.

ఇవేమి రోడ్లు బాబోయ్..!

● బురద నీటిలో సర్వీసు రోడ్డు
● పూడుకుపోయిన సైడు కాలువలు
● అవస్థలు పడుతున్న వాహనదారులు

రోడ్లు బాగుంటే ప్రయాణం హాయిగా ఉంటుంది. అదే రాళ్లు తేలి, గోతులు పడితే ఒళ్లు, బళ్లు హూనమే. ఇలాంటి పరిస్థితి బెంజిసర్కిల్, భారతీనగర్ పరిధిలో పలుచోట్ల కనిపిస్తోంది. కొన్నిచోట్ల తూతూమంత్రంగా మరమ్మతులు చేస్తే, మరికొన్నిచోట్ల వదిలేశారు. ఇక ప్రయాణికుల పాట్లు ఆ దేవుడికే ఎరుక. అవసరమైన చోట్ల రోడ్లను బాగుచేస్తే రయ్యిన వెళ్లిపోవడమే.



బురద నీటిలో మునిగిన వేదిక సర్వీసు రోడ్డు

పటమట: బెంజిసర్కిల్ నుంచి వేదిక కల్యాణ మండపం మీదుగా వెళ్లే సర్వీసు రోడ్డు అధ్వానంగా తయారైంది. సైడ్ డ్రెయిన్‌లు పూడుకుపోయాయి. వర్షం నీరు వెళ్లడానికి దారి లేదు. దాంతో ఆ నీళ్లన్నీ సర్వీసు రోడ్డు నిండి పోతోంది. గతం నుంచి వేదిక కల్యాణ మండపం నుంచి ఎస్వీఎస్ కల్యాణ మండపం వరకుసైడు కాలువ వ్యవస్థ పటిష్టంగా లేదు. సాధారణ రోజు ల్లోనే ఈ డ్రెయిన్‌లోని నీరు సర్వీసు రోడ్డుపైకి చేరుతుంది. ఇక వర్షాకాలం వస్తే పరిస్థితి చెప్పనక్కరలేదు .సమీపంలో ఫ్లైవోవర్ ఫిలర్ల నిర్మాణ పనులు జరుగుతుండటంతో ఆ మట్టి వర్షపు నీటిలో కలిసి బురదమయమైంది.

శ్రీరామచంద్రనగర్ కాలనీలో

భారతీనగర్ : రెండో డివిజన్‌లోని శ్రీరామచంద్రనగర్ కాలనీ ప్రధాన రహదారులు గోతులుగా తయారైంది. నిత్యం వాహనదారులు ఇటుగా రాకపోకలు సాగించడం వల్ల ఒళ్లు హూనం అవుతోంది వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రీరామచంద్రనగర్ కాలనీ ప్రధాన రహదారి మహానాడు రోడ్డు, పంట కాలువ రోడ్లకు అనుసంధానంగా ఉంటుంది. ఇటీవల శ్రీరామచంద్రనగర్ కాలనీ రోడ్లను తవ్వి పైపులు వేశారు. వాటిని నామ మాత్రంగా పూడ్చి వేయడంతో వాహనాల రాకపోకలకు గోతులు ఏర్పడ్డాయి. వీటిలో నీరు చేరి గుంతలు కనిపించడం లేదని వాహన దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గోతుల్లో పడి ఎక్కడ ప్రమాదాలకు గురవుతామోనని వాహనదారులు భయపడు తున్నారు. అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



శ్రీరామచంద్రనగర్ కాలనీ పంటకాలవ రోడ్డులో ఏర్పడిన పెద్ద గొయ్యి



పూడుకు పోయిన సైడు డ్రెయిన్



శ్రీరామచంద్రనగర్ కాలనీలో

మాతృభాష తల్లయితే సంస్కృతం అమ్మమ్మ

తెలుగు భాషా దినోత్సవంలో రమణమూర్తి

లబ్బీపేట : మాతృభాష తల్లి అయితే సంస్కృతం అమ్మమ్మ లాంటిదని సంస్కృత ఉపన్యాసకులు డాక్టర్ రమణమూర్తి అన్నారు. సిద్ధార్థ మహిళా కళాశాల తెలుగు విభాగ ఆధ్వర్యంలో మంగళవారం తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు సంస్కృతాన్ని వాడుక భాషలో ఉపయోగిస్తున్నామని ప్రౌఢభాషను గిడుగు పంతులుగారు పండితులను సైతం ఒప్పించి సరళమైన భాషగా భాషోధ్యయం చేసి గిడుగు వారు గొప్పవరాన్ని మనకు అందించారని తెలిపారు. మన తల్లి తెలుగు తల్లి కల్పవల్లి అని గిడుగు వెంకటరామమూర్తి జన్మించిన రోజు ఆగస్టు 29న తెలుగుభాషా దినోత్సవాన్ని జరుపుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినులకు గిడుగు వారిపై వ్యాసరచన, పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలిచిన వారికి బహుమతులు అందజేశారు.

ప్రిన్సిపాల్ టి.విజయలక్ష్మి, తెలుగు విభాగ అధ్యక్షురాలు డాక్టర్ ఏ.నాగజ్యోతి, డాక్టర్ కె.సరళ, డాక్టర్ ఐ. మంజుల ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న రమణమూర్తి

ఇండియన్ స్ప్రింగ్స్ విద్యార్థులకు అభినందన



రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిన ఇండియన్ స్ప్రింగ్స్‌విద్యార్థులు

పటమట : రాష్ట్ర స్థాయి తైక్వాండ్ (కొరియన్ మార్షల్ ఆర్ట్స్) పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎన్‌ఆర్ఐ ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాల అకడమిక్ డైరెక్టర్ కొమ్మారెడ్డి చైతన్య మంగళవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. ఈనెల 29న ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో పాఠశాలకు చెందిన పి. షర్మిత (9వ తరగతి), కె. శ్యామ్ శంకర్ (7వ తరగతి), కె. జయదీప్ సాయి (5వ తరగతి) విద్యార్థులు వివిధ విభాగాలలో బంగారు పతకాలను సాధించడంతో పాటు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.

పటమటలో గణపతి నిమజ్జన వేడుకలు

పటమట : పటమటలోని మోహన్‌దాస్ థియేటర్ వద్ద ఏర్పాటు చేసిన గణనాథుని నిమజనాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైసీపీ తూర్పు నియోజక వర్గ ఇన్‌చార్జి బొప్పన భవకుమార్ ఊరేగింపు ప్రారంభించారు. లడ్డూను వేలంపాట నిర్వహించ గా బొప్పన భవకుమార్ దానిని దక్కించుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో చెన్ను సురేష్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



లడ్డూను ఊరేగింపుగా తీసుకువెళ్తున్న వైసీపీ నేత బొప్పన భవకుమార్

ఇంటి పన్నుల బకాయిలు చెల్లించాలి

ఈవోఆర్డీ సీతారామరాజు

పెనమలూరు: ఈ ఏడాది ఇంటి పన్నుల బకాయిలను యజమానులు వెంటనే చెల్లించాలని ఎరియర్స్ ఉంటే వాటిపై వచ్చే ఏడాది జరిమానా విధిస్తామని ఈవోఆర్డీ సీతారామరాజు తెలిపారు. పది గ్రామాల్లో రూ.11 కోట్ల వరకు ఇంటి పన్నులు వసూళ్లు చేయాల్సి ఉండగా రూ.9.20 కోట్లు (82 శాతం) వసూళ్లు జరిగాయని ఇంకా 18 శాతం బకాయిలు ఉన్నాయన్నారు. కొందరు విదేశాల్లో ఉండటం, మరికొందరు చెల్లించలేకపోవడం ఎరియర్స్ కింద నమోదు చేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా బకాయిలు ఉన్న యజమానులు పంచాయతీ కార్యాలయంలో చెల్లించి రసీదు పొందాలన్నారు. లేనిపక్షంలో ఎరియర్స్ కింద వచ్చే ఏడాది ఇంటి పన్నుతో పాటు అధనంగా జరిమానా విధిస్తామన్నారు. మూడేళ్ల పన్ను చెల్లించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

2030 వరకు టీడీపీకి ఎదురులేదు

పెనమలూరు: రాష్ట్రంలో 2030 వరకు టీడీపీకి ఎదురులేదని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. నంద్యాల, కాకినాడ ఉప ఎన్నికల ప్రచారాన్ని ముగించుకొని మంగళవారం ఆయన స్వగ్రామం చేరుకున్నారు. కానూరు నుంచి పోరంకి వరకు అభిమానులు ఎమ్మెల్యేని ఘనంగా స్వాగతించి ర్యాలీ నిర్వహించారు. పోరంకి పార్టీ కార్యాలయం లో కేక్ కోసి కార్యకర్తలకు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ చేస్తున్న అభివృద్ధికి రాష్ట్ర ప్రజలు ఆకర్షితుల య్యారని, జగన్ పార్టీని ప్రజలు ఆదరించడం లేదన్నారు. 2019 ఎన్నికల్లో జగన్ పార్టీ కనుమరుగైపోతుందన్నారు. ఎన్నికల ఫలితాల తరువాత కాం గ్రెస్‌లో విలీనం చేసి జగన్ శేషజీవిత జైలులో గడుపుతారన్నారు.